RNI No. APTEL/2008/23088

# తెలంగాణ పత్రిక

TELANGANA PATRIKA
TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

నిజం మా విజన్

Epaper.Telanganapatrika.in




EDITOR: BOORLA VENKATESHAM KARIMNAGAR VOLUME: 19 ISSUE: 125 THURSDAY, OCTOBER 15, 2026 PAGES: 12 COST: 2 /-

ఎడిటర్ : బూర్ల వెంకటేశం కరీంనగర్ సంపుటి : 19 సంచిక : 125 గురువారం, అక్టోబర్ 15, 2026, పేజీలు : 12 వెల : 2/-

CIRCULATED BY : ADILABAD, ASIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULAMBA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOOBNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRCILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI

# రాష్ట్రంలో పెట్టుబడులు సురక్షితం

- యూకే మేయర్ల బృందంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- రానున్న రోజుల్లో తయారీ రంగంపై ప్రత్యేక దృష్టి
- డిసెంబర్ 7-9 తేదీల్లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్
- బ్రిటన్ పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలకు సీఎం ఆహ్వానం



**హైదరాబాద్:** తెలంగాణలో పెట్టుబడులు పెట్టే సంస్థలకు విధానపరమైన కొనసాగింపు ఉంటుందని, పెట్టుబ డులు సురక్షితంగా ఉంటాయని సీఎం రేవంత్‌రెడ్డి బ్రిటన్ ప్రతినిధి బృందానికి భరోసా ఇచ్చారు. నైపుణ్యం కలి గిన మానవ వనరులు, అనుకూల వ్యాపార వాతా వరణం తెలంగాణకు బలమని చెప్పారు. ప్రపంచంలోని ఇతర రాష్ట్రాలతో తెలంగాణ పోటీపడు తోందని, రానున్న కొన్నేళ్లలో తయారీ రంగం అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యమి స్తామని స్పష్టం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని డాక్టర్ ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలో బ్రిటన్‌లోని యార్క్‌షైర్ ప్రాంతానికి చెందిన ఉన్నతస్థాయి ప్రతినిధి బృందంతో సీఎం సమావేశమ య్యారు. దక్షిణ యార్క్‌షైర్ మేయర్ ఒలివర్ కాప్‌కార్డ్, వెస్ట్ యార్క్‌షైర్ మేయర్ ట్రేసీ బ్రాబిన్, యార్క్ అండ్ నార్త్ యార్క్‌షైర్ మేయర్ డేవిడ్ స్కైత్ ఈ బృందానికి నేతృత్వం వహించారు. భారత్-బ్రిటన్ సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం నేపథ్యంలో తెలంగాణ, యూకే ప్రాంతాల మధ్య వాణి జ్యం, పెట్టుబడులు, ఆవిష్కరణలు, విద్య, సాంస్కృతిక రంగాల్లో సహకారాన్ని విస్తరించడంపై చర్చించారు. దేశంలోనే అతి పిన్న వయసున్న రాష్ట్రంగా తెలంగాణ ఐటీ, ఔషధాలు, జీవశాస్త్రాలు, బయోటెక్నాలజీ, ఏరోస్పేస్, రక్షణ, ఎల క్ట్రానిక్స్ తయారీ రంగాల్లో గణనీయమైన పురోగతి సాధిస్తోందని సీఎం వివరించారు. డిసెంబర్ 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026కు బ్రిటన్ పెట్టుబడిదారులు, పారిశ్రామిక వేత్తలను ఆహ్వానించారు.

**నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక విశ్వవిద్యాలయం**

కృత్రిమ మేధ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో యువతకు అవసరమైన నైపుణ్యాలను అందించడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని సీఎం ఈ సందర్భంగా తెలి పారు. పరిశ్రమల భాగస్వామ్యంతో నేరుగా నైపుణ్య శిక్షణ అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసినట్లు వివరించారు. తెలంగాణ దీర్ఘకాలిక అభివృద్ధి ప్రణాళిక 'తెలంగాణ రైజింగ్-2047' రూపకల్పన లో బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్ కీలకమైన విజ్ఞాన భాగస్వామిగా వ్యవహరించారని చెప్పారు. 30 వేల ఎకరాల్లో ప్రపంచస్థాయి ఉపగ్రహ నగరంగా అభివృద్ధి చేయ నున్న (మిగతా 2లో)



## పట్టభద్రుల పోరు.. ఎర్రసైన్యం దారేటు?

**గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలపై వామపక్షాల దృష్టి**

**కీలకంగా మారిన సీపీఐ, సీపీఎం ఓటు బ్యాంక్**

**ప్రధాన పార్టీల్లో మొదలైన టెన్షన్.!**

తెలంగాణ పత్రిక ప్రత్యేక కథనం

తెలంగాణ రాజకీయం ప్రస్తుతం గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల చుట్టూ తిరుగుతోంది. ప్రధాన రాజకీయ పార్టీలన్నీ ఈ 'పెద్దల సభ' స్థానాలను కైవసం చేసుకునేందుకు రకరకాల వ్యూహాలకు పదును పెడుతుండగా, అందరి చూపు ఇప్పుడు వామపక్షాల వైపే మళ్లింది. రాష్ట్రంలో బలమైన ఉపాధ్యాయ, నిరుద్యోగ, కార్మిక వర్గాల మద్దతు కలిగిన సీపీఐ, సీపీఎం పార్టీలు ఈ పోరులో ఎలాంటి దారి ఎంచుకోబోతున్నాయనేది రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠను రేపుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో అవగాహన కుదుర్చుకుని ముందుకు సాగిన వామపక్షాలు, ఈ ఎమ్మెల్సీ ఎన్నికల నాటికి అదే బంధాన్ని కొనసాగిస్తాయా లేక సొంతంగా బరిలోకి దిగుతాయా అనేది ప్రధాన ప్రశ్నగా మారింది. పట్టభద్రుల (మిగతా 2లో)



## పాలమూరు కృష్ణమ్మ పరుగు

**నార్లాపూర్ రిజర్వాయర్‌లోకి ఎత్తిపోతలు ప్రారంభించిన మంత్రి జూపల్లి.!**

తెలంగాణ పత్రిక ప్రతినిధి, నాగర్ కర్నూల్

నాగర్‌కర్నూల్ దక్షిణ తెలంగాణ సుజల స్వప్నమైన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో మరో ప్రాధాన్య ఘట్టం ఆవిష్కృతమైంది. నాగర్‌కర్నూల్ జిల్లా నార్లాపూర్ పంప్ హౌస్‌లోని రెండవ పంపును రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు బుధవారం ప్రారంభించారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం రెండు బాహుబలి మోటార్లను ఆన్ చేసి నార్లాపూర్ రిజర్వాయర్‌లోకి నీటి ఎత్తిపోతలను అధికారికంగా పునఃప్రారంభించారు. శ్రీశైల జలాశయంలో నీటిమట్టాలు క్షీణిస్తున్న నేపథ్యంలో, ముందుజాగ్రత్తగా నార్లాపూర్‌లో నీటిని నిల్వ చేసి తాగునీటి అవసరాలకు వినియోగించాలని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

**దశాబ్దాల కష్టాలకు ముగింపు.. ప్రాజెక్టు చరిత్ర ఇదీ**

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వాసులు ఎదుర్కొంటున్న తీవ్ర తాగు, సాగునీటి ఎద్దడిని తీర్చేందుకు ఈ భారీ ప్రాజెక్టు రూపుదిద్దుకుంది. మొదట జూరాల ఆధారంగా ఈ పథకాన్ని రూపకల్పన చేసినప్పటికీ, తెలంగాణ ఆవిర్భావం తర్వాత లభ్యత ఆధారంగా శ్రీశైలం వెనుక జలాల నుంచి నీటిని తరలించేలా ప్రాజెక్టు డిజైన్‌ను మార్చారు. సుమారు 50 టీఎంసీలకు పైగా నీటిని వివిధ దశల్లో ఎత్తిపోతల ద్వారా తరలించేలా బృహత్తర ప్రణాళికను అమలు చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో మెజారిటీ పనులు పూర్తి కాగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మిగిలిన పెండింగ్ పనులను వేగవంతం చేసింది. డిసెంబర్ నాటికి (మిగతా 2లో)

# సింగరేణికి కేటీఆరే శ్రీరామరక్ష

**సింగరేణికి కేటీఆరే శ్రీరామరక్ష**

**కాంగ్రెస్ అక్రమాలపై సమరశంఖం**

**పూరించిన గులాబీ దళపతి..!**



తెలంగాణ పత్రిక ప్రతినిధి గోదావరిఖని

తెలంగాణ ప్రాణవాయువు వంటి సింగరేణి సంస్థను కాపాడుకోవడం కోసం, కార్మికుల స్వేదబిందువులకు అండగా నిలవడం కోసం భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గోదావరిఖని గడ్డపై ఎలుగెత్తి చాటిన సింహగర్జన నేడు రాష్ట్ర రాజకీయాల్లోనే కాక కార్మిక లోకంలోనూ సరికొత్త ఉత్తేజాన్ని నింపింది. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని సింగరేణి స్టేడియం వేదికగా జరిగిన సింగరేణి కార్మిక గర్జన బహిరంగ సభకు తరలివచ్చిన అశేష జనవాహిని జలసముద్రమై పోటెత్తింది. ఎటు చూసినా గులాబీ జెండాల నడుమ, కార్మికుల గుండెల్లో నిండిన ఆక్రోశం, కేటీఆర్ వాగ్ధాటికి లభించిన అద్భుతమైన స్పందన ఆ వేదికను చారిత్రాత్మక ఘట్టంగా మలిచాయి. కార్మికుల హక్కుల కోసం, సంస్థ ప్రయోజనాల పరిరక్షణ కోసం కేటీఆర్ చేసిన వీరోచిత ప్రసంగం సభలోని ప్రతి ఒక్కరిలోనూ అజేయమైన పోరాట స్ఫూర్తిని రగిలించింది. తెలంగాణ ఉద్యమ ప్రయాణంలో సింగరేణి కార్మికులు వహించిన క్రియాశీల పాత్రను, సకల జనుల సమ్మె సమయంలో ప్రాణాలను సహితం పణంగా పెట్టి సాగించిన మహోద్యమాన్ని కేటీఆర్ తమ ప్రసంగంలో అత్యంత భావోద్వేగంగా స్మరించుకున్నారు. "చావుతో సహవాసం చేసే ధమ్మున్నోళ్లు సింగరేణి కార్మికులు" అని కేటీఆర్ పలికిన మాటలు కార్మికుల శ్రమకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచాయి. కేసీఆర్ నాయకత్వంలో సింగరేణి కార్మికుల సంక్షేమానికి తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలను, రద్దయిన డిపెండెంట్ ఉద్యోగాలను పునరుద్ధరించిన ఘనతను, కార్మికుల లాభాల వాటాను ఏకంగా ముప్పై రెండు శాతానికి పెంచిన తీరును సభకు సమగ్రంగా వివరించారు. నాటి కేసీఆర్ పాలనా కాలంలో సింగరేణి సంస్థ అత్యున్నత ప్రగతిపథంలో నిలిచి, దేశానికే ఆదర్శంగా వెలిగిందని, కార్మిక కుటుంబాలకు సంపూర్ణ భద్రత లభించిందని కేటీఆర్ సగర్వంగా ప్రకటించారు. అటువంటి వైభవ సంపన్నమైన సింగరేణి సంస్థను నేడు కాంగ్రెస్ పాలనలో తీవ్ర నిర్లక్ష్యానికి గురిచేస్తున్నారని కేటీఆర్ నిప్పులు చెరిగారు. "నైనీ బ్లాక్ టెండర్లలో ప్రభుత్వానికి రూ. 30 వేల కోట్లు మిగిలాయని చెబుతున్నప్పుడు, ఆ మొత్తాన్ని మింగాలనుకున్నది ఎవరు? అసలు అక్కడ ఏం జరిగింది?" అని ఆయన సంధించిన ప్రశ్నలు పాలకుల నిద్ర చెడగొట్టాయి. నైనీ బొగ్గు బ్లాక్ టెండర్లు, సైట్ విజిట్ సర్టిఫికెట్ల సాకుతో రూ. 10 వేల కోట్ల మేర భారీ అవకతవకలు జరిగాయని, రెండేళ్లలోనే రూ. 6,317 కోట్ల సింగరేణి నిధులు పక్కదారి పట్టాయని ఆధారాలతో సహా ప్రభుత్వాన్ని నిలదీసిన కేటీఆర్ ధైర్యం కార్మిక లోకంలో కొండంత భరోసానింపింది. "అవినీతి రైజింగ్.. ప్రొడక్షన్ ఫాలింగ్" అంటూ ప్రభుత్వ అసమర్థతను ఎండగట్టిన తీరు కేటీఆర్ విషయ పరిజ్ఞానానికి, అధ్యయన శీలతకు అద్దం పట్టింది. "బొగ్గును మాయం (మిగతా 2లో)

# ఏ పక్షమైనా అభివృద్ధిలో వివక్ష లేదు

**ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో**

**రాజకీయాలకు తావులేదు**

**రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి**

**హైదరాబాద్:**

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆ కుటుంబం ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గాలకే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు పరిమితమైతే రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పార్టీల తేడా లేకుండా రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గాన్ని సమానంగా చూస్తోందని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పోచారంలో ఇందిరమ్మ ఇండ్ల టవర్స్‌కు రంగారెడ్డి జిల్లా



ఇన్‌చార్జి మంత్రి, పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డిలతో కలిసి బుధవారం శంకుస్థాపన (మిగతా 2లో)

## ఇక టోల్ వలుచుడే..

**ఎన్‌హెచ్ 563పై నేటి నుంచి టోల్ వసూలు**

**కరీంనగర్ రిజిస్ట్రేషన్ వాహనాలకు సాధారణ చార్జీలు**

**ఇతర జిల్లా వాహనాలకు ఆటో, కార్లకు రూ.160, భారీ వాహనాలకు రూ.1,020**

**త్వరలో ప్రధాని చేతుల మీదుగా జాతికి అంకితం**



**కరీంనగర్:** ఉత్తర తెలంగాణ పారిశ్రామిక ప్రగతికి దోహదం చేసే జాతీయ రహదారి ఎన్‌హెచ్ 563పై టోలు వసూలుకు రంగం సిద్ధమైంది. అక్టోబర్ 15 నుంచి రహదారిపై ప్రయాణించే అన్ని వాహనాల నుంచి టోలు వసూలుకు భారత జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) అన్ని ఏర్పాట్లు చేసింది. ఎన్‌హెచ్ 563ని రెండు సెక్షన్లుగా విభజించారు. 68 కి.మీ. మేర కరీంనగర్-వరంగల్ సెక్షన్ కాగా జగిత్యాల- కరీంనగర్ సెక్షన్ 59 కి.మీ.లతో నిర్మించ తలపెట్టారు. ఇందులో 68 కి.మీ. మేర ఉన్న కరీంనగర్-వరంగల్ (మిగతా 2లో)



## హైదరాబాద్ రెస్టారెంట్లలో ఆహార భద్రత గాలికి

**టీజీ సేఫ్ దాడులు, 4 సంస్థలు సీజ్, పలు హోటళ్లకు నోటీసులు..!**

తెలంగాణ పత్రిక ప్రతినిధి హైదరాబాద్

హైదరాబాద్ లాభార్జనే ధ్యేయంగా ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న రెస్టారెంట్లపై ఆహార భద్రతా అధికారులు టీజీ సేఫ్ ఉక్కుపాదం మోపుతు న్నారు. అమీర్‌పేట్, జూబ్లీహిల్స్, మాదాపూర్, చిక్కడపల్లి, హాఫీజ్‌పేట్ సహా నగరంలోని పలు కీలక ప్రాంతాల్లో ఏడు ప్రత్యేక (మిగతా 2లో)

## తెలంగాణ ప్రజలారా..! ఊపిరి పీల్చుకోండి



**వాన కబురు వచ్చింది..**

తెలంగాణ పత్రిక ప్రతినిధి హైదరాబాద్

తెలుగు రాష్ట్రాల్లో కొనసాగుతున్న వేడి వాతావరణానికి త్వరలో ఉపశమనం లభించనుంది. రాబోయే రెండు మూడు రోజుల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎమ్‌డీ అంచనా వేసింది. ముఖ్యంగా కొన్ని ప్రాంతాల్లో హెవీ రెయిన్ హెచ్చరికలు కూడా జారీ అయ్యాయి. తెలంగాణ రాష్ట్రాల్లో గత కొద్ది రోజులుగా కొనసాగుతున్న తీవ్రమైన వేడి, ఉక్కపోత ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఎప్పుడెప్పుడు వర్షం పడి వాతావరణం చల్లబడుతుందా అని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో భారత వాతావరణ శాఖ (ఐఎమ్‌డీ) విడుదల చేసిన నివేదిక ప్రకారం, రాబోయే రెండు మూడు రోజుల్లో తెలుగు రాష్ట్రాల్లో పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఇది ప్రజలకు కొంత ఉపశమనం కలిగించే వార్త.

**తెలంగాణ వాతావరణ అప్‌డేట్:** తెలంగాణలో ప్రస్తుతం హైదరాబాద్‌తో సహా చాలా ప్రాంతాల్లో పాక్షికంగా మేఘావృతమైన (మిగతా 2లో)

# ధర ఉడుకుతోంది..!

**సామాన్యుడి వంటింటిపై బియ్యం భారం..!**

తెలంగాణ పత్రిక ప్రతినిధి జగిత్యాల

తెలంగాణలో బియ్యం ధరలు సామాన్యులకు షాక్ ఇస్తున్నాయి. కిలో సన్న బియ్యం ధర రూ. 80 నుంచి రూ. 90 వరకు చేరడంతో వంటింటి బడ్జెట్‌పై భారం పెరిగింది. ఎల్‌నినో ప్రభావం, ముందస్తు నిల్వలు, ఇతర రాష్ట్రాలకు పెరిగిన డిమాండ్, ప్రభుత్వ కొనుగోళ్లు, రవాణా-మిల్లింగ్ ఖర్చులు వంటి కారణాలతో ధరలు పెరిగినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టుగా తయారైంది సామాన్యుడి పరిస్థితి. ఇప్పటికే పప్పులు, నూనెలు, ఉప్పు వంటి నిత్యావసరాల ధరలు భారం మోపుతుండగా.. ఇప్పుడు బియ్యం ధరలు కూడా షాకిస్తున్నాయి. నిన్న మొన్నటి వరకు కిలో రూ. 45 నుంచి రూ. 50 మధ్య ఉన్న సన్న బియ్యం ధరలు ప్రస్తుతం రూ. 80 నుంచి రూ. 90 వరకు చేరడం వంటింటి బడ్జెట్‌ను బెంబేలెత్తిస్తోంది. తెలంగాణలో సన్నాల సాగు రికార్డు స్థాయిలో ఉన్నప్పటికీ బియ్యం ధరలు మాత్రం తగ్గకపోవడం వినియోగదారుల్లో ఆందోళన కలిగిస్తోంది. అసలు ఈ ధరలు ఎందుకు పెరుగుతున్నాయి? ఇది సహజమైన పెరుగుదలా? వ్యాపారుల నిల్వల ప్రభావమా? ఎల్‌నినో వంటి వాతావరణ పరిస్థితుల ప్రభావమా? అనే ప్రశ్నలు ఇప్పుడు తెరపైకి వస్తున్నాయి.

**రెండేళ్లలోనే భారీగా పెరిగిన ధరలు**

మరీ ముఖ్యంగా గత రెండు నెలల్లో బియ్యం ధరలు ఒక్కసారిగా పెరగడం సామాన్యులను షాక్‌కు గురిచేస్తోంది. గత ఏడాది గరిష్టంగా కిలో రూ. 60 వరకు ఉన్న బియ్యం ధర ప్రస్తుతం రూ. 80 నుంచి రూ. 90కు చేరింది. గత కొన్నేళ్ల ధరలను పరిశీలిస్తే.. 2020లో కిలో బియ్యం రూ. 35 నుంచి రూ. 42,



2021లో రూ. 38 నుంచి రూ. 44, 2022లో రూ. 40 నుంచి రూ. 46, 2023లో రూ. 42 నుంచి రూ. 50, 2024లో రూ. 45 నుంచి రూ. 55, 2025లో రూ. 50 నుంచి రూ. 70 వరకు పలికింది. అయితే 2026లో మాత్రం కిలో ధర ఏకంగా రూ. 80 నుంచి రూ. 90కు చేరింది. అంటే గతంలో ఏడాదికి రూ. 5 నుంచి రూ. 10 వరకు పెరుగుతూ వచ్చిన ధర.. ఈ ఏడాది ఏకంగా రూ. 20 నుంచి రూ. 25 వరకు పెరగడం ఆందోళన కలిగిస్తోంది.

**ఎల్‌నినో ప్రభావం.. ముందస్తు నిల్వలే కారణమా?**

బియ్యం ధరల పెరుగుదలకు వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం కూడా ఒక కారణంగా వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. రానున్న (మిగతా 2లో)

## ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు అప్రమత్తంగా ఉండాలి

**వ్యవసాయం, గృహాలు, పరిశ్రమలకు**

**నిరంతర విద్యుత్ సరఫరా - కోల్**

**ఇండియా నుంచి అదనపు బొగ్గు**

**కొనుగోలు చేయండి**

**బొగ్గు కొనుగోలుకు నిధుల కొరత లేదు**

**డిమాండ్ పెరిగినా ప్రజలకు**

**ఇబ్బందులు కలగొద్దు**

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**



**హైదరాబాద్:** ఎల్‌నినో ప్రభావంతో ఉష్ణోగ్రతలు పెరిగి విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో రాష్ట్రంలో విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విద్యుత్ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. ఎల్‌నినోతో పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో విద్యుత్ (మిగతా 2లో)

# ఏ పక్షమైనా అభివృద్ధిలో వివక్ష లేదు



(మొదటి పేజీ తరువాయి)

చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లో భూముల విలువ ఎకరాకు రూ.వందల కోట్లు ఉన్నప్పటికీ పేదలు నివసించే ప్రాంతాల్లోనే వారికి గౌరవప్రదమైన నివాసం కల్పించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. క్యూర్ పరిధిలో మొదటి విడతగా లక్ష ఇళ్ల నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకున్నామని, 23 నియోజకవర్గాల్లో పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియను పూర్తి చేశామని వెల్లడించారు. ఇప్పటికే ఆరుచోట్ల ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి శంకుస్థాపనలు చేశామని వివరించారు. మేడ్చల్ నియోజకవర్గంలో తొలి విడతగా 480 మంది లబ్ధిదారులను పారదర్శకమైన బహిరంగ డ్రా ద్వారా ఎంపిక చేసినట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఇప్పటికే సొంత ఇల్లు ఉన్నవారిని గుర్తించి అర్హతలను ధ్రువీకరించిన అనంతరం పారదర్శకంగా డ్రా నిర్వహించామని చెప్పారు. ఎంపికైన వారిలో స్థానికంగా నివసించే అర్హులనే నిర్ధారించి ఇళ్లు కేటాయిస్తున్నట్లు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, ఇప్పటివరకు 2.20 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణం పూర్తయిందని, రెండో విడతలో మరో 2.50 లక్షల ఇళ్లను మంజూరు చేశామని వెల్లడించారు. త్వరలో రెండో విడత ఇందిరమ్మ టవర్స్ కోసం మరోసారి దరఖాస్తులు తీసుకుంటామన్నారు. ఇందిరమ్మ టవర్స్‌లో ఎంపికైన లబ్ధిదారులకు కేవలం కేటాయింపు పత్రాలు ఇచ్చి సరిపెట్టబోమని, ఎలాంటి రిజిస్ట్రేషన్ చార్జీలు లేకుండా పూర్తి హక్కులతో ఇళ్లను రిజిస్ట్రేషన్ చేసి అందిస్తామని మంత్రి ప్రకటించారు. ప్రతి అపార్టుమెంటుకు సంబంధించిన భూమిలో వాటాను కూడా రిజిస్ట్రేషన్‌లో పొందుపరుస్తామని తెలిపారు. వచ్చే బతుకమ్మ పండుగ నాటికి తొలి విడత లబ్ధిదారులకు ఇళ్లను పూర్తి చేసి వారి చేతుల మీదుగా తాళాలు అందించాలన్నదే తమ లక్ష్యమని మంత్రి వెల్లడించారు. తొలి విడతలో అవకాశం దక్కని అర్హులు నిరుత్సాహపడాల్సిన అవసరం లేదని, తదుపరి విడతల్లో కొత్త దరఖాస్తుదారులు సహా అర్హులందరినీ పరిశీలిస్తామని తెలిపారు. గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కూడా పూర్తి చేసి లబ్ధిదారులకు అందించడంతోపాటు ఆయా కాలనీల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తామని చెప్పారు. ఖాళీగా ఉన్న ఇళ్లను గుర్తించి సమీప ప్రాంతాల్లోని అర్హులైన పేదలకు నిబంధనల ప్రకారం కేటాయించాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఉన్న కాలనీల్లో మౌలిక సదుపాయాల కోసం సుమారు రూ.440 కోట్లు ఖర్చు చేశామని మంత్రి స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైనర్మన్ శ్రీనివాసరెడ్డి, హౌసింగ్ శాఖ ఎండీ వి.పి.గౌతమ్, కలెక్టర్ మనూచౌదరి తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో లబ్ధిదారులు స్నేహ, శివకుమారి, రెహ్మాతి తదితరులు మాట్లాడి ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని, ప్రభుత్వ పనితీరును ప్రశంసించారు. అనంతరం ఇందిరమ్మ టవర్స్‌లో ఫ్లాట్ల కేటాయింపు జరిగింది.

## పాలమూరు కృష్ణమ్మ పరుగు



(మొదటి పేజీ తరువాయి)

పనులన్నీ పూర్తి చేసి కరివెన వరకు నీటిని పారించాలని ముఖ్యమంత్రి జారీ చేసిన ఆదేశాలతో పనుల్లో వేగం పెరిగింది.

**రోజుకు అర టీఎంసీ నీటి తరలింపు:** 2023 సెప్టెంబర్‌లో నార్లాపూర్ పంప్ హౌస్‌లో మొదటి పంప్ వెట్ రన్ నిర్వహించగా, ప్రస్తుతం నాలుగు పంపులను సిద్ధం చేశారు. అందులో రెండింటికి వెట్ రన్ విజయవంతంగా పూర్తయింది. ఈ పంప్ హౌస్‌లో అమర్చిన 145 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఒక్కో బాహుబలి మోటారు రోజుకు 3 వేల క్యూసెక్కుల చొప్పున (పావు టీఎంసీ) నీటిని ఎత్తిపోస్తుంది. ప్రస్తుతం ప్రారంభించిన రెండు మోటార్ల ద్వారా రోజుకు అర టీఎంసీ నీరు నార్లాపూర్ రిజర్వాయర్‌లోకి చేరుతుంది. ఇక్కడ నిల్వ చేసిన నీటిని కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలోని ఎల్లూరు రిజర్వాయర్‌కు తరలించి, మిషన్ భగీరథ ద్వారా ప్రజలకు తాగునీరుగా సరఫరా చేయనున్నారు.

## రాష్ట్రంలో పెట్టుబడులు సురక్షితం

(మొదటి పేజీ తరువాయి)

భారత్ ఫ్యూచర్ సిటీ మాస్టర్‌ప్లాన్‌ను త్వరలో వెల్లడిస్తామని తెలిపారు. మూఖీ నదిని పునరుజ్జీవింపజేసి, నదీతీర ఆర్థిక కార్యకలాపాలు, రాత్రివేళ ఆర్థిక వ్యవస్థకు కేంద్రంగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ ప్రణాళికను వివరించారు. ఈ సందర్భంగా యూకే-ఇండియా బిజినెస్ కౌన్సిల్ రూపొందించిన 'యూకే-ఇండియా సీఈటీఏ అండ్ రీజినల్ సినర్జీస్' నివేదికను సీఎం ఆవిష్కరించారు.

**తెలంగాణతో భాగస్వామ్యంపై ఆసక్తి**

అధునాతన తయారీ, వైద్యం, డిజిటల్ సాంకేతికత, రక్షణ, ఏరోస్పేస్, సాంకేతిక వస్త్రాలు, నైపుణ్యాభివృద్ధి, పరిశోధన, అభివృద్ధి రంగాల్లో తెలంగాణతో కలిసి పనిచేయడానికి యూకే ప్రతినిధులు ఆసక్తి చూపారు. వివిధ రంగాల్లో 1.50 లక్షల వ్యాపార సంస్థలు కలిగిన యార్క్‌షైర్‌కు, తెలంగాణకు అనేక ఉమ్మడి ప్రయోజనాలున్నాయని దక్షిణ యార్క్‌షైర్ మేయర్ ఒలివర్ కాప్‌కార్డ్ చెప్పారు. తెలంగాణ, యార్క్‌షైర్ మధ్య అనేక సారూప్యతలు, ఉమ్మడి ప్రయో జనాలున్నాయని, తాము సోదరసోదరీమణుల్లాంటి వార మని వెస్ట్ యార్క్‌షైర్ మేయర్ ట్రేసీ బ్రాబిన్ వ్యాఖ్యా నించారు. ఈ సమావేశంలో యూకే-ఇండియా బిజినెస్ కౌన్సిల్ సీఈవో కిశోర్ జయ రామన్, బ్రిటిష్ డిప్యూటీ హైకమిషన్ ప్రతినిధులు, సీఎస్ సంజయ్ జాజు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**ప్రపంచస్థాయి వర్సిటీలకు కేంద్రంగా తెలంగాణ: శ్రీధర్‌బాబు**

ప్రపంచంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలకు తెలంగాణ నిలయంగా మారే దిశగా ముందుకు సాగుతోందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు చెప్పారు. ఇటీవల సీఎం నేతృత్వంలోని రాష్ట్ర ప్రతినిధి బృందం బ్రిటన్ పర్యటనలో ప్రముఖ విశ్వవిద్యాలయాలు, వ్యాపార సంస్థలతో భాగస్వామ్యాలు కుదుర్చుకుందని తెలిపారు. హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీ, అక్కడి ఆవిష్కరణల వ్యవస్థను పరిశీలించాలని యూకే ప్రతినిధి బృందాన్ని ఆహ్వానించారు.

## పట్టభద్రుల పోరు.. ఎర్రసైన్యం దారేటు?

(మొదటి పేజీ తరువాయి)

స్థానాల్లో వామపక్షాలకు, ఉపాధ్యాయ సంఘాలకు సాంప్రదాయకంగా ఉండే బలమైన ఓటుబ్యాంకు ఇతర ప్రధాన పార్టీల గెలుపోటములను శాసించే స్థాయిలో ఉంటుంది. దాంతో ఎర్రజెండా ఏ వైపు మొగ్గు చూపినా ఫలితాలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. కాంగ్రెస్, వామపక్షాల మధ్య గత కొంతకాలంగా సత్సంబంధాలు కొనసాగుతున్నప్పటికీ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాల విషయానికి వస్తే కాంగ్రెస్ తన సొంత అభ్యర్థులను నిలబెట్టే యోచనలో ఉంది. దీంతో సీట్ల సర్దుబాటుపై సస్పెన్స్ నెలకొంది. సీపీఐ, సీపీఎం కలిసి ఉమ్మడి అభ్యర్థిని బరిలోకి దింపుతాయా లేక కాంగ్రెస్ మద్దతును కోరతాయా అనే దానిపై ఎడతెగని చర్చలు సాగుతున్నాయి. మరోవైపు, నిరుద్యోగ సమస్యలు, ఉద్యోగుల డిమాండ్లు, విద్యా రంగంలోని సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తున్న వామపక్షాలు, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమకున్న క్షేత్రస్థాయి బలాన్ని చాటుకోవాలని భావిస్తున్నాయి. ప్రధాన పార్టీలకు గట్టి పోటీ ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయి. మొత్తానికి ఈ పెద్దల పోరులో ఎర్రజెండా తన మార్క్‌ను ఎలా చూపుతుంది, కాంగ్రెస్‌తో పొత్తుతో ముందడుగు వేస్తుందా లేక ఒంటరిగానే సత్తా చాటుతుందా అనేది రానున్న రోజుల్లో తేలనుంది.

## ధర ఉడుకుతోంది..!



(మొదటి పేజీ తరువాయి)

పంట దిగుబడిపై అనిశ్చితి ఉంటుందన్న అంచనాలతో హోల్‌సేల్ వ్యాపారులు, ప్యాకింగ్ కంపెనీలు సన్న బియ్యాన్ని ముందుగానే పెద్ద మొత్తంలో కొనుగోలు చేసి నిల్వ చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ ముందస్తు కొనుగోళ్ల కారణంగా మార్కెట్‌లో లభ్యత తగ్గి ధరలు పెరుగుతున్నాయన్న వాదన వినిపిస్తోంది. మరోవైపు ప్రభుత్వ కస్టమ్ మిల్లింగ్ కింద సేకరించిన ధాన్యంలో అక్రమాలు జరగడం, నాణ్యమైన బియ్యం పక్కదారి పట్టడం వంటి అంశాలు కూడా మార్కెట్‌లో బియ్యం లభ్యతపై ప్రభావం చూపుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి.

**తెలంగాణ సన్న బియ్యానికి ఇతర రాష్ట్రాల్లో భారీ డిమాండ్**

తెలంగాణ సోనా, హెచ్‌ఎంటీ, బీపీటీ వంటి నాణ్యమైన సన్న రకాలకు ఇతర రాష్ట్రాల్లో భారీ డిమాండ్ ఉంది. మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యాపారులు తెలంగాణలోని నల్లగొండ, నిజామాబాద్, ఖమ్మం వంటి జిల్లాలకు వచ్చి రైతుల నుంచి అధిక ధరలకు ధాన్యాన్ని కొనుగోలు చేసి ముంబై, బెంగళూరు, చెన్నై వంటి నగరాలకు తరలిస్తున్నారనే వాదన ఉంది. దీంతో రాష్ట్రంలోని స్థానిక మార్కెట్లలో సన్న ధాన్యం లభ్యత తగ్గి, చివరకు బియ్యం ధరలపై ప్రభావం పడుతోందని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి.

**ప్రభుత్వ బోనస్‌తో ఓపెన్ మార్కెట్‌కు తగ్గిన సరఫరా?**

తెలంగాణ ప్రభుత్వం సన్న ధాన్యానికి మద్దతు ధరతో పాటు క్వింటాకు రూ.500 బోనస్ అందిస్తోంది. అలాగే పాఠశాలలు, రేషన్ షాపులకు సన్న బియ్యం సేకరిస్తోంది. దీంతో రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకే ఎక్కువగా విక్రయిస్తున్నారు. రైతులకు గిట్టుబాటు ధర లభించడం సానుకూల పరిణామమే అయినప్పటికీ.. ప్రైవేట్ మిల్లర్లు, ఓపెన్ మార్కెట్ వ్యాపారులకు అందుబాటులో ఉండే సన్న ధాన్యం పరిమాణం తగ్గుతోంది. ఫలితంగా బహిరంగ మార్కెట్‌లో సన్న బియ్యం ధర క్వింటాకు సుమారు రూ.2 వేల నుంచి రూ.2,500 వరకు పెరిగినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

**రవాణా, మిల్లింగ్, ప్యాకింగ్ ఖర్చుల భారం కూడా..**

ధాన్యం ధర పెరగడంతో పాటు రవాణా, మిల్లింగ్, ప్యాకింగ్, విద్యుత్ వంటి ఖర్చులు కూడా పెరుగుతున్నాయి. ఇవన్నీ కలిసివచ్చి చివరకు వినియోగదారుడిపై భారం పడుతోంది. కిలో బియ్యం రూ.80 నుంచి రూ.90 వరకు చేరడంతో నెలవారీ కుటుంబ బడ్జెట్‌లో బియ్యం కోసం కేటాయించాల్సిన మొత్తం గణనీయంగా పెరిగింది. పప్పులు, ఉప్పు వంటి ఇతర వస్తువుల ధరలు పెరిగితే కొంత మేర సర్దుబాటు చేసుకోవచ్చని.. కానీ బియ్యం ధర పెరిగితే మాత్రం తప్పనిసరిగా కొనాల్సిందేనని సామాన్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**బియ్యం ధర సెంచరీ కొడుతుందా?**

ప్రస్తుతం కిలో బియ్యం ధర రూ.80 నుంచి రూ.90 మధ్య ఉండటంతో.. ఇదే పరిస్థితి మరికొంతకాలం కొనసాగితే ధర రూ.100 మార్క్‌ను తాకే అవకాశాలపై ఆందోళన వ్యక్తమవుతోంది. బియ్యం వంటి నిత్యావసర వస్తువు ధర సామాన్యులపై మరింత భారం పడకుండా ప్రభుత్వం వెంటనే స్పందించాలని వినియోగదారులు కోరుతున్నారు. అక్రమ నిల్వలు, పక్కరాష్ట్రాలకు తరలింపులు, మార్కెట్‌లో కృత్రిమ కొరత వంటి అంశాలపై దృష్టి పెట్టడంతో పాటు ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. మొత్తంగా చూస్తే.. లిలిధర ఉడుకుతోంది.. బియ్యం రేటు సామాన్యుడి వంటింటి బడ్జెట్‌ను కాల్చేస్తోంది!

## సింగరేణికి కేటీఆరే శ్రీరామరక్ష



(మొదటి పేజీ తరువాయి)

చేసిన మాయల ఫకీరు ఎవరు? కోల్‌మాల్‌ను గోల్‌మాల్ చేస్తున్న దొంగ ఎవరు?" అని కేటీఆర్ నిలదీసిన తీరు సభలోని కార్మికులతో జైజైలు కొట్టించింది. సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను విడుదల చేయకుండా, కార్మికులకు చెందాల్సిన లాభాల వాటాను కుదించి వారి భవిష్యత్తుతో ఆడుకుంటున్న పాలకుల వైఖరిపై ఆయన చేసిన హెచ్చరికలు అక్షరసత్యాలై నిలిచాయి. కార్మికుల దసరా బోనస్, లాభాల వాటా, వారసత్వ ఉద్యోగాల భర్తీ, మెడికల్ బోర్డుల నిర్వహణ వంటి ప్రధాన సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేల ఇళ్లను ముట్టడిస్తామని ఆయన హెచ్చరించిన తీరు పాలకుల గుండెల్లో వణుకు పుట్టించింది. సింగరేణిని ప్రైవేటీకరించే ఏ చిన్న ప్రయత్నాన్నైనా ప్రాణాలర్పించైనా అడ్డుకుంటామని, "మీకున్న ఒకే ఒక్క బ్రహ్మాస్త్రం కేసీఆర్" అని చాటిచెబుతూ కార్మికులకు అహోరాత్రులు అండగా నిలిచేందుకు బీఆర్ఎస్ సదా సిద్ధంగా ఉంటుందని కేటీఆర్ ఇచ్చిన భరోసా ప్రతీ కార్మిక కుటుంబంలో కొత్త ఆశలను నింపింది. ప్రజావ్యతిరేక విధానాలను కొనసాగిస్తే ఆర్టీసీ కార్మికులు నేర్పిన గుణపాఠమే ఇక్కడ కూడా పునరావృతమవుతుందని హెచ్చరించారు. కేసీఆర్ దూరదృష్టితో కూడిన నాయకత్వంలోనే సింగరేణికి, కార్మికుల ప్రయోజనాలకు పరిపూర్ణ రక్షణ లభిస్తుందని స్పష్టం చేసిన కేటీఆర్ ప్రసంగం, కార్మిక లోకంలో ఆయన్ను నల్ల బంగారపు అసలైన రక్షకుడిగా నిలబెట్టింది.

## తెలంగాణ ప్రజలారా..! ఊపిరి పీల్చుకోండి

(మొదటి పేజీ తరువాయి)

వాతావరణం కనిపిస్తోంది. కొద్దిపాటి వేడి, ఉక్కపోత కొనసాగుతున్నప్పటికీ, వర్షం వచ్చే సూచనలు స్పష్టంగా ఉన్నాయి. ఐఎమ్‌డీ అంచనాల ప్రకారం, అక్టోబరు 15, గురువారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశం ఉంది. అక్టోబరు 15వ తేదీన ములుగు, ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ, నాగర్‌కర్నూల్, వనపర్తి, మహబూబ్‌నగర్ వంటి దక్షిణ తెలంగాణలోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయి. ఈ వర్షాల తీవ్రత "మోడరేట్ టు హెవీ రెయిన్" గా ఉంటుందని ఐఎమ్‌డీ పేర్కొంది. అక్టోబరు 16వ తేదీన పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, సిద్దిపేట, వరంగల్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్‌కర్నూల్, నల్గొండ జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయి. చాలా వరకు మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉంది. అక్టోబరు 17వ తేదీన మంచిర్యాల, వరంగల్, ఆసిఫాబాద్ వంటి ప్రాంతాల్లో కూడా వర్షాలు కురిసే సూచనలు కనిపిస్తున్నాయి. అక్టోబరు 18 నుంచి 20వ తేదీ వరకు దక్షిణ తెలంగాణలోని కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని ఐఎమ్‌డీ తెలిపింది. ఈ వర్షాలు తెలంగాణ ప్రజలకు ఎంతో కొంత ఊరటనిస్తాయని భావిస్తున్నారు

## ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు అప్రమత్తంగా ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

డిమాండ్‌ను సమర్థంగా ఎదుర్కొనేందుకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి ప్రజాభవన్‌లో విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో మంగళవారం ఆకస్మిక వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. విద్యుత్ అవసరాలు, సరఫరా సంసిద్ధత, బొగ్గు లభ్యత, అవసరమైన వనరుల సమీకరణ తదితర అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. వాతావరణ పరిస్థితుల కారణంగా రాష్ట్రంతోపాటు దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరిగి విద్యుత్ వినియోగం అధికమయ్యే పరిస్థితులు ఏర్పడవచ్చని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పెరిగే డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి, సరఫరా వ్యవస్థలను సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచించారు. ముందస్తు ప్రణాళికతో వ్యవహరిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. వ్యవసాయానికి, గృహావసరాలకు, పరిశ్రమలకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. డిమాండ్ పెరిగినప్పటికీ సరఫరా వ్యవస్థపై ఒత్తిడి పడకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. విద్యుత్ సరఫరా సజావుగా సాగేందుకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను ప్రభుత్వం అందిస్తుందని భట్టి హామీ ఇచ్చారు. విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన బొగ్గు నిల్వలను తగిన స్థాయిలో అందుబాటులో ఉంచుకోవాలని, అవసరమైతే కోల్ ఇండియా నుంచి అదనంగా బొగ్గును కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. బొగ్గు కొనుగోలుకు అవసరమైన నిధులను ప్రభుత్వం విడుదల చేస్తుందని స్పష్టం చేశారు. ప్రభుత్వ సహకారాన్ని సమర్థంగా వినియోగించుకుని, రాష్ట్రంలోని ఏ రంగానికీ విద్యుత్ కొరత కారణంగా ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించడమే ప్రభుత్వ ప్రాధాన్యమని పేర్కొంటూ మారుతున్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ శాఖ ముందస్తు సన్నద్ధతతో వ్యవహరించాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. కాన్ఫరెన్స్‌లో ఎనర్జీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్, ఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి.పాటిల్, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ రెస్టారెంట్లలో ఆహార భద్రత గాలికి



(మొదటి పేజీ తరువాయి)

బృందాలుగా విడిపోయి విస్తృత తనిఖీలు చేపట్టారు. మంగళవారం మొత్తం 13 హోటళ్లు, రెస్టారెంట్లలో నిర్వహించిన ఈ దాడుల్లో దిగ్భ్రాంతికర విషయాలు వెలుగుచూశాయి. తీవ్రమైన ఉల్లంఘనలకు పాల్పడిన 4 సంస్థల ఫుడ్ సేఫ్టీ లైసెన్సులను అధికారులు తక్షణమే సస్పెండ్ చేసి సీజ్ చేశారు. అలాగే కల్తీ అనుమానాలున్న 16 ఆహార నమూనాలను సేకరించి ల్యాబ్‌లకు తరలించారు.

**తాగే నీటిలో చనిపోయిన బొద్దింకలు.. ఒకే ఫ్రిజ్‌లో వెజ్, నాన్‌వెజ్!**

నగరంలోని పలు ప్రముఖ రెస్టారెంట్లు సైతం ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కినట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. వంటగదుల్లో నీరు నిలిచిపోవడం, జిడ్డుపట్టిన చిమ్నీలు, విరిగిన ఫ్లోరింగ్‌తో పాటు ఈగలు, బొద్దింకలు, ఎలుకల సంచారం విచ్చలవిడిగా ఉన్నట్లు గుర్తించారు. చిక్కడపల్లి ఎన్ఆర్ నందిని సుధా రెస్టారెంట్‌లో తనిఖీల్లో వాటర్ డిస్పెన్సర్‌లో చనిపోయిన బొద్దింకలు తేలుతూ కనిపించాయి. అలాగే నీరు నిలిచిన ఫ్లోరింగ్, మురికి పట్టిన చిమ్నీలను అధికారులు రికార్డు చేశారు. అమీర్‌పేట్‌లోని హర్ష డీలక్స్ మెస్‌లో తాగే నీటి డిస్పెన్సర్‌లోనూ చనిపోయిన బొద్దింకలు ఉండటం చూసి అధికారులు నివ్వెరపోయారు. వెంగళరావునగర్‌లోని సాయిదర్శిని, యూనివర్సల్ రెస్టారెంట్లలో తీవ్రమైన అపరిశుభ్రత, ఒకే ఫ్రిజ్‌లో వెజ్, నాన్‌వెజ్ ఆహార పదార్థాలను నిల్వ ఉంచడం వంటి లోపాలను అధికారులు గుర్తించారు. ప్రజారోగ్యానికి తీవ్ర విఘాతం కలిగిస్తున్న ఈ 4 సంస్థల ఫుడ్ లైసెన్సులను తక్షణమే సస్పెండ్ చేస్తూ, వాటి వ్యాపార కార్యకలాపాలను వెంటనే నిలిపివేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

**లైసెన్స్‌లు లేని మెస్‌లు బంద్.. ప్రముఖ రెస్టారెంట్లకు నోటీసులు**

మాదాపూర్ అయ్యప్ప సొసైటీ పరిధిలోని ఐఏసీజీ హాస్టల్ మెస్, పద్మశ్రీ క్యాంటీన్‌లు అసలు ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ లైసెన్సే లేకుండా అపరిశుభ్ర వాతావరణంలో నడుస్తున్నట్లు తేలడంతో వాటిని వెంటనే మూసివేయాలని స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్‌లోని ప్రముఖ అబ్సల్యూట్ బార్బెక్యూ రెస్టారెంట్‌లో పలు లోపాలు వెలుగుచూడటంతో, వాటిని సరిచేసుకోవాలని అధికారుల బృందం ఇంప్రూవ్‌మెంట్ నోటీసు ఇచ్చింది. హఫీజ్‌పేట్‌లోని ఇంపీరియల్ మల్టీ క్యుజిన్ రెస్టారెంట్, మాదాపూర్‌లోని కోల్‌కతా హౌస్, రాజు గారి బిర్యానీ, అమీర్‌పేట్‌లోని ఆనందో బ్రహ్మ ఫైన్ డైన్, రాయలసీమ రుచులు సంస్థలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. లైసెన్స్ ఉల్లంఘనలపై వివరణ కోరడంతో పాటు వీటికి భారీ మొత్తంలో జరిమానాలు విధించేందుకు సిద్ధమవుతున్నారు.

**నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు అధికారులు**

ఆహార పదార్థాల నిల్వ పద్ధతులు, వంటగది పరిశుభ్రత, సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత, ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ నిబంధనల అమలుపై టీజీ సేఫ్ ప్రత్యేక దృష్టి సారించింది. తనిఖీల్లో గుర్తించిన లోపాలను సదరు యాజమాన్యాలు సరిదిద్దుకున్నాయా లేదా అనేది రీ-ఇన్‌స్పెక్షన్ ద్వారా పరిశీలిస్తామని వెల్లడించారు. కేవలం లాభార్జనే ధ్యేయంగా చేసుకుని ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే ఎంతటి పెద్ద సంస్థపైనైనా కఠిన చర్యలు తీసుకుంటామని టీజీ సేఫ్ అధికారులు తీవ్రంగా హెచ్చరించారు.

## ఇక టోల్ వలుచుడే..



(మొదటి పేజీ తరువాయి)

సెక్షన్ పనులు ఇటీవల పూర్తయ్యాయి. సెప్టెంబర్ 5వ తేదీ నుంచి ఈ రహదారి మీద నుంచి రాకపోకలు ట్రయల్స్ బేసిస్ మీద నడిపిస్తున్నారు. కేవలం 40 నిమిషాల్లోనే కరీంనగర్ నుంచి వరంగల్ చేరుకునేలా అత్యాధునిక సదుపాయాలతో గరిష్ట వేగం 100 కి.మీ. వెళ్లేలా నాలుగు వరసలతో విశాలంగా నిర్మించారు. అదే సమయంలో జగిత్యాల-కరీంనగర్ సెక్షన్ పనులను దాదాపు రూ.2,000 కోట్లకుపైగా బడ్జెట్‌తో ఇటీవల టెండర్లు పిలిచారు.

**కొత్తగట్టు వద్ద టోల్ వసూలుకు బూత్ ఏర్పాటు**

జాతీయ రహదారి 563పై ప్రయాణించే వాహనాలకు కొత్తగట్టు వద్ద ఏర్పాటు చేసిన టోల్ బూత్ నుంచి టోల్ వసూలు చేయనున్నారు. ఈ క్రమంలోనే భారత జాతీయ రహదారుల సంస్థ ఏ వాహనానికి ఎంత రుసుం వసూలు చేస్తారన్న దానిపై పట్టిక విడుదల చేసింది. ఇందులో కరీంనగర్ జిల్లాలో రిజిస్ట్రేషన్ అయిన వాహనాలకు సాధారణ చార్జీలనే వసూలు చేస్తుండగా.. అదే ఇతర జిల్లాల్లో రిజిస్టరైన వాహనాలకు మాత్రం రెండింతలు టోల్ ధరలు నిర్ణయించారు. ఇది తమపై భారం మోపుతుందని వాహనదారులు వాపోతున్నారు. 'కారు లేదా వ్యాన్ తదితర లైట్ వెయిట్ వాహనాలకు కరీంనగర్ జిల్లాలో రిజిస్ట్రేషన్ అయి ఉంటే సింగిల్ జర్నీకి రూ.80గా ధర నిర్ణయిస్తే.. ఇతర జిల్లా వాహనాలకు రూ.160 గా ఖరారు చేశారు. ఇది వాహనం రకాన్ని బట్టి మారుతుంటుంది. 'ఏడు లేదా అంత కంటే ఎక్కువ యాక్సిల్ కలిగిన వాహనాలకు సింగిల్ జర్నీకి రూ.1,020గా నిర్ణయించారు. 'టోల్‌గేట్‌కు 20 కి.మీ. లోపల నివసిస్తున్న వారికి మంత్లీ రూ.360తో పాస్ జారీ చేస్తారు. ' డిసెంబర్‌లో ఈ రహదారిని ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా జాతికి అంకితం చేయనున్నారు.

# పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట

**కల్వకుర్తి ఎమ్మెల్యే కాసిరెడ్డి నారాయణరెడ్డి ప్రత్యేక పూజలు**





**కల్వకుర్తి అక్టోబర్ 14 తెలంగాణ పత్రిక** తలకొండపల్లి మండల పరిధిలోని గౌరిపల్లి గ్రామంలో శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట అంగరంగ వైభవంగా జరిగాయి ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట గజ స్థంభం ప్రతిష్టాత్మక కు ముఖ్య అతిథిగా కల్వకుర్తి ఎమ్మెల్యే కా సి రెడ్డి నారాయణ రెడ్డి విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కళ్యాణ్ నాయక్ ఉప సర్పంచ్ రమేష్ యాదవ్ తలకొండపల్లి మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లింగారావుపల్లి సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి ఆమనగల్ మార్కెట్ కమిటీ చైర్మన్ యాట గీతా నరసింహ అన్ని గ్రామాల సర్పంచులు మండల కాంగ్రెస్ నాయకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నేర సమీక్ష

**పెండింగ్ కేసుల పరిష్కారంపై ఎస్పీ కీలక ఆదేశాలు : జి. జానకి షర్మిల**



**నిర్మల్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 14 (తెలంగాణ పత్రిక)**
నిర్మల్ జిల్లా ఎస్పీ. జి. జానకి షర్మిల జిల్లా పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి నేర సమీక్ష చేపట్టారు. పెండింగ్ కేసుల పరిష్కారం, ఈ-పెట్టీ కేసుల డిస్పోజల్, దసరా బందోబస్తు, దుర్గామాత నిమజ్జన ఏర్పాట్లపై అధికారులతో చర్చించి కీలక సూచనలు చేశారు.

**పెండింగ్ కేసుల సత్వర పరిష్కారం**
60, 90 రోజుల గడువుతో దర్యాప్తులో ఉన్న కేసులను నిర్దేశిత సమయంలోగా నాణ్యమైన దర్యాప్తుతో పూర్తి చేయాలని, కేసుల పరిష్కారంలో జాప్యం లేకుండా చూడాలని ఎస్పీ ఆదేశించారు.

**ఈ-పెట్టీ కేసుల డిస్పోజల్**
ఈ-పెట్టీ కేసులను త్వరితగతిన పరిష్కరించి, పెండింగ్ లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

**దుర్గామాత, దసరా బందోబస్తు ఏర్పాట్లు**
దసరా పండుగతో పాటు దుర్గామాత ఉత్సవాలు, విగ్రహాల నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా చేపట్టాల్సిన బందోబస్తు ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. నిమజ్జన మార్గాలు, చెరువులు, వాగుల వద్ద ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పండుగలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటూ, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ ఉపేందర్ రెడ్డి, ఎస్బి ఇన్‌స్పెక్టర్ మల్లేష్, (డిసిఆర్ బి,) ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి : (తెలంగాణ పత్రిక) అక్టోబర్ 14:** జయశంకర్ భూపాలపల్లి ప్రభుత్వ ప్రధాన వైద్యశాలకు వైద్య సేవలకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ ప్రభుత్వ ప్రధాన వైద్యశాలను సందర్శించి ఎక్స్-రే యూనిట్, ఎం.ఆర్.ఐ. యంత్రం, విద్యుత్ సరఫరా వ్యవస్థ, క్యాజువాలిటీ విభాగం ఏర్పాటు, తాగునీటి సౌకర్యం, పార్కింగ్ తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, రోగులకు అందుబాటులో ఉన్న సదుపాయాలు, ఎదురవుతున్న సమస్యలపై వైద్యశాల పర్యవేక్షకులను అడిగి తెలుసుకున్నారు. ఎం.ఆర్.ఐ. యంత్రం నిరంతరాయంగా పనిచేసేందుకు అవసరమైన సామర్థ్యం కలిగిన స్టెబిలైజర్, ఆర్మర్డ్ విద్యుత్ కేబుల్ ఏర్పాటు చేయాలని, ఎక్స్-రే యూనిట్‌కు కూడా అవసరమైన విద్యుత్ సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రికి వచ్చే రోగులకు తక్షణ వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక క్యాజువాలిటీ విభాగం ఏర్పాటు చేయాలని, ఇందుకు అవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలని వైద్యశాల పర్యవేక్షకులను ఆదేశించారు. అలాగే రోగులకు నిరంతరాయంగా తాగునీరు అందించేందుకు ఆర్.ఓ. ప్లాంట్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఆసుపత్రి ప్రాంగణంలో వహనాలు ఎక్కడంటే అక్కడ పార్కింగ్ చేస్తున్నారని క్రమపద్ధతి పాటించేందుకు పార్కింగ్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద, సామాన్య ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, అవసరమైన మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన వైద్యశాల పర్యవేక్షకులు డా. వెంకటరత్నం, టీజీఎండీసీ ఈఈ నందు పటేల్, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మిర్యాలగూడ టూ టౌన్ ఎస్సై సతీష్‌కు తీవ్ర గాయాలు!

**నేరేడుచర్ల సమీపంలో అదుపుతప్పి కిందపడిన బైక్..**

**మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలింపు**



**సూర్యాపేట ॥ అక్టోబర్ 14 ॥ తెలంగాణ పత్రిక ॥ జిల్లా ప్రతినిధి భట్టు సంతోష్ తోళా నాయక్ ॥** సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నల్లగొండ జిల్లా మిర్యాలగూడ టూ టౌన్ ఎస్సై సతీష్ తీవ్రంగా గాయపడ్డారు. బైక్‌పై ప్రయాణిస్తున్న సమయంలో వాహనం అదుపుతప్పి కిందపడటంతో ఆయనకు గాయాలైనట్లు సమాచారం. ప్రమాదం జరిగిన వెంటనే ఎస్సై సతీష్‌ను మిర్యాలగూడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌కు తరలించినట్లు తెలిసింది. ప్రస్తుతం ఆయనకు వైద్య చికిత్స కొనసాగుతోంది. ఈ ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఎస్సై సతీష్ ఆరోగ్య పరిస్థితిపై మరిన్ని వివరాలు వెల్లడికావాల్సి ఉండగా, ప్రమాదానికి సంబంధించిన వివరాలను డీఎస్పీ రవి వెల్లడించారు.

## ఐదు సంవత్సరాలుగా పట్టించుకోని రోడ్డు ప్రజల ఇబ్బందులు ఎప్పుడు తీరుతాయి?



**తెలంగాణ పత్రిక చారకొండ అక్టోబర్ 14:** నాగర్ కర్నూల్ జిల్లా చారకొండ మండలంలోని నూకల చింతవాడిక తండా నుంచి సారాంబండ తండా వరకు ఉన్న సుమారు 3 కిలోమీటర్ల రోడ్డు కంకర పోసి 3 సంవత్సరాలు గడుస్తున్నా, నేటికీ ఈ రోడ్డుకు సరైన మరమ్మతులు చేయకపోవడం బాధాకరం. జాతీయ రహదారికి అతి సమీపంలో ఉన్న ఈ రోడ్డు ప్రస్తుతం గుంతలు, రాళ్లతో ప్రయాణానికి ప్రమాదకరంగా మారింది. నిత్యం ఈ రహదారిపై ప్రయాణించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా అత్యవసర పరిస్థితుల్లో రోగులను ఆసుపత్రికి తరలించడానికి, అంబులెన్స్‌లు రావడానికి కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎన్నిసార్లు అధికారులకు సమస్యను తెలియజేసినా సరైన స్పందన లేకపోవడం ప్రజలను మరింత నిరాశకు గురిచేస్తోంది. ప్రజల సమస్యలను అధికారులు ఇకనైనా గుర్తించి తక్షణమే స్పందించాలని మనస్ఫూర్తిగా కోరుతున్నాం.

## రామాపురం గ్రామ ప్రజలకు శుభవార్త

**అభివృద్ధి దిశగా మరో ముందడుగు!**




**సూర్యాపేట ॥ అక్టోబర్ 14 ॥ తెలంగాణ పత్రిక ॥ జిల్లా ప్రతినిధి భట్టు సంతోష్ తోళా నాయక్:** చిలుకూరు మండలం, సూర్యాపేట జిల్లా పరిధిలోని రహదారుల అభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వం రూ. 52.50 కోట్ల నిధులకు పరిపాలనా అనుమతులు మంజూరు చేయడం ఎంతో సంతోషకరమని, ఈ నిధులతో నాలుగు రహదారుల వెడల్పు మరియు బలోపేతం పనులు చేపట్టేందుకు మార్గం సుగమమైందని జిల్లా ప్రతినిధి భట్టు సంతోష్ తోళా నాయక్ తెలిపారు. ఈ అభివృద్ధి కార్యక్రమానికి సహకరించిన తెలంగాణ రాష్ట్ర గౌరవ మంత్రివర్యులు శ్రీ ఉత్తమ్ కుమార్ రెడ్డి గారికి మరియు కోదాడ శాసనసభ్యురాలు గౌరవ శ్రీమతి ఉత్తమ్ పద్మావతి రెడ్డి గారికి హృదయపూర్వక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా, రామాపురం గ్రామ రహదారి సమస్యను ఎన్నోసార్లు గౌరవ మంత్రివర్యులు, ఎమ్మెల్యే మేడం గార్ల దృష్టికి తీసుకెళ్లి, గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసిన రామాపురం కాంగ్రెస్ పార్టీ నాయకులకు, అలాగే మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీ కీతా వెంకటేశ్వర్లు గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రజల సమస్యలను నాయకుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయడం అభినందనీయమని, రహదారుల అభివృద్ధితో ప్రజలకు ప్రయాణ సౌకర్యాలు మెరుగై గ్రామాభివృద్ధికి మరింత తోడ్పాటు లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి ప్రదాతలకు కృతజ్ఞతగా రామాపురం కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ ప్రజలు కలిసి క్షీరాభిషేకం నిర్వహించి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

## వీబీ జీ రాం జీ పనులను పరిశీలించిన సర్పంచ్ సప్పిడి ఇందిరా



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి :( తెలంగాణ పత్రిక) అక్టోబర్, 14:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం పెద్దకోమటిపల్లి గ్రామంలో బుధవారంరోజున సర్పంచ్ సప్పిడి ఇందిరా ఆధ్వర్యంలో వి బి-జి -రాం -జి -పథకం కింద చేస్తున్న పనులను పరిశీలించారు మన ఊరు ప్రజలు పనిని వినియోగించుకోగలరు అందరూ రాగలరు అని కోరారు ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్స్ మెరుగు సురేష్ గౌడ్ నీమతి పద్మ అప్పం రజిత పంచాయతీ కార్యదర్శి సాయి కృష్ణ ఫీల్డ్ అసిస్టెంట్ సరిత కాంగ్రెస్ మండల నాయకులు సప్పిడి రామస్వామి నిమ్మతి రాజేందర్ గ్రామ ప్రజలు వున్నారు.

## మున్సిపాలిటీలకు రూ.296.60 కోట్లు!

**హైదరాబాద్ :** రాష్ట్రంలోని పట్టణ స్థానిక సంస్థల (యూఎల్బీ)కు బడ్జెట్‌లో భాగంగా ప్రభుత్వం తాజాగా రూ. 296.60 కోట్ల కేటాయింపులకు పాలనాపరమైన అనుమతిస్తూ కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ టీకే శ్రీదేవి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

## పదేళ్లు గడిచినా సొంత భవనాలు కరువు

**ప్రభుత్వ నిర్లక్ష్యంపై చారకొండ జేఏసీ పోరుబాట!**

**ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు మంజూరు చేయాలి**

**ఈ నెల 17, 18, 19 తేదీల్లో రిలే దీక్షలు**



**తెలంగాణ పత్రిక చారకొండ అక్టోబర్ 14:** చారకొండ మండలంగా ఏర్పడి పదేళ్లు గడుస్తున్నా, నేటికీ పలు ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేకపోవడం సిగ్గుచేటని చారకొండ జేఏసీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించి, ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు మంజూరు చేయాలని కోరుతూ చారకొండ జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 17, 18, 19 తేదీల్లో అంబేద్కర్ చౌరస్తా వద్ద రిలే దీక్షలు చేపట్టనున్నట్లు నాయకులు ప్రకటించారు. పదేళ్లుగా ఈ సమస్య పరిష్కారం కాకపోవడం పట్ల వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి కార్యాలయాల నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేసి, ప్రజల ఇబ్బందులను తొలగించాలని కోరారు. ఈ రిలే దీక్షల్లో ప్రజలు, ప్రజాసంఘాలు పాల్గొని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు చింతపల్లి అశోక్, కిరణ్, కేశమోని శంకర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని వెంటనే శిక్షించాలి!

**మెదక్ ఘటనపై మంగపేట మండల రజక సంఘం అధ్యక్షుడు నూతులకంటి రాజు డిమాండ్**



**మంగపేట, అక్టోబర్ 14 (తెలంగాణ పత్రిక):** మెదక్ పట్టణంలో వీరవనిత చాకలి ఐలమ్మ విగ్రహంపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని మంగపేట మండల రజక సంఘం అధ్యక్షుడు నూతులకంటి రాజు అన్నారు. విగ్రహ ధ్వంసం తమ రజక జాతి ఆత్మగౌరవంపై జరిగిన దాడిగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి, వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు. చాకలి ఐలమ్మ తెలంగాణ ప్రజల ముద్దుబిడ్డ అని, నాటి పెత్తందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడి, రైతాంగ విముక్తి కోసం కృషి చేసిన వీరవనిత అని కొనియాడారు. అలాంటి మహనీయురాలి విగ్రహాన్ని ధ్వంసం చేయడం అత్యంత బాధాకరమని అన్నారు. నేటికీ రజక జాతికి అన్యాయం జరుగుతుండటం ఆవేదన కలిగిస్తోందని తెలిపారు. మహనీయుల విగ్రహాలపై దాడులకు పాల్పడే వారిని ఉపేక్షించకూడదని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని నూతులకంటి రాజు కోరారు.

## రైతులకు 24 గంటల త్రీఫేజ్ విద్యుత్ అందించాలి!

**కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంపై బీఆర్ఎస్ నాయకుల ధర్నా**



**మంగపేట, అక్టోబర్ 14 (తెలంగాణ పత్రిక):** రైతులకు నాణ్యమైన 24 గంటల త్రీఫేజ్ విద్యుత్ అందించాలని డిమాండ్ చేస్తూ బుధవారం మంగపేట మండల విద్యుత్ ఉపకేంద్రం వద్ద బీఆర్ఎస్ నాయకులు మాజీ మండల పార్టీ అధ్యక్షుడు కుడుముల లక్ష్మి నారాయణ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం విద్యుత్ శాఖ ఏఈకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కుడుముల లక్ష్మి నారాయణ మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ అందించామని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్యుత్ కోతలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. ములుగు నియోజకవర్గ రైతుల కష్టాలు మంత్రి సీతక్కకు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. రైతుల పంటలు ఎండిపోకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గుండేటి రాజుయాదవ్, చిలకమర్రి రాజేందర్, కోరం సంతోష్, కాడబోయిన నరేందర్, నూతులకంటి ముకుందం, అచ్చ సత్యనారాయణ, గుమ్మల వీరాస్వామి, గుడివాడ శ్రీహరి, గంధం కిషోర్ తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మెట్టుపల్లి గ్రామంలో, హనుమాన్ టెంపుల్‌లో మహాలక్ష్మి అవతారంగా శ్రీ కనకదుర్గ అమ్మవారు



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (తెలంగాణ పత్రిక, )అక్టోబర్ 14**
జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం మెట్టుపల్లి గ్రామంలో, శ్రీ శ్రీ శ్రీ దుర్గా మాత నవరాత్రి ఉత్సవాలు హనుమాన్ టెంపుల్ దేవాలయంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈరోజు అనగా బుధవారం రోజున మహాలక్ష్మి అవతారంలో దర్శనం ఇచ్చారు. కుంకుమ పూజ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ పెండం రాజేందర్ మాట్లాడుతూ, ప్రతిరోజు అమ్మవారి పూజా కార్యక్రమంలో గ్రామ ప్రజలు భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని అమ్మవారి కృపతో గ్రామ ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో, పాడిపంటలతో, వర్ధిల్లాలని, అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు, ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

RNI No. APTEL/2008/23088
తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
తెలుగు దిన పత్రిక
నిజం మా విజన్
Epaper.Telanganapatrika.in



## పర్లపల్లి గ్రామంలో ఘనంగా తెలంగాణ తొలి శాసన సభాపతి సిరికొండమధు సుధనాచారి జన్మదిన వేడుకలు



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి: (తెలంగాణ పత్రిక) అక్టోబర్ 14:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మొగుళ్ళపల్లి మండలం పర్ల పల్లి గ్రామంలో ఘనంగా తెలంగాణ తొలి శాసనసభపతి ప్రస్తుత శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి జన్మదిన వేడుకలు, కెక్కర్ల ప్రశాంత్ ఆధ్వర్యంలో, మంగళవారం రోజున ఘనంగా నిర్వహించారు, కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు, ఈ సందర్భంగా మధుసూదనాచారి కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో, కెక్కర్ల ప్రశాంత్, బండి కుమార్, మంద కుమార్, బుర్ర శ్రీను, బుర్ర బిక్షపతి, బండి శ్రీను, మోత్కూరు శ్రీను, టిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం

కుటుంబ సభ్యులకు తప్పిన పెను ప్రమాదం



**పాపన్నపేట,అక్టోబర్ 14: (తెలంగాణ పత్రిక)**
ప్రమాదవశాత్తు ఓ ఇల్లు దగ్ధమైన సంఘటన మండల పరిధిలోని మిన్పూర్ గ్రామంలో మంగళవారం రాత్రి సమయంలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మిన్పూర్ గ్రామానికి చెందిన మహమ్మద్ సూఫీ హుస్సేన్ దసరా సెలవులు ఉండడంతో భార్య, ఇద్దరు పిల్లలను తీసుకొని హైదరాబాదులోని బంధువుల ఇంటికి వెళ్లారు. రోజు మాదిరిగానే తల్లిదండ్రులు ఇంట్లోనే నిద్రిస్తున్నారు. రాత్రి ఒక్కసారిగా ఇంట్లో మంటలు చెలరేగి ఫర్నిచర్, బట్టలు, ఇతర వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. తల్లిదండ్రులు తేరుచుకొని బయటకు రావడంతో పెను ప్రమాదం తప్పింది. ఘటనను గమనించిన స్థానికులు బిందెలు, బకెట్లతో నీటిని తీసుకువచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే ఫర్నిచర్, బట్టలు, వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. రెవెన్యూ సిబ్బంది ఘటనకు సంబంధించి వివరాలు సేకరించారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

## చారకొండలో మెడ్‌ప్లస్ స్టోర్ ప్రారంభం

ముఖ్య అతిథిగా హాజరైన దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్



**తెలంగాణ పత్రిక చారకొండ: అక్టోబర్ 14**
చారకొండ మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన మెడ్‌ప్లస్ మెడికల్ స్టోర్‌ను నల్లగొండ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రామావత్ రవీంద్ర కుమార్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టోర్ నిర్వాహకులు ఆనంద్ ఆయనకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. మండల కేంద్రంలో మెడ్‌ప్లస్ స్టోర్ అందుబాటులోకి రావడంతో స్థానిక ప్రజలకు మందుల కొనుగోలులో మరింత సౌకర్యం కలగనుంది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి పలువురు ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు హాజరై నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చారకొండ సింగిల్ విండో చైర్మన్ జెల్ల గురువయ్య గౌడ్, ఎర్రగుంటపల్లి సర్పంచ్ మాల్‌రెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, దేవరకొండ కౌన్సిలర్ పొట్ట మురళి, మాజీ సర్పంచులు పేట రాధా వెంకటయ్య, లోకసాని శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ రఘు, మాల్‌రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు చారకొండ శివ, ఆరేళ్ల పర్వతాలు గౌడ్, పల్చ వెంకటయ్య గౌడ్, ఖలీల్, చరణ్ రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ మహాలక్ష్మిదేవి అలంకరణలో చండిక అమ్మవారు



**పాలకుర్తి, అక్టోబర్ 14(తెలంగాణ పత్రిక):** శ్రీసోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం నాలుగో రోజు శ్రీ మహాలక్ష్మి దేవి అలంకరణలో చండి అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. అర్చకులు అమ్మవారికి పంచామృత అభిషేకం,కుంకుమార్చన, చండీ హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో భాగం లక్ష్మీ ప్రసన్న, ఆలయ అర్చకులు,సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# చిలుకూరు పీహెచ్‌సీకి గ్రహణం






- 2024 వరదల్లో కూలిన ప్రహరీ గోడ
- పట్టించుకోని అధికారులు, పాలకులు!
- మండల ప్రజారోగ్యానికి నిలయమైన
- ఆస్పత్రికి భద్రత ఏది?
- కూలిన గోడను పట్టించుకోక
- ఏళ్లు గడుస్తున్నా శూన్యమే స్పందన
- రక్షణ లేక ఆస్పత్రి ఆవరణలోకి కుక్కలు,
- పశువుల సంచారం
- తీవ్ర భయాందోళనలో రోగులు

**సూర్యాపేట॥ అక్టోబరు 14॥తెలంగాణ పత్రిక॥ జిల్లా ప్రతినిధి భట్టు సంతోష్ తోళా నాయక్ ॥ చిలుకూరు (సూర్యాపేట జిల్లా):** మండలంలోని అన్ని గ్రామాల ప్రజలకు ఆరోగ్య నిలయంగా, ప్రాణాధారంగా నిలుస్తున్న చిలుకూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం (పి హెచ్ సి/ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్) తీవ్ర అలైక్యతకు గురవుతోంది. 2024లో వచ్చిన భారీ వర్షాలు, వరదల ఉధృతికి ఈ ఆరోగ్య కేంద్రం ప్రహరీ గోడ తీవ్రంగా దెబ్బతిని కూలిపోయింది. అయితే, ఏళ్లు గడుస్తున్నా కూలిన ప్రహరీ గోడను పునర్నిర్మించడంలో ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు ఘోరంగా విఫలమయ్యారు.

**భద్రత కరువై రోగులకు ఇబ్బందులు**

రోజువారీగా వందలాది మంది గర్భవతులు, బాలింతలు, వృద్ధులు మరియు చిన్నారులు వైద్య సేవల కోసం ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వస్తుంటారు. కానీ, ప్రహరీ గోడ లేకపోవడంతో ఆస్పత్రి ప్రాంగణంలోకి వీధి కుక్కలు, పశువులు స్వేచ్ఛగా సంచరిస్తున్నాయి. రాత్రి వేళల్లో మరియు అత్యవసర సమయంలో వైద్యం కోసం వచ్చే రోగులకు, ఆస్పత్రి సిబ్బందికి ఏమాత్రం రక్షణ లేకుండా పోయింది.

**అధికారుల, పాలకుల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం**

లక్షల రూపాయల నిధులతో వైద్య పరికరాలు, మౌలిక వసతులు కల్పిస్తున్నామని చెబుతున్న పాలకులు, కనీసం ఆస్పత్రికి రక్షణగా ఉండే ప్రహరీ గోడ నిర్మాణాన్ని మర్చిపోవడంపై స్థానిక ప్రజలు, ప్రజాసంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. "వరదలు వచ్చి ప్రహరీ కూలిపోతే ఇప్పటివరకు ఒక్క అధికారి కానీ, ఏ ఒక్క ప్రజాప్రతినిధి కానీ దీని మరమ్మతుల గురించి సమీక్షించకపోవడం విచారకరం" అని స్థానికులు విమర్శిస్తున్నారు.

**తక్షణమే స్పందించి నిధులు మంజూరు చేయాలి**

ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం, వైద్యాధికారులు మరియు స్థానిక పాలకులు స్పందించి, చిలుకూరు పి. హెచ్.సి కూలిన ప్రహరీ గోడ నిర్మాణానికి తక్షణమే నిధులు మంజూరు చేయాలని, సమస్యను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ఆర్టీఐ చట్టం అమలులో సూర్యాపేటకు రాష్ట్రస్థాయి గుర్తింపు!

సమాచార హక్కు చట్టం అమలులో ఉత్తమ జిల్లాగా అవార్డు

కలెక్టర్ తేజస్ పవార్‌కు ఎస్పీ నరసింహా అభినందనలు



**సూర్యాపేట, అక్టోబర్ 14, తెలంగాణ పత్రిక, జిల్లా ప్రతినిధి భట్టు సంతోష్ తోళా నాయక్:** సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) అమలులో ఉత్తమ జిల్లాగా సూర్యాపేట జిల్లా రాష్ట్రస్థాయి అవార్డును సొంతం చేసుకుంది. పారదర్శక పాలన, ప్రజలకు సమాచారాన్ని అందుబాటులో ఉంచడం, ప్రభుత్వ పరిపాలనలో జవాబుదారీతనాన్ని పెంపొందించడం వంటి అంశాల్లో జిల్లా యంత్రాంగం సాధించిన పురోగతికి ఈ పురస్కారం గుర్తింపుగా నిలిచింది. రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా సూర్యాపేట జిల్లాకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు రావడంపై జిల్లా పోలీసు శాఖ తరఫున ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్ హర్షం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ తేజస్ పవార్‌ను కలెక్టర్ కార్యాలయంలో ఎస్పీ నరసింహ కలిసి అభినందనలు తెలిపారు. ప్రభుత్వ సేవల్లో పారదర్శకతను పెంపొందించడం, సమాచార హక్కు చట్టం లక్ష్యాలను ప్రజలకు చేరువ చేయడం, పరిపాలనలో జవాబుదారీతనాన్ని బలోపేతం చేయడం వంటి అంశాల్లో ఈ అవార్డు సూర్యాపేట జిల్లా సాధించిన ప్రగతికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతోపాటు ప్రభుత్వ కార్యకలాపాలపై ప్రజలకు సమాచారం పొందే హక్కును సమర్థంగా అమలు చేయడం ప్రజాస్వామ్య పాలనలో కీలకమని ఈ సందర్భంగా గుర్తుచేశారు. రాష్ట్రస్థాయి పురస్కారం జిల్లా అధికార యంత్రాంగానికి మరింత బాధ్యతను, స్ఫూర్తిని అందిస్తుందని అభిప్రాయపడ్డారు. సమాచార హక్కు చట్టం అమలులో ఉత్తమ జిల్లాగా సూర్యాపేటకు గుర్తింపు లభించడం పట్ల జిల్లా అధికారుల్లో హర్షం వ్యక్తమవుతోంది. పారదర్శక పాలన, ప్రజా సంక్షేమం, సమర్థవంతమైన పరిపాలన దిశగా జిల్లా మరింత ముందుకు సాగాలని పలువురు ఆకాంక్షించారు.

## గ్రామాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేద్దాం

అష్టలో చెత్త బుట్టల పంపిణీ



**ముధోల్: 14అక్టోబర్(తెలంగాణ పత్రిక:** గ్రామాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అష్ట సర్పంచ్ రావుల లావణ్య – శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని అ–ష్ట గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో గ్రామస్తులకు చెత్త బుట్టిలను ఎంపీడీవో లవ కుమార్, సర్పంచ్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చా రు. ఇందులో భాగంగా గ్రా మ ప్రజలకు చెత్తబుట్టలను అందజేశామన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా చెత్తబుట్టల్లోనే వేయాలని సూచించారు. తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం ద్వారా పరిసరాల పరిశుభ్ర తను కాపాడవచ్చని తెలిపారు. రోడ్లపై, మురుగు కాలువల్లో చెత్త వేయడం వల్ల అపరిశుభ్రత ఏర్పడటంతో పాటు దోమలు, ఈగలు వృద్ధి చెంది ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపే అవకాశం ఉందని వివరించారు. ముధోల్ మండలంలోని అష్ట గ్రామపంచాయతీని చెత్త రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో శివకుమార్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, టీజీబి మేనేజర్ అనిల్, ఉప సర్పంచ్ సావిత్ర కోటయ్య, వార్డ్ సభ్యులు చిన్నన్న, సంతోష్, సురేఖ శేఖర్, మాజీ ఎంపీటీసీ సురుగుల పోశెట్టి, మాజీ సర్పంచ్ అశోక్, విడిసి అధ్యక్షులు అజయ్ రెడ్డి, క్యాషియర్ శ్రీనివాస్, ముత్యం, రాజన్న, రాజేశ్వర్, రామచందర్, మిద్దె సాయిలు, ఉపాధి హామీ సిబ్బంది రాజేశ్వర్ తోపాటు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లంతకుంట మండలంలో 15, 16 తేదీల్లో ఓటరు నమోదు ప్రత్యేక శిబిరం



**ఇల్లంతకుంట అక్టోబర్ 14 తెలంగాణ పత్రిక:** మండలంలో ఈ నెల 15, 16 తేదీల్లో ఓటరు నమోదు ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్వో రాచకట్ల , సురేష్ తెలిపారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ రెండు రోజులు అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద బిఎల్ఓలు అందుబాటులో ఉంటారని తెలిపారు. కొత్త ఓటరు నమోదుకు ఫారం–6 పూరించి అందజేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## పోక్సో కేసులో నిందితుడికి 35 ఏళ్ల జైలు శిక్ష

మైనర్ బాలికను ప్రేమ పేరుతో వంచించి, లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి శిక్ష విధిస్తూ తీర్పు

సూర్యాపేట జిల్లా ఎస్పీ కె. నరసింహా ఐపీఎస్




**సూర్యాపేట॥ అక్టోబర్ 14॥ తెలంగాణ పత్రిక॥ జిల్లా ప్రతినిధి భట్టు సంతోష్ తోళా నాయక్॥** మైనర్ బాలికను ప్రేమ పేరుతో వంచించి, వివాహం చేసుకుని లైంగిక దాడికి పాల్పడిన కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి 35 సంవత్సరాల జైలు శిక్ష, రూ. 28,000 జరిమానా విధిస్తూ సూర్యాపేట గౌరవనీయ మొదటి అదనపు జిల్లా మరియు సెషన్స్ న్యాయమూర్తి, ఇన్‌చార్జ్ పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి డాక్టర్ పి. శివరామకృష్ణ ప్రసాద్ మంగళవారం (13–10–2026) తీర్పు వెలువరించారని జిల్లా ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్ తెలిపారు. బాధితురాలికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డి ఎల్ ఎస్ ఎ ) ద్వారా రూ. 7 లక్షల పరిహారం అందించాలని న్యాయస్థానం ఆదేశించినట్లు వెల్లడించారు. సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన 13 ఏళ్ల బాలికకు ఆత్మకూరు (ఎస్) మండలం శెట్టిపాలెం గ్రామానికి చెందిన కొమ్ము దయాకర్ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయమయ్యాడు. అనంతరం ప్రేమ పేరుతో బాలికను వేధిస్తూ, వివాహం చేసుకుంటానని వెంటపడేవాడు. బాలిక నిరాకరించినప్పటికీ, ఆమె ఒంటరిగా ఉన్న సమయంలో బలవంతంగా లైంగిక దాడికి పాల్పడ్డాడు.. పలుమార్లు దాడికి పాల్పడ్డ అనంతరం విజయవాడలోని కనకదుర్గమ్మ ఆలయంలో బాలికను వివాహం చేసుకుని, లైంగిక దాడిని కొనసాగించాడు. ఈ ఘటనపై బాలిక తండ్రి 2023 జూలై 18న సూర్యాపేట రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, అప్పటి ఎస్ఐ ఎస్.కె. యాకూబ్ కేసు నమోదు చేశారు. అప్పటి సూర్యాపేట డీఎస్పీ పి. నాగభూషణం దర్యాప్తు చేపట్టి, న్యాయస్థానంలో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసులో సాక్ష్యాధారాలను పరిశీలించిన గౌరవనీయ న్యాయస్థానం నిందితుడు కొమ్ము దయాకర్‌పై నేరం నిరూపితం కావడంతో వివిధ సెక్షన్ల కింద 35 సంవత్సరాల కారాగార శిక్ష విధించి, రూ. 28,000 జరిమానా విధించడం జరిగినది. ఈ కేసులో పోక్సో ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె. రఘురామయ్య ప్రాసిక్యూషన్ తరఫున వాదనలు వినిపించారు. కోర్టు లైజన్ అధికారిగా హెడ్ కానిస్టేబుల్ గంపల శ్రీకాంత్, కోర్టు డ్యూటీ కానిస్టేబుల్ దొంగరి బ్రహ్మం న్యాయస్థానంలో కేసు విచారణకు అవసరమైన సమన్వయం అందించారు. మైనర్ బాలికలు, మహిళలపై లైంగిక నేరాలకు పాల్పడే వారిపై పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని ఎస్పీ తెలిపారు. బాలికలు, మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, బాధితులకు న్యాయం జరిగేలా కేసుల దర్యాప్తును సమర్థవంతంగా చేపట్టి, నిందితులకు చట్టప్రకారం శిక్షలు పడేలా కృషి చేస్తామని పేర్కొన్నారు.

## మహా చండి దేవిగా వనదుర్గమ్మ

అంగరంగ వైభవంగా సాగుతున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

తీరొక్క మొక్కులు చెల్లించుకుంటున్న భక్తజనం

నేడు మహాలక్ష్మి దేవిగా వన దుర్గమ్మ దర్శనం



**పాపన్నపేట, అక్టోబర్ 14:(తెలంగాణ పత్రిక):** భక్తులు కోరిన కోరికలు తీర్చే ఇంటి ఇలవేల్పుగా.. దేశంలోనే రెండో వన దుర్గామాత ఆలయంగా.. జనమేజయుని సర్పయాగస్థలిగా వినతికెక్కిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పాపన్నపేట మండలం ఏడుపాయల వనదుర్గాదేవి క్షేత్రంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. నాలుగవ రోజైన బుధవారం చవితి పురస్కరించుకొని వన దుర్గామాతను మహా చండి (కుష్మాండ) దేవి రూపంలో ఆకుపచ్చ రంగు చీర, వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. ఆలయ అర్చకులు వేకువ జామునే అమ్మవారికి అభిషేకం, అర్చనలు నిర్వహించి ఆకుపచ్చ రంగు చీర, వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అమ్మ దర్శనం కల్పించారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ సిబ్బంది, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**నేడు మహాలక్ష్మి దేవిగా వన దుర్గమ్మ దర్శనం**

దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఐదవ రోజైన గురువారం వనదుర్గామాత మహాలక్ష్మి (స్కంద మాత) దేవి రూపం, పెసర రంగు వస్త్రంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.



## అభయ హస్త ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో...

# కోటగిరిలో ఉచిత వైద్య శిబిరం





**కోటగిరి తెలంగాణ పత్రిక అక్టోబర్ 14:** కోటగిరి మండల కేంద్రంలోని వినాయక్ నగర్ లో బుధవారం అభయ హస్తం ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో స్టార్ హాస్పిటల్స్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పాల్గొన్న వారికి డాక్టర్ గణేష్ వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అభయ హస్తం ఫౌండేషన్ నిర్వాహకులు స్థానిక సర్పంచ్ బర్ల మధుకర్ మాట్లాడుతూ.. ..కోటగిరి మండల కేంద్రంలోని ఆయా కాలనీలలో స్టార్ హాస్పిటల్స్ సౌజన్యంతో అభయ హస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలను నిర్విరామంగా నిర్వహిస్తామని తెలిపారు. ప్రస్తుత కాలంలో వైద్యం ఖర్చుతో కూడుకున్నది కాబట్టి పేద ప్రజలకు ఈ ఉచిత వైద్య శిబిరాలు ఎంతగానో ఉపయుక్తంగా ఉంటాయని ఆయన పేర్కొన్నారు. ఈ శిబిర నిర్వహణకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు అంబటి సౌజన్య గంగా ప్రసాద్ గౌడ్, పత్తి అబ్బయ్య, కమ్మరి గగన్, మేత్రి గంగాధర్, కన్నం శ్రీనివాస్, సాజిదా బేగం నజీర్, స్టార్ హాస్పిటల్ సిబ్బంది, వినాయక్ నగర్ కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

## పత్తి కొనుగోళ్లు ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలి

అడిషనల్ కలెక్టర్ అశోక్ కుమార్



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి (తెలంగాణ పత్రిక) అక్టోబర్, 14:** జయశంకర్ భూపాలపల్లి బుధవారం ఐడిఓసిలోని అదనపు కలెక్టర్ చాంబర్ లో పత్తి కొనుగోళ్ళపై జిల్లా స్థాయి సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పత్తి కొనుగోలు ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేయడంతో పాటు రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు. ఈ సందర్భంగా పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, రైతులకు రవాణా సౌకర్యాలు, పత్తి నాణ్యత పరీక్షలు, తూకాల్లో పారదర్శకత, అగ్నిమాపక భద్రత, కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన సదుపాయాల కల్పన తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అధికారులు, వ్యవసాయ, మార్కెటింగ్, పోలీస్, రవాణా, అగ్నిమాపక, లీగల్ మెట్రాలజీ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పత్తి మిల్లర్లు, వ్యాపారులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శులు కొనుగోలు ప్రక్రియకు అవసరమైన సమాచారాన్ని అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. రైతులు పత్తి విక్రయించే సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా చూడాలని, కొనుగోలు కేంద్రాల్లో తగిన ఏర్పాట్లు పూర్తి చేసి నిర్దేశిత నిబంధనల ప్రకారం కొనుగోళ్లు నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎఎస్పీ నరేష్ కుమార్, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వరంగల్ జనరల్ మేనేజర్, జిల్లా వ్యవసాయ అధికారి, జిల్లా ఫైర్ ఆఫీసర్, జిల్లా రవాణా అధికారి, లీగల్ మెట్రాలజీ అధికారులు, పత్తి మిల్లర్లు, వ్యాపారులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా శక్తి రైతు సేవా కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ

ప్రధాన కంపెనీల విత్తనాలు, ఎస్ఎస్పీ, కాంప్లెక్స్ ఎరువుల విక్రయాలపై ఆరా



**పాలకుర్తి అక్టోబర్ 14(తెలంగాణ పత్రిక):** రైతులకు వ్యవసాయానికి అవసరమైన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, డ్రిప్ పరికరాలు అందుబాటులో ఉండేలా చూడాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ సూచించారు. పాలకుర్తి మండలంలోని ముత్తారం గ్రామంలో గల మహిళా శక్తి రైతు సేవా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ సందర్శించి, అక్కడ రైతులకు అందిస్తున్న సేవలు, విక్రయిస్తున్న వ్యవసాయ ఉత్పాదకాలు, అందుబాటులో ఉన్న పరికరాలు, విత్తన సంచులను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు అవసరమైన డ్రిప్ పరికరాలను అందుబాటులో ఉంచుతున్నారా, ఇప్పటివరకు ఎంత మంది రైతులకు డ్రిప్ పరికరాలు అందించారు? అనే అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. తక్కువ నీటితో పంటలకు సమర్థవంతంగా సాగునీరు అందించేందుకు డ్రిప్ పద్ధతి ఎంతో ఉపయోగకరమని, రైతులకు ఈ పరికరాలపై అవగాహన కల్పిస్తూ వాటి వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు. అలాగే, రైతు సేవా కేంద్రంలో ప్రధాన కంపెనీలకు చెందిన నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉన్నాయా? రైతులకు వాటిని విక్రయిస్తున్న విధానం ఎలా ఉందనే అంశాలను పరిశీలించారు. పంటల సాగుకు అవసరమైన ఎస్ఎస్పీ, కాంప్లెక్స్ ఎరువుల నిల్వలు, విక్రయాల గురించి ఆరా తీశారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళా శక్తి రైతు సేవా కేంద్రాల వ్యవసాయ రంగంలో భాగస్వాములవుతూ రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ పరిశీలనలో డీఏఓ అంబికా సోనీ, ఎంపీడీవో వేదవతి, ఏడీఏ అపర్ణ, ఎంపీఓ మల్లిఖార్జున, ఎంఏఓ విద్యాసాగర్, ఏఈఓ మహేష్, ఇతర సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్రస్థాయి ఖో-ఖో పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్లు ప్రథమ స్థానంలో నిలవాలి

క్రీడాకారులు క్రమశిక్షణ, పట్టుదలతో రాణించాలి  కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి





**కరీంనగర్ తెలంగాణ పత్రిక అక్టోబర్ 14: కరీంనగర్:** ఉమ్మడి కరీంనగర్ జిల్లా జూనియర్ బాలబాలికల ఖో–ఖో జట్లు రాష్ట్రస్థాయి పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలవాలని కరీంనగర్ జిల్లా ఖో–ఖో అసోసియేషన్ అధ్యక్షుడు, మాజీ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఆకాంక్షించారు. కరీంనగర్ జిల్లా కేంద్రానికి సమీపంలోని లయోలా ఉన్నత పాఠశాల మైదానంలో జిల్లా ఖో–ఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో గత పది రోజులుగా నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి జూనియర్ బాలబాలికల ఖో–ఖో శిక్షణ శిబిరం బుధవారం ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా ఖో–ఖో అసోసియేషన్ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. క్రీడాకారులు క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధనతో ముందుకు సాగి ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి జిల్లాలో ఖో–ఖో క్రీడాభివృద్ధికి అసోసియేషన్ తరఫున నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో జట్లు ప్రథమ స్థానంలో నిలిచి విజయాన్ని సాధిస్తే క్రీడాకారులను ఘనంగా సన్మానించడంతో పాటు ప్రోత్సాహకాలు అందిస్తామని ప్రకటించారు. శిక్షణ శిబిరంలో క్రీడాకారులకు మెరుగైన శిక్షణ అందించి రాష్ట్రస్థాయి పోటీలకు సన్నద్ధం చేయడం అభినందనీయమని ఇతర అతిథులు పేర్కొన్నారు. క్రీడాకారులు తమ ప్రతిభను చాటుతూ కరీంనగర్ జిల్లా ఖ్యాతిని రాష్ట్రస్థాయిలో నిలబెట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఖో–ఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై. మహేందర్ రావు, ఢిల్లీ డిఫెన్స్ చైర్మన్ సతీష్ రెడ్డి, శాన్వి కాలేజీ చైర్మన్ ఎర్రంశెట్టి మునిందర్, తెలంగాణ ఖో–ఖో అసోసియేషన్ రిఫరీ బోర్డు కన్వీనర్ వంగపల్లి సూర్య ప్రకాష్, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు, సర్కిల్ ఇన్స్పెక్టర్ కుమారస్వామి, శిక్షణ శిబిరం ఇన్చార్జి డాక్టర్ ఏ. రవీందర్, కట్ట సంతోష్, రాజబాబు, రమేష్, వెంకటేష్, వ్యాయామ ఉపాధ్యాయులు, ఖో–ఖో శిక్షకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## సింగరేణి కార్మికుల సంక్షేమానికి చారిత్రాత్మక నిర్ణయాలు

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి (తెలంగాణ పత్రిక) అక్టోబర్ 14:** జయశంకర్ భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని అంబేద్కర్ సెంటర్ లో సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రకటించిన పలు కీలక నిర్ణయాల పట్ల హర్షం వ్యక్తం చేస్తూ నిర్వహించిన సంబరాల్లో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, 34% లాభాల వాటా, సొంతింటి కల సాకారం, కాంట్రాక్టు కార్మికులకు రూ. 5వేల ఐదు వందల రూపాయల ఆర్థిక ప్రయోజనం, పెండింగ్ డిపెండెంట్ ఉద్యోగాల నియామక పత్రాలను 15 రోజుల్లో అందజేత, మారుపేర్ల సమస్యకు శాశ్వత పరిష్కారం, వైద్య సేవల మెరుగుదల, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల అభివృద్ధి వంటి నిర్ణయాలు కార్మికుల సంక్షేమానికి దోహదపడతాయని తెలిపారు. అలాగే ఆదాయపన్ను సమస్యల పరిష్కారం, స్థానిక ఏరియా ఆసుపత్రుల్లోనే వైద్య పరీక్షలు నిర్వహించడం, ఆరోగ్య భద్రతను మరింత బలోపేతం చేయడం వంటి చర్యలు కార్మికులకు ఎంతో ప్రయోజనకరమని పేర్కొన్నారు. కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ కీలక నిర్ణయాలు తీసుకున్న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి గారికి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కార్మిక సంఘాల నాయకులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, టౌన్ మరియు రూరల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, భూపాలపల్లి మున్సిపాలిటీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## భూమి వివాదంపై విచారణ జరిపి న్యాయం చేయాలి



**ధర్మసాగర్, అక్టోబర్ 14 (తెలంగాణ పత్రిక):** ధర్మసాగర్ గ్రామకంఠంలోని సర్వే నంబర్లు 1069, 1069ఈలో భూమికి సంబంధించిన వివాదంపై అధికారులు విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని ముక్క దామోదర్ వారసులు ముక్క రాగవులు, రమేష్, శ్రీనివాస్ కోరారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 2016లో బండ ఇంద్రారెడ్డి, బుచ్చమ్మ వద్ద 440 గజాలు, 2022లో గంకిడి దామోదర్ రెడ్డి వద్ద 141 గజాల భూమిని కొనుగోలు చేసినట్లు తెలిపారు. మొత్తం 625 గజాల భూమికి సంబంధించి బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు గంకిడి శ్రీనివాస్ రెడ్డి, ఆయన సోదరుడు రాజగోపాల్ రెడ్డితో వివాదం కొనసాగుతోందని పేర్కొన్నారు. భూమి విషయంలో తమను దుర్భాషలాడుతూ, బెదిరింపులకు గురిచేస్తున్నారని, జేసీబీలతో భూమిని చదును చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో పలుమార్లు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. రాజకీయ పలుకుబడితో తమకు ఇబ్బందులు కలిగిస్తున్నారని, విలేకరుల సమావేశాల్లో పాల్గొంటే కేసులు నమోదు చేయిస్తామని బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఈ భూమి వివాదంపై సమగ్ర విచారణ జరిపి, తమకు న్యాయం చేయాలని ప్రభుత్వానికి, సంబంధిత ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో బాధిత కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## సోంపూర్‌లో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ




**పోతంగల్ తెలంగాణ పత్రిక అక్టోబర్ 14:** పోతంగల్ మండలంలోని సోంపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో స్థానిక సర్పంచ్ పవర్ కోమల్ సంజయ్ పటేల్ ఉప సర్పంచ్ ఔసాజి ఆధ్వర్యంలో లబ్ధిదారులకు కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మంజూరు చేస్తూ లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందే విధంగా స్మార్ట్ రేషన్ కార్డులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంజూరు చేయడం జరిగిందన్నారు. సోంపూర్ గ్రామం తరుపున రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు పోచారం శ్రీనివాస్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞత ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ మేత్రి ఔసాజీ మాజీ ఏఎంసి వైస్ చైర్మన్ చాకురే గంగాధర్ గ్రామ పెద్దలు పవర్ సంజీవ్ పటేల్ ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు సోంపూర్ పోచిరాం గ్రామ పాలన అధికారులు శ్రీకాంత్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికులకు దసరా కానుకగా దుస్తులను పంపిణీ చేసిన సర్పంచ్ దోకూర్ సునీత ప్రభాకర్ రెడ్డి



**కల్వకుర్తి అక్టోబర్ 14 తెలంగాణ పత్రిక:** తలకొండపల్లి మండలం పడకల్ గ్రామ సర్పంచ్ దోకూర్ సునీత ప్రభాకర్ రెడ్డి దసరా పండుగ సందర్భంగా గ్రామపంచాయతీ లోని పరిశుద్ధ కార్మికులకు దుస్తుల పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ రాఘవేందర్ గౌడ్, గ్రామపంచాయతీ సెక్రెటరీ రమాదేవి గ్రామపంచాయతీ వార్డు సభ్యులు లట్టుపల్లి వసంత రంగారెడ్డి ఎండి వాజిద్ జనిగే నరసింహ బురిగళ్ళ రాధిక రమేష్ గ్రామ ప్రజలు తిరుపతి గౌడ్ బషీర్ రామస్వామి నరసింహ రాజలింగం ఎండి గౌస్ యాదగిరి అశోక్ సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## జూలపల్లిలో ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టాలి

జలసంరక్షణ కార్యక్రమంలో భాగంగా భూగర్భ జలాల పెంపునకు చర్యలు

సర్పంచ్ కడారి శేఖర్ యాదవ్



**కల్వకుర్తి అక్టోబర్ 14 తెలంగాణ పత్రిక:** తలకొండపల్లి మండలం, జూలపల్లి గ్రామంలో భూగర్భ జలాలను పెంపొందించడంతో పాటు వర్షపు నీటిని వృథా కాకుండా సంరక్షించేందుకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో జలసంరక్షణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కడారి శేఖర్ యాదవ్, వార్డు సభ్యులు రాఘవేందర్ ముదిరాజ్, అల్లాజి గౌడ్, జగదీష్ గౌడ్‌తో పాటు గ్రామ పెద్దలు, గ్రామ పంచాయతీ కార్మికులు, రైతులు పాల్గొన్నారు. సర్పంచ్ కడారి శేఖర్ యాదవ్ మాట్లాడుతూ.. నీరు జీవకోటికి ప్రాణాధారమని, ప్రతి నీటి బొట్టును సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. వర్షపు నీటిని ఒడిసిపట్టడం ద్వారా భూగర్భ జలమట్టాన్ని పెంచుకోవచ్చని, భవిష్యత్తులో నీటి ఎద్దడి సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామ పరిధిలో వర్షపు నీరు వృథాగా పోకుండా అవసరమైన చోట నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని, రైతులు తమ వ్యవసాయ పొలాల్లో నీటి సంరక్షణ పద్ధతులను పాటించాలని కోరారు. నీటి వనరులను కాపాడుకోవడం ద్వారా వ్యవసాయానికి మేలు జరగడంతో పాటు గ్రామంలో తాగునీటి సమస్యలు తగ్గుతాయని పేర్కొన్నారు.

### జలసంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు గ్రామ ప్రజలందరూ సహకరించాలని సర్పంచ్ కడారి శేఖర్ యాదవ్ కోరారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. నీటి వనరులను సంరక్షించుకుంటూ భావితరాలకు నీటి కొరత లేకుండా చూడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

# రామన్నగూడెంలో భూ రీ సర్వేను పది రోజుల్లో పూర్తి చేయాలి





**యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి**

**విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తూ నాణ్యతా ప్రమాణాలతో నిర్మాణాలు చేపట్టాలి**

**భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక అక్టోబర్ 14:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం రామన్నగూడెంలో భూ రీ సర్వేను పది రోజుల్లో పూర్తి చేయాలని, అశ్వారావుపేటలో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ అశ్వారావుపేట మండలం రామన్నగూడెం రెవెన్యూ పరిధిలో భూ రీ సర్వే పనులను, అశ్వారావుపేటలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయా పనుల పురోగతిని సమీక్షించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. రామన్నగూడెం రెవెన్యూ పరిధిలో కొనసాగుతున్న భూ రీ సర్వే పనులను పరిశీలించిన కలెక్టర్, సర్వే నంబర్లు, గ్రామ సరిహద్దులు, రెవెన్యూ భూములు, అటవీ భూములకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సుమారు 600 ఎకరాల విస్తీర్ణంలో భూ రీ సర్వే పనులు కొనసాగుతున్నాయని, సుమారు 8 కిలోమీటర్ల పరిధిలో గ్రామ సరిహద్దులను నిర్ధారించే ప్రక్రియ చేపడుతున్నామని సర్వేయర్లు వివరించారు. గత వారం గ్రామసభ నిర్వహించి గ్రామ సరిహద్దుల నిర్ధారణకు సంబంధించిన పనులు ప్రారంభించినట్లు తెలిపారు. సర్వే నంబర్ 39 పరిధిలో భూములను సాగు చేసుకుంటున్న రైతులతో కలెక్టర్ మాట్లాడి, వారు ఎప్పటి నుంచి భూములను సాగు చేస్తున్నారు, వారి వద్ద పాత పట్టాలు, పాస్‌బుక్‌లు ఉన్నాయా, వాటిని ఎప్పుడు జారీ చేశారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతుల వద్ద ఉన్న పాత పట్టాలు, పాస్‌బుక్‌లు, ఇతర భూ సంబంధిత పత్రాలను పరిశీలించి రెవెన్యూ రికార్డులతో సరిపోల్చి వాస్తవాలను నిర్ధారించాలని సూచించారు. మూడు సర్వే నంబర్ల పరిధిలో 181 మంది రైతులు ఉన్నట్లు అధికారులు వివరించగా, వారికి సంబంధించిన పట్టాలు, రైతుబంధు వివరాలు, భూముల సాగు పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ భూముల విస్తీర్ణం, గ్రామ సరిహద్దులు, అటవీ బ్లాక్‌ల వివరాలను క్షేత్రస్థాయిలో ఖచ్చితంగా నమోదు చేయాలని తెలిపారు. గతంలో జారీ చేసిన ఉత్తర్వులు, పట్టాలు, గెజిట్ నోటిఫికేషన్లు, అందుబాటులో ఉన్న పాత భూ రికార్డులను సేకరించి ప్రస్తుత రికార్డులతో సరిపోల్చాలని సూచించారు. రికార్డుల్లో నమోదైన వివరాలకు, క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ పరిస్థితులకు మధ్య వ్యత్యాసాలను గుర్తించి, నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టాలన్నారు. భూ రీ సర్వేను పది రోజుల్లో పూర్తి చేసి, భూముల హద్దులు, విస్తీర్ణం, హక్కులకు సంబంధించిన వివరాలతో సమగ్ర నివేదిక సమర్పించాలని స్పష్టం చేశారు. అనంతరం అశ్వారావుపేటలో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రెటెడ్ పాఠశాల నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. భవన నిర్మాణ ప్రణాళిక, పనుల పురోగతి, విద్యార్థులకు కల్పించనున్న వసతులు, నిర్మాణ పనులు పూర్తి చేసే గడువుపై ఇంజినీరింగ్ అధికారులను, కాంట్రాక్టర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పనుల్లో జాప్యం లేకుండా నిర్మాణాన్ని వేగవంతం చేసి, నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాలలో శాఖాహారం, మాంసాహారం వంటశాలలను వేర్వేరుగా ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు వివరించారు. విద్యార్థుల కోసం డైనింగ్ హాల్, సుమారు 1,000 మంది కూర్చునే సామర్థ్యంతో ఆడిటోరియం, టేబుల్ టెన్నిస్, చెస్, క్యారమ్స్ వంటి ఇండోర్ క్రీడలకు ప్రత్యేక గదులు, బ్యాడ్మింటన్‌తో పాటు ఇతర క్రీడలకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదివే విద్యార్థులకు అనుగుణంగా అన్ని వసతులు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. జూనియర్ విద్యార్థుల హాస్టల్‌ను జీ+2 అంతస్తుల్లో నిర్మిస్తున్నామని, ఇందులో డార్మిటరీలతో పాటు రెండు అంచెల పడకల సదుపాయం కల్పించనున్నట్లు అధికారులు తెలిపారు. నిర్మాణ పనులను గరిష్ఠంగా ఆరు నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, డిసెంబర్ నెలాఖరులోగా స్లాబ్ పనులు పూర్తిచేయనున్నట్లు వివరించారు. ప్రస్తుతం సుమారు 100 మంది కార్మికులు నాలుగు బృందాలుగా పనులు నిర్వహిస్తున్నారని, పనుల పర్యవేక్షణకు నలుగురు సైట్ ఇంజినీర్లు, నలుగురు సూపర్‌వైజర్లు విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల నిర్మాణంలో విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు ఉండేలా ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టాలని, నిర్మాణ నాణ్యత విషయంలో రాజీ పడకుండా నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్ సమన్వయంతో పనిచేస్తూ నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో తహసీల్దార్ రామకృష్ణతో పాటు సంబంధిత రెవెన్యూ, సర్వే, అటవీ, ఇంజినీరింగ్ శాఖల అధికారులు, కాంట్రాక్టర్ తదితరులు పాల్గొన్నారు.

## అంత్యక్రియలకు ఆర్థిక సాయం




**కోటగిరి తెలంగాణ పత్రిక అక్టోబర్ 14:** కోటగిరి మండల కేంద్రానికి చెందిన తాడ్కోల్ గోపి ఇటీవల నిజామాబాద్ సమీపంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలుసుకొని మండల బిజెపి నాయకులు వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపినారు. అనంతరం కోనేరు శశాంక్ ట్రస్ట్ తరఫున అంత్యక్రియల కోసం 5వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో మండల బిజెపి అధ్యక్షులు వేముల నవీన్ వార్డు మెంబర్ గంగారెడ్డి మృతుని కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## శంఖు చక్ర దీపాలు బహుకరించిన ఎస్ఎస్సి 1990-91 బ్యాచ్ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సేవాభావాన్ని అభినందించిన ఈఓ, అర్చకులు



**పాలకుర్తి, అక్టోబర్ 14(తెలంగాణ పత్రిక):** పాలకుర్తి మండలం వల్మిడి శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానానికి జెడ్పీహెచ్ఎస్ పాలకుర్తి పాఠశాలలో 199091 ఎస్ఎస్సీ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు శంఖు, చక్ర దీపాలను భక్తిశ్రద్ధలతో బహుకరించారు. ఈ సందర్భంగా దేవస్థానం ఈఓ వెంకటరెడ్డి, ఆలయ అర్చకులు చక్రవర్తుల కళ్యాణ సుందరాచార్యులు పూర్వ విద్యార్థుల సేవాభావాన్ని అభినందించారు. స్వామివారి ఆలయానికి దీపాలను బహుకరించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆలయ ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత శోభాయమానంగా తీర్చిదిద్దేందుకు భక్తులు, పూర్వ విద్యార్థులు అందిస్తున్న సహకారం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో దేవస్థానం ఈఓ వెంకటరెడ్డి, ఆలయ అర్చకులు చక్రవర్తుల కళ్యాణ సుందరాచార్యులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## బదిలీపై వెళ్తున్న విద్యుత్ శాఖ ఏఈ జానకిరామ్‌కు ఘన సన్మానం

జైపల్లి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో సత్కారం.. విద్యుత్ సేవలకు కృతజ్ఞతలు



**తెలంగాణ పత్రిక చారకొండ, అక్టోబర్ 14:** చారకొండ మండలం నుంచి కల్వకుర్తికి బదిలీ అయిన విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) జానకిరామ్‌కు జైపల్లి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం నిర్వహించారు. చారకొండ మండలంలో విధులు నిర్వహించిన సమయంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ ప్రజలకు అందించిన సేవలను గుర్తుచేసుకుంటూ గ్రామపంచాయతీ ప్రతినిధులు ఆయనకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా జైపల్లి సర్పంచ్ అమీనా అశోక్ రాథోడ్ మాట్లాడుతూ, ఏఈ జానకిరామ్ మండలంలో విధులు నిర్వహించిన సమయంలో ప్రజలకు విద్యుత్ శాఖ ద్వారా అందించిన సేవలు అభినందనీయమని అన్నారు. ఆయన భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని, తన విధుల్లో విజయాలు సాధిస్తూ ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ నాయకుడు అశోక్ రాథోడ్ మాట్లాడుతూ, జైపల్లి గ్రామపంచాయతీ పరిధిలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి సహకరించిన ఏఈ జానకిరామ్‌కు గ్రామపంచాయతీ తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు. ప్రజలకు సేవలందిస్తూ మంచి పేరు సంపాదించాలని, భవిష్యత్తులో మరింత అభివృద్ధి సాధించాలని కోరారు. ఈ సందర్భంగా ఏఈ జానకిరామ్‌ను శాలువాతో సత్కరించి, ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు. బదిలీపై వెళ్తున్న ఆయనకు గ్రామపంచాయతీ ప్రతినిధులు శుభాకాంక్షలు తెలియజేశారు.

## వన దుర్గమ్మను దర్శించుకున్న సిద్దిపేట జడ్జి

ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలు

ఆలయ మర్యాదలతో సత్కరించిన అర్చకులు, సిబ్బంది



**పాపన్నపేట, అక్టోబర్ 14:(తెలంగాణ పత్రిక):** దేశంలోనే రెండో వనదుర్గామాత ఆలయంగా ఏడుపాయలుగా చీలి ప్రవహించే ప్రసిద్ధ ప్రాంతంగా.. జనమేజయుని సర్పయాగస్థలిగా వినతికెక్కిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పాపన్నపేట మండలం ఏడుపాయల వనదుర్గామాతను సిద్దిపేట జడ్జి సంతోష్ బుధవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు, సిబ్బంది పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం తీర్థప్రసాదాలు అందజేసి ఆలయ మర్యాదలతో ఆలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఆలయ విశిష్టతను వివరించారు. మన దుర్గామాత అమ్మవారిని దర్శించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం



**ముధోల్: 14అక్టోబర్(తెలంగాణ పత్రిక)**

బైంసా–బాసర జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ దుర్మరణం చెందింది. ముధోల్ సీఐ రవీందర్ నాయక్, ఎస్సై బిట్ల పెర్సిస్ తెలిపిన వివరాల ప్రకారం నిజామాబాద్ జిల్లా బోధన్ మండలంలోని కల్దుర్తి గ్రామానికి చెందిన లక్ష్మి (68) అనే మహిళ బైంసా మండలంలోని కోతుల్ గాం గ్రామంలో సోదరుని ఇంటికి వెళ్ళింది. తిరుగు ప్రయాణంలో ముధోల్ లోని హెచ్ పి పెట్రోల్ బంక్ వద్ద బస్సు కోసం రోడ్డు దాటుతుండగా బాసర నుండి భైంసా వైపు వెళ్తున్న లారీ ఆకస్మాత్తుగా ఢీకొనడంతో లక్ష్మి తీవ్ర గాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో అటుగా బాసర మండలానికి వెళుతున్న మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి ప్రమాదం స్థలాన్ని పరిశీలించి ప్రమాదం జరిగిన తీరును స్థానికులను అడిగి తెలుసుకున్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతురాలికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

## రూ.3 లక్షల విలువైన 12 ఫోన్లు బాధితులకు అందజేత

సిఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసిన ఇబ్రహీంపట్నం పోలీసులు



**ఇబ్రహీంపట్నం,అక్టోబర్14( తెలంగాణ పత్రిక):** సీఈఐఆర్ పోర్టల్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కే.వి.పి. రాజు సూచించారు. పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను పోలీసు సాంకేతిక పరిజ్ఞానంతో సత్వరమే రికవరీ చేయవచ్చని తెలిపారు. ఇబ్రహీంపట్నం పోలీసు స్టేషన్ పరిధిలో ఇటీవల పోయిన 12 సెల్ ఫోన్లను బాధితుల ఫిర్యాదుల మేరకు ఐఎంఈఐ నంబర్ల ఆధారంగా సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేశారు. పోర్టల్ సహాయంతో ట్రాక్ చేసి రికవరీ చేసిన ఈ ఫోన్ల విలువ సుమారు రూ. 3 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. బుధవారం ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏసీపీ కేపీవీ రాజు,స్థానిక సీఐ మహేందర్ రెడ్డి,అడ్మిన్ ఎస్ఐ భాస్కర రావు,సీఈఐఆర్ పోర్టల్ నిర్వాహకురాలు మహిళా కానిస్టేబుల్ శ్రీలతలతో కలిసి బాధితులకు వారి ఫోన్లను అందించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఫోన్లు పోగొట్టుకున్న వారు వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని లేదా దగ్గరలోని పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని కోరారు. పోయిన తమ ఫోన్లు తిరిగి దక్కడంతో బాధితులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. పోగొట్టుకున్న ఫోన్లను రికవరీ చేసినందుకు ఎసిపి కే పి వి రాజు ఇబ్రహీంపట్నం క్రైమ్ సిబ్బందిని అభినందించారు.

## ఎస్సీ ప్రత్యేక అభివృద్ధి నిధుల వినియోగంపై సమీక్ష



**కామారెడ్డి ,అక్టోబర్ 14 ,(తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి):** కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధ్యక్షతన ఎస్సీ ప్రత్యేక అభివృద్ధి నిధి వినియోగంపై సంబంధిత శాఖల అధికారులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్సీ ప్రత్యేక అభివృద్ధి నిధుల కింద బడ్జెట్ విడుదల, ఇప్పటివరకు చేసిన ఖర్చులు, నిధుల వినియోగం, వివిధ శాఖల ద్వారా చేపట్టిన కార్యక్రమాల అమలు తీరు, పురోగతిపై సమగ్రంగా సమీక్షించారు. శాఖల వారీగా నిధుల కేటాయింపులు, ఖర్చుల వివరాలను పరిశీలించి, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై చర్చించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విక్టర్, శిక్షణ కలెక్టర్ రవి తేజ, జిల్లా ప్రణాళిక అధికారి రఘు నందన్, జిల్లా విద్యాశాఖ అధికారి మల్లికార్జున్, మత్స్యశాఖ అధికారి లాయక్ మోయినుద్దీన్, జిల్లా పంచాయతీ అధికారి మురళి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దామోదర్ రెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి జ్యోతి, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి వెంకటేష్ తదితర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మిర్యాలగూడ టూ టౌన్ ఎస్సై సతీష్ కుమార్‌కు తీవ్ర గాయాలు

పరిస్థితి విషమం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలింపు



**మిర్యాలగూడ ప్రతినిధి//అక్టోబర్ 14:(తెలంగాణ పత్రిక):** సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని రామగిరి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మిర్యాలగూడ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్సై సతీష్ కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. నేరేడుచర్ల నుంచి మిర్యాలగూడకు విధులకు వెళ్తున్న క్రమంలో ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం కందులవారిగూడెం గ్రామానికి చెందిన సతీష్ కుమార్ ప్రమాదంలో గాయపడటంతో 108 అంబులెన్స్‌లో మిర్యాలగూడలోని లీలా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న ఆయన పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించినట్లు తెలిసింది. సమాచారం అందుకున్న మిర్యాలగూడ డీఎస్పీ జి. రవి ఆసుపత్రికి చేరుకుని ఎస్సై సతీష్ కుమార్‌ను పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలు, ఇతర వివరాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

## జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి

రైతన్న సమస్యల పరిష్కారం కోసం కార్మిక కర్షక ఐక్యతను

మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది డబ్బికారి మల్లేష్



**మిర్యాలగూడ ప్రతినిధి//అక్టోబర్ 14:(తెలంగాణ పత్రిక):** వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాల పురిటిగడ్డ నల్లగొండ జిల్లాలో నవంబర్ 15 నుంచి 18వ తేదీ వరకు జరగనున్న అఖిల భారత 36వ రైతు మహాసభలను విజయవంతం చేయడానికి కార్మికులు, కర్షకులు, ప్రజలు సమష్టిగా కృషి చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బి కార్ మల్లేష్ కోరారు. బుధవారం మిర్యాలగూడ మండలం గ్రామంలో జాతీయ మహాసభల జయప్రదం కొరకు ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం దేశ రైతాంగ ఉద్యమ చరిత్రలో ప్రత్యేకమైన స్థానాన్ని కలిగి ఉందన్నారు. నల్లగొండ గడ్డ అనేక రైతాంగ పోరాటాలకు స్ఫూర్తినిచ్చిందని, అదే పోరాట స్ఫూర్తితో ప్రస్తుత రైతాంగ సమస్యలపై ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని అన్నారు. దేశంలో రైతులు, వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై విస్తృతంగా చర్చించడంతో పాటు, రైతాంగ ఉద్యమ భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయాలు తీసుకునేందుకు అఖిల భారత రైతు మహాసభలు వేదికగా నిలుస్తాయని తెలిపారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోసం కార్మికకర్షక ఐక్యతను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. రైతుల సమస్యలు కేవలం రైతులకే పరిమితమైనవి కాదని, వ్యవసాయంపై ఆధారపడిన కోట్లాది మంది ప్రజల జీవనంతో ముడిపడి ఉన్నాయని పేర్కొన్నారు. రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు, ప్రజాసంఘాలు ఐక్యంగా ముందుకు సాగితేనే ప్రజా సమస్యల పరిష్కారానికి బలమైన ఉద్యమాలను నిర్మించగలమన్నారు. నల్లగొండలో జరుగుతున్న ఈ జాతీయ మహాసభలకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి రైతు నాయకులు, ప్రతినిధులు హాజరుకానున్న నేపథ్యంలో మహాసభల విజయవంతానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని ఆయన కోరారు. మహాసభల ప్రచారాన్ని గ్రామగ్రామాన, కార్మిక ప్రాంతాల్లో విస్తృతంగా నిర్వహించాలని, కార్మికులు పెద్ద సంఖ్యలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మహాసభల విజయవంతం కోసం విరాళాలు, ప్రచారం, ఇతర కార్యక్రమాల్లో కార్మికులు మరియు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వీరేపల్లి వెంకటేశ్వర్లు సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి రవి నాయక్, సిపిఎం నాయకులు జిల్లోజు శీను వంగ అశోక్ సోమయ్య సైదులుతదితరులు పాల్గొన్నారు.

# కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

● పేద కుటుంబాలకు జాప్యం లేకుండా చెక్కుల అందజేత ● ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి





**ఆత్మకూర్, అక్టోబర్ 14, (తెలంగాణ పత్రిక):** పరకాల నియోజకవర్గంలోని నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల ప్రయోజనాలు జాప్యం లేకుండా అందిస్తున్నామని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. బుధవారం పరకాల క్యాంపు కార్యాలయంలో ఆత్మకూరు మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులను ఆయన పంపిణీ చేశారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్‌తో పాటు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీలో పరకాల నియోజకవర్గం రాష్ట్రంలోనే ముందంజలో ఉండటం సంతోషంగా ఉందన్నారు. అర్హులైన నిరుపేద కుటుంబాలకు సకాలంలో ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. చెక్కుల మంజూరు, పంపిణీ వేగవంతం కావడానికి తన వ్యక్తిగత సహాయకుడు సంతోష్ కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ జగన్మోహన్ రెడ్డి, రేవూరి జలంధర్ రెడ్డి, పరికిరాల వాసు, రేవూరి జయపాల్ రెడ్డి, కంచ రవి, అల్వాల రవి, పొని గోటి సత్యనారాయణ, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## దసరా పండుగ సందర్భంగా పారిశుధ్య కార్మికులకు, మున్సిపల్ సిబ్బందికి దుస్తుల పంపిణీ





**మిర్యాలగూడ ప్రతినిధి//అక్టోబర్ 14:(తెలంగాణ పత్రిక):** మిర్యాలగూడ పట్టణంలో దసరా పండుగ సందర్భంగా పారిశుధ్య కార్మికులు, మున్సిపల్ సిబ్బందికి ఆర్థిక సహాయం అందిస్తూ వారి సేవలను గుర్తించే కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మిట్టపల్లి వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ చిలుకూరి సుధ బాలకృష్ణ, వైస్ చైర్ పర్సన్ గుడిపాటి శిరీష నవీన్ కుమార్ మున్సిపల్ కమిషనర్ నర్రా శ్రీజ రెడ్డి ముఖ్య అతిథిలుగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ పారిశుధ్య కార్మికులు, మున్సిపల్ సిబ్బందికి స్వయంగా దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని, కార్మికులకు స్వయంగా భోజనం వడ్డించారు. పట్టణ పారిశుధ్య నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్న కార్మికులు, మున్సిపల్ సిబ్బంది సేవలను గుర్తించి, పండుగ వేళ వారితో ఆనందాన్ని పంచుకోవడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్ సిబ్బంది బిఎల్ఆర్ బ్రదర్స్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో హెచ్ఐవి /ఎయిడ్స్ కార్యక్రమ కార్యకలాపాలపై సమీక్షా సమావేశం



**భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక అక్టోబర్ 14:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో హెచ్ఐవి/ ఎడ్స్ నివారణ నియంత్రణ కార్యకలాపాల అమలు మరియు పురోగతిపై ఈ రోజు సమీక్షా సమావేశం జరిగింది. జిల్లా వైద్య అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ ప్రోగ్రామ్ ఆఫీసర్ (ఎయిడ్స్ & కుష్టు వ్యాధి నివారణ) డాక్టర్ ప్రసాద్ అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో ఏ ఆర్ టి కేంద్రాలు, ఐసిటిసిలు, డి ఎస్ ఆర్ సిలు, టి ఐ స్వచ్ఛంద సంస్థలు (ఎన్జీవోలు), సి ఎస్ సి-విహాన్ 2.0 వై ఆర్ జి లింక్ వర్కర్ పథకానికి చెందిన సిబ్బంది పాల్గొన్నారు. సమావేశంలో, డాక్టర్ ప్రసాద్ సంబంధిత కేంద్రాల పనితీరును వివిధ కార్యక్రమ కార్యకలాపాల పురోగతిని సమీక్షించారు. సేవా విధానాన్ని మెరుగుపరచడం, నిర్దేశిత లక్ష్యాలను సాధించడం, హెచ్ఐవిపరీక్ష కౌన్సెలింగ్ సేవలను బలోపేతం చేయడం, హెచ్ఐవి పాజిటివ్ వ్యక్తులను సకాలంలో యాంటీ-రెట్రోవైరల్ థెరపీ (ఏ ఆర్ టి)కి అనుసంధానించడం మరియు లబ్ధిదారుల పర్యవేక్షణను (ఫాలోప్) మెరుగుపరచడం వంటి అంశాలపై ఆయన తగిన సూచనలు జారీ చేశారు. కార్యక్రమ సిబ్బంది మధ్య సమర్థవంతమైన సమన్వయం, రికార్డుల ఖచ్చితమైన నిర్వహణ, నివేదికల సకాలంలో సమర్పణ మరియు కార్యక్రమ పనితీరును మెరుగుపరచడానికి ప్రత్యేక కృషి అవసరమని ఆయన నొక్కి చెప్పారు. సేవా విధానంలో ఉన్నలోపాలను గుర్తించి, హెచ్ఐవి/ఎయిడ్స్ వారణ నియంత్రణ కార్యక్రమ లక్ష్యాలను సాధించడానికి తగిన చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా హెచ్ఐవి/ ఎయిడ్స్ నివారణ, చికిత్స, సంరక్షణ మరియు సహాయక సేవలను బలోపేతం చేసే దిశగా అంకితభావంతో సమన్వయంతో పనిచేయాలని సిబ్బందికి పిలుపునివ్వడంతో సమావేశం ముగిసింది.

## 'డీఎస్‌హెచ్'లో 1,616 మంది స్పెషాలిటీ వైద్యుల భర్తీ

చివరి విడతలో 424 మందికి పోస్టింగ్

**హైదరాబాద్ :** జిల్లా, ప్రాంతీయ ఆసుపత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యుల నియామక ప్రక్రియ పూర్తయింది. డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్(డీఎస్ హెచ్) విభాగం పరిధిలోకి వచ్చే ఈ ఆసుపత్రుల్లో మొత్తం 17 స్పెషాలిటీ విభాగాల్లో 1,616 మందిని సివిల్ అసిస్టెంట్ సర్జన్లుగా ప్రభుత్వం నియమించింది. గతంలో రెండు విడతల్లో వైద్యుల భర్తీ జరగగా.. తాజాగా వైద్య ఆరోగ్య సేవల నియామక బోర్డు 424 మందికి సంబంధించిన నియామక ప్రక్రియను ముగించడంతో సర్కారు వీరందరికీ పోస్టింగ్ ఆర్డర్లు ఇచ్చింది. కొత్త వైద్యులు బుధవారం నుంచి విధుల్లో చేరుతున్నారు. ఇకపై ప్రభుత్వ ఆసుపత్రుల్లో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్, పీడియాట్రిక్స్, గైనకాలజీ, ఎనస్థీషియా, ఆర్థోపెడిక్స్, ఈఎన్‌టీ, ఆప్తాల్మాలజీ, సైకియాట్రీ, పల్మనాలజీ, డెర్మటాలజీ, పాథాలజీ తదితర విభాగాల్లో నాణ్యమైన సేవలు అందనున్నాయి.

## శ్రీ వన దుర్గ అమ్మ వారిని దర్శించుకున్న కె.ఎల్ గ్రూప్ అధినేత కొండ లక్ష్మణ్ అరుణ దంపతులు





**జగిత్యాల, అక్టోబర్ 14 (తెలంగాణ పత్రిక):** జగిత్యాల పట్టణంలోని దసరా ఉత్సవాల్లో భాగంగా కే.ఎల్ గ్రూప్ అధినేత కొండ లక్ష్మణ్ అరుణ దంపతులు తన ఇంటి నుండి ఊరేగింపుగా వెళ్లి భవానీ హారిద్ర గణపతి పూజ కార్యక్రమంలో పాల్గొని అనంతరం పట్టణంలోని దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీ వన దుర్గభవాని అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. వన దుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీర్వచనం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో తన కుమారులు ప్రణీత్ ఉపేంద్ర ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ప్రధాన వైద్యశాలలో కాలు ఎక్స్‌రే పరీక్షలు చేయించుకున్న జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి : ( తెలంగాణ పత్రిక) అక్టోబర్ 14:** జయశంకర్ భూపాలపల్లి బుధవారం ప్రభుత్వ ప్రధాన వైద్యశాలలో ఎక్స్‌రే పరీక్షలు చేయించుకున్న జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ. కొన్ని రోజుల క్రితం వాకింగ్ చేస్తుండగా అనుకోకుండా కాలు జాడడంతో కాలుకు ప్యాక్చర్ కావడం జరిగింది. తొలుత కాలు ఫ్రాక్చర్ అయిన సమయంలో కూడా ఆయన కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లకుండా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలోనే ప్రాథమిక చికిత్స పొంది అందరికీ ఆదర్శంగా నిలిచారు. సాధారణ పౌరుడిలాగే ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాన్ని విశ్వసించి, అక్కడే చికిత్స పొందుతున్న కలెక్టర్‌ను స్థానిక వైద్యులు, సిబ్బంది అభినందించారు. చికిత్సలో భాగంగా కోలుకుంటున్న తీరును పరిశీలించేందుకు బుధవారం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు కలెక్టర్‌కు ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వైద్య సేవలు, సదుపాయాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

## ఉస్మానియా జూడాల సమ్మె తాత్కాలిక విరమణ

**హైదరాబాద్ :** గత రెండు రోజులుగా ఉస్మానియా ఆసుపత్రిలో జూనియర్ డాక్టర్లు చేపట్టిన సమ్మెను బుధవారం తాత్కాలికంగా విరమించారు. పది రోజుల్లో సమస్యలను పరిష్కరిస్తామని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హామీ ఇవ్వడంతో సమ్మెను తాత్కాలికంగా విరమిస్తున్నట్లు జూడాల సంఘం ప్రతినిధులు వెల్లడించారు. ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలు, మందుల కొరత, రోగ నిర్ధారణ పరీక్షలు వంటి కీలక సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లడం కోసం జూడాలు సమ్మె చేపట్టారు.

## జగిత్యాల జిల్లా రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్‌కు నూతన కార్యవర్గం ఎన్నిక

జిల్లా అధ్యక్షుడిగా చిట్యాల భూమయ్య, ప్రధాన కార్యదర్శిగా పంగ రాజేశం



**జగిత్యాల అక్టోబర్ 14 తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి**

జగిత్యాల జిల్లా రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు,ప్రధాన కార్యదర్శి పదవులతో పాటు రాష్ట్ర కౌన్సిల్ ఈసీ మెంబర్‌గా నూతన ప్రతినిధులను ఎన్నుకున్నారు. రాష్ట్ర కౌన్సిల్ ఈసీ సమావేశంలో ఈ ఎన్నికలు నిర్వహించారు. జగిత్యాల రూరల్ మండల నాయబ్ తహసీల్దార్ చిట్యాల భూమయ్యను జిల్లా అధ్యక్షుడిగా, జగిత్యాల అర్బన్ మండల జూనియర్ అసిస్టెంట్ పంగ రాజేశంను జిల్లా ప్రధాన కార్యదర్శిగా, జగిత్యాల అర్బన్ మండల నాయబ్ తహసీల్దార్ గంద్ర రాజేందర్ రావును రాష్ట్ర కౌన్సిల్ ఈసీ సభ్యుడిగా ఎన్నుకున్నారు. రాష్ట్ర టీజీఈ జేఏసీ గౌరవ అధ్యక్షుడు లచ్చిరెడ్డి సారథ్యంలో, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ రాష్ట్ర అధ్యక్షుడు బాణాల రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి భిక్షము ఈ ఎన్నికల వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ, రెవెన్యూ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, చర్చల ద్వారా వాటి పరిష్కారానికి సంఘం కృషి చేస్తుందని తెలిపారు. నూతనంగా ఎన్నికైన జగిత్యాల జిల్లా అధ్యక్షుడు చిట్యాల భూమయ్య, ప్రధాన కార్యదర్శి పంగ రాజేశం, రాష్ట్ర కౌన్సిల్ ఈసీ సభ్యుడు గంద్ర రాజేందర్ రావులకు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అభినందనలు తెలిపారు.

## ఇందిరమ్మ ఇళ్లతో ఽ పేదల సొంతింటి కల సాకారం

ఎమ్మెల్యే సంజయ్ కుమార్



**రాయికల్ మండలం (తెలంగాణ పత్రిక) అక్టోబర్ 14** ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదల సొంతింటి కల సాకారమవుతోందని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అన్నారు. రాయికల్ మండలం కట్కాపూర్ గ్రామంలో మంచాల లక్ష్మీధర్మరాజు, కార్యారి జల వెంకటేష్ దంపతుల గృహప్రవేశ కార్యక్రమాలకు, అలియా నాయక్ తండాలో లావుడియా సుగుణరాజు, అనితభాషా దంపతుల గృహప్రవేశాలకు హాజరై లబ్ధిదారులకు చీరలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగిత్యాల నియోజకవర్గానికి మొదటి విడతలో 3,300, రెండో విడతలో మరో 2,000 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి నిరుపేదకు ఇల్లు మంజూరయ్యేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కట్కాపూర్, ఆలూరు గ్రామాల్లో దుర్గామాత నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఆధ్వర్యంలో మహా బతుకమ్మ శోభాయాత్ర ప్రారంభం



**జగిత్యాల పట్టణం (తెలంగాణ పత్రిక) అక్టోబర్ 14:** జగిత్యాల పట్టణంలో పండుగ వాతావరణం. మినీ స్టేడియం నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు శోభాయాత్ర జగిత్యాల మున్సిపల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహా బతుకమ్మ వేడుకల్లో భాగంగా మహా బతుకమ్మ శోభాయాత్ర మినీ స్టేడియం నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ఘనంగా ప్రారంభమైంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలతో శోభాయాత్రలో సందడి చేశారు. తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని చాటుతూ, బతుకమ్మ పాటలు, ఆటలతో పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది. మహా బతుకమ్మ వేడుకల ద్వారా తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ఐక్యతకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగ విశిష్టతను చాటిచెప్పడం లక్ష్యంగా మున్సిపల్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

## పెద్ద కోమటిపల్లి గ్రామంలో వీధిలైట్లు పెట్టించిన గ్రామ ఉప సర్పంచ్ గడ్డం రమేష్ గౌడ్



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి (తెలంగాణ పత్రిక) అక్టోబర్, 14:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం పెద్ద కోమటి పల్లి గ్రామంలో సద్దుల బతుకమ్మ మరియు దసరా పండుగ సందర్భంగా వీధి వీధిన ప్రతి స్తంభానికి వీధిలైట్లు దగ్గరుండి గ్రామపంచాయతీ సిబ్బందితో బల్బులు పెట్టించిన ఉప సర్పంచ్ గడ్డం రమేష్ గౌడ్. ఈ కార్యక్రమంలో నాలుగో వార్డ్ నెంబర్ దర్శనాలకోమల బిస్వామి, కారోబార్ దుండ తిరుపతి, మరియు గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
తెలుగు దిన పత్రిక



## రైతులకు విద్యుత్ భరోసా..

సమస్యల పరిష్కారానికి సీఎండీ హామీ!

మంత్రి సీతక్క చొరవతో స్పందించిన ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి



**మంగపేట, అక్టోబర్ 14 (తెలంగాణ పత్రిక):** మంగపేట మండల రైతాంగానికి వ్యవసాయ అవసరాల కోసం నాణ్యమైన త్రీఫేజ్ విద్యుత్ నిరంతరాయంగా అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి హామీ ఇచ్చినట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు మంగపేట మండల రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన పేర్కొన్నారు. దీనిపై తక్షణమే స్పందించిన సీఎండీ వరుణ్ రెడ్డి బుధవారం మంగపేట మండలంలో పర్యటించి, రైతుల విద్యుత్ అవసరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారని తెలిపారు. దేశవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయ రంగం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని, మంగపేట మండలంలో అధికంగా సాగు చేసే వరి పంట ప్రస్తుతం చివరి దశలో ఉందని వెంకటేశ్వర్లు వివరించారు. ఈ కీలక సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడితే రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని, అందువల్ల వ్యవసాయానికి నాణ్యమైన త్రీఫేజ్ విద్యుత్ నిరంతరాయంగా అందించాలని కోరినట్లు తెలిపారు. రైతుల సమస్యలను పరిగణనలోకి తీసుకున్న సీఎండీ వరుణ్ రెడ్డి, మంగపేట మండల రైతులకు విద్యుత్ ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక దృష్టి సారిస్తామని, వ్యవసాయ అవసరాలకు నాణ్యమైన త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. రైతుల సమస్యలపై తక్షణమే స్పందించిన మంత్రి సీతక్కకు, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డికి చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని, రైతులకు అవసరమైన విద్యుత్ సరఫరా అందేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

## జిపిలలో రోజుకు సగటున 60 మంది కూలీలకు ఉపాధి కల్పించాలి

ఉపాధి పనుల అమలులో నిర్దేశిత లక్ష్యాలను సాధించాలి

జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



**కామారెడ్డి, అక్టోబర్ 14,(తెలంగాణ పత్రిక జిల్లా ప్రతి నిధి)** జిల్లాలోని ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో 60 మంది ఉపాధి హామీ కూలీలకు పని కల్పించాలి అని కామారెడ్డి జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. హాజరుపై ప్రతిరోజూ పర్యవేక్షణ చేపట్టాలి అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సమయపాలన పాటించాలి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు 90 రోజుల వేతన ఉపాధి కల్పించాలి– రెండో విడత ఇందిరమ్మ ఇళ్లకు కొత్త అంచనాలను త్వరితగతిన రూపొందించాలి కామారెడ్డి జిల్లాలో గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు, కూలీలకు ఉపాధి కల్పన, మ మేట్ ల నియామకం, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు 90 రోజుల వేతన ఉపాధి కల్పన, రెండో విడతలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి కొత్త అంచనాల తయారీ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఉపాధి పనులను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రతి గ్రామ పంచాయతీలో రోజువారీగా సగటున 60 మంది కూలీలు పనులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని గ్రామ పంచాయతీలు, ఆవాసాల్లో ఉపాధి పనులు ప్రారంభించి, పని కోరే కుటుంబాలకు నిరంతరం ఉపాధి కల్పించాలని సూచించారు.

**అధికారులు సమయపాలన పాటించాలి**

ఉపాధి పనుల నిర్వహణలో అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సమయపాలన పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అదనపు కార్యక్రమ అధికారులు, ఇంజినీరింగ్ సలహాదారులు, సాంకేతిక సహాయకులు ప్రతిరోజూ ఉదయం 8 గంటలకల్లా విధులకు హాజరై, గ్రామాల్లో పనులు జరుగుతున్న ప్రదేశాలను సందర్శించి పర్యవేక్షించాలని ఆదేశించారు. క్షేత్ర సహాయకులు, మేటీలు ప్రతిరోజూ ఉదయం 7 గంటలకల్లా విధుల్లో చేరి, కూలీలను సమీకరించి ఉపాధి పనులకు హాజరయ్యేలా చూడాలని సూచించారు.

**ఉపాధి కల్పనలో వెనుకబడిన మండలాలపై ప్రత్యేక దృష్టి**

ఉపాధి పనుల్లో కూలీల హాజరు తక్కువగా నమోదవుతున్న మండలాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తెలిపారు. నిర్దేశిత లక్ష్యాలను సాధించడంలో వెనుకబడిన మండలాల పనితీరును సమీక్షించి, అవసరమైన చోట అధికారుల నుంచి వివరణ కోరాలని సూచించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, అదనపు కార్యక్రమ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ కూలీల సమీకరణను పర్యవేక్షించాలని, ప్రతిరోజూ కూలీల హాజరును సమీక్షిస్తూ లక్ష్యాల సాధనకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**మెట్‌ల నియామకం, పనితీరుపై నిరంతర పర్యవేక్షణ**

అన్ని గ్రామ పంచాయతీల్లో సమర్థవంతంగా పనిచేసే మెట్ లను గుర్తించి నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. మెట్ లు ప్రతిరోజూ కూలీలను సమీకరించి, పనులు సక్రమంగా జరిగేలా చూడాలని, వారి పనితీరును సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు.

**ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు 90 రోజుల వేతన ఉపాధి**

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఉపాధి హామీ పథకం ద్వారా 90 రోజుల వేతన ఉపాధి కల్పించే అంశంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ ఆదేశించారు. అర్హులైన లబ్ధిదారులను గుర్తించి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉపాధి అవకాశాలు కల్పించాలని తెలిపారు. గృహ నిర్మాణ, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**రెండో విడత ఇందిరమ్మ ఇళ్లకు కొత్త అంచనాలు సిద్ధం చేయాలి**

రెండో విడతలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఉపాధి పనులు కల్పించేందుకు అవసరమైన కొత్త అంచనాలను త్వరితగతిన రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. పనుల గుర్తింపు, అంచనాల తయారీ ప్రక్రియలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, అర్హులైన లబ్ధిదారులకు నిబంధనల ప్రకారం ఉపాధి కల్పించాలని స్పష్టం చేశారు. జిల్లాలో ఉపాధి పనుల అమలును మరింత మెరుగుపరిచి, ప్రతి గ్రామ పంచాయతీలో రోజుకు సగటున 60 మంది కూలీలకు ఉపాధి కల్పించే లక్ష్యాన్ని సాధించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సమయపాలన పాటిస్తూ కూలీల సమీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దామోదర్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ అధికారి విజయ్ పాల్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి మురళి, సీఈఓ చందర్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ముగిసిన అంగన్వాడి టీచర్ల దరఖాస్తుల పరిశీలన



**ముధోల్:14అక్టోబర్(తెలంగాణ పత్రిక):** ముధోల్ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్వాడి టీచర్ల భర్తీ కి సంబంధించిన అభ్యర్థుల దరఖాస్తుల పరిశీలన బుధవారంతో ము ముగిసినట్లు సీడీపీవో రాజశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముధోల్ ప్రాజెక్ట్ పరిధిలోని లోకేశ్వరం, బాసర, తానూర్, ముధోల్ మండలాల్లో 12 అంగన్వాడి టీచర్ల ఖాళీలకు గాను 262 దరఖాస్తులు రాగా వాటిని పరిశీలించినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ దరఖాస్తులను ఈనెల 8వ తేదీ నుండి 14 తేదీ వరకు స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వం–కు ఎలాంటి అవకతవకలు లేకుండా పరిశీలించడం జరిగిందన్నారు. 12 అంగన్వాడి టీచర్లకు 262 దరఖాస్తులు రాగా 70 మంది అభ్యర్థులు గైరాజరైనట్లు పేర్కొన్నారు. వీరికి శుక్ర శనివారాల్లో ముధోల్ ఐసిడిఎస్ కార్యాలయంలో హాజరుకావాలని కోరారు.

# సందడిగా క్రికెట్ టోర్నమెంట్







**సుధా ట్రేడర్స్ ఆధ్వర్యంలో నిర్వహణ**

**ఉత్సాహంగా పాల్గొన్న మండల క్రీడాకారులు**

**పాపన్నపేట, అక్టోబర్ 14:(తెలంగాణ పత్రిక):** మండల కేంద్రం పాపన్నపేటలోని ఉన్నత పాఠశాల మైదానంలో బుధవారం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ సందడిగా సాగింది. మండల కేంద్రంలోని సుధా ట్రెండర్స్ భారతి సిమెంట్ ఆధ్వర్యంలో ఈ టోర్నమెంట్ నిర్వహించగా మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 24 జట్లు పాల్గొన్నాయి. స్థానిక సర్పంచ్ పావని నరేందర్ గౌడ్, ఎస్సై శ్రీనివాస్ గౌడ్ హాజరై టోర్నమెంట్ ను ప్రారంభించి యువకులకు ఉత్సాహపరిచారు. యువత కేరింతలు, క్రీడాభిమానుల సందడి మధ్య క్రీడ ప్రాంగణం పండుగ వాతావరణాన్ని తలపించింది. ఆయా పార్టీల గ్రామ, మండల నాయకులు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## హంగార్గలో జిపి కార్యదర్శి నిర్బంధం



**పోతంగల్ తెలంగాణ పత్రిక అక్టోబర్ 14:** పోతంగల్ మండలంలోని హంగర్గ గ్రామ పంచాయతీకి తాళం వేసి సర్పంచ్ పాలకవర్గ సభ్యులతో పాటు గ్రామస్తులు కలసి బైఠాయించారు . ఉన్నతాధికారులు హామీ ఇచ్చేంతవరకు కదిలేది లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీ పాలకవర్గం తీర్మానాలను బేఖాతరు చేస్తూ, కొందరి నుంచి డబ్బులు తీసుకుని ఇంటి నంబర్లు కేటాయించారని, పంచాయతీ నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపిస్తూ హంగార్గ గ్రామస్తులు ఆందోళనకు దిగారు. గ్రామపంచాయతీ కార్యదర్శిని పంచాయతీ కార్యాలయంలోనే నిర్బంధించి, కార్యాలయా నికి తాళం వేసి నిరసన తెలిపారు. ఉన్నతాధికారు లు వచ్చి తమకు స్పష్టమైన హామీ ఇచ్చేంతవరకు కార్యదర్శిని వదిలేది లేదని గ్రామస్తులు తేల్చిచెప్పారు. గ్రామపంచాయతీ పాలకవర్గం తీసుకున్న నిర్ణయాలను కార్యదర్శి పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపించారు. పాలకవర్గం తీర్మానాలకు విరుద్ధంగా కొందరికి డబ్బులు తీసుకుని ఇంటి నంబర్లు కేటాయించారన్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాల్సిన కార్యదర్శి, తన ఇష్టానుసారంగా నిర్ణయాలు తీసుకోవడం ఏమిటని సర్పంచ్ పాలకవర్గ సభ్యులు ప్రశ్నించారు. పంచాయతీ నిధుల దుర్వినియోగంపై ఆరోపణలు గ్రామపంచాయతీ నిధుల వినియోగంలో అవకతవకలు జరిగాయని గ్రామస్తులు ఆరోపించారు. ఇంటి నంబర్ల కేటాయింపు, ఇంటి పన్నుల వసూళ్లు, రసీదుల జారీ వంటి అంశాల్లో పారదర్శకత లోపించిందని పేర్కొన్నారు. పంచాయతీకి సంబంధించిన నగదు లావాదేవీలు, రికార్డులను ఉన్నతాధికారులు క్షుణ్ణంగా పరిశీలించి వాస్తవాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. హామీ ఇచ్చేంతవరకు ఆందోళన విరమించేది లేదన్నారు. కార్యదర్శి వ్యవహారశైలిపై పలుమార్లు ప్రశ్నించినా సరైన సమాధానాలు లభించలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కార్యదర్శిని కార్యాలయంలో నిర్బంధించి, గ్రామపంచాయతీకి తాళం వేసి కార్యాలయం ఎదుట బైఠాయించారు. సంబంధిత ఉన్నతాధికారులు నేరుగా గ్రామానికి వచ్చి విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టమైన హామీ ఇచ్చేంతవరకు ఆందోళన విరమించబోమని హెచ్చరించారు. ఈ ఘటన గ్రామంలో చర్చనీయాంశం గా మారింది. ఇంటి పన్నుల రసీదులను మధ్యలో చింపివేయడానికి కారణమేంటని గ్రామస్తులు ప్రశ్నించారు. ఒక వ్యక్తికి నాలుగు ప్లాట్లు ఉన్నప్పటికీ ఇంటి నంబర్లు కేటాయించి రసీదులు ఇచ్చారని, ఒక్కొక్కరి వద్ద రూ. 10 వేల నుంచి రూ. 20 వేల వరకు వసూలు చేశారని ఆరోపించారు. ఈ ఆరోపణలపై అధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. సర్పంచ్ ఎన్నికలు జరిగి తొమ్మిది నెలలు గడిచినా కార్యదర్శి విధులకు సకాలంలో హాజరయ్యేవారు కాదని, అయితే బదిలీపై వెళ్తున్నారనే విషయం తెలిసిన నేపథ్యంలోనే త్వరగా విధులకు హాజరుకావడం పై గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేశారు. ఇంటి పన్నుల వసూళ్లలో పారదర్శకత పాటించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు . ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఉదయభాస్కర్ ఉప సర్పంచ్ గోపాల్ పాలకవర్గ సభ్యులు గ్రామస్తులున్నారు.

## ఇందిరమ్మ లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందజేసిన మాజీ జెడ్పిటిసి తీగల తిరుమల్ గౌడ్ సర్పంచ్ ఐరెని నరసయ్య



**కామారెడ్డి ,అక్టోబర్ 14, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)**

కామారెడ్డి జిల్లాదోమకొండ మండల కేంద్రంలో మంగళవారం ఇందిరమ్మ గృహ ప్రవేశానికి హాజరై అందే పుష్ప– అశోక్, రాజమణి– రాజనర్సుదంపతులకు నూతన వస్త్రాలను మాజీ జెడ్పిటిసి తీగల తిరుమల గౌడ్ సర్పంచ్ ఐరెని నరసయ్యలు అందజేశారు ఈ సందర్భంగా మాజీ జెడ్పిటిసి తిరుమల్ గౌడ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, సహకారంతో దోమకొండ మండలానికి 122 ఇందిరమ్మ ఇండ్లు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో దోమకొండ సింగిల్ విండో చైర్మన్ అనంతరెడ్డి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు సీతారాశీ మదు ఇందిరమ్మ కమిటీ సభ్యులు నర్సింలు, సంతోష్, చేయూత సహకార సంఘం అధ్యక్షుడు బత్తిని సిద్ధరాములు మాజీ ఎంపీటీసీ నల్లపు శ్రీనివాస్, మాజీ కోఆప్షన్ సభ్యులు షమ్మీ తదితరులు పాల్గొన్నారు.

## కల్లూరులో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేసిన సర్పంచ్ రామిరెడ్డి



**కోటగిరి తెలంగాణ పత్రిక అక్టోబర్ 14:** పోతాంగల్ మండలంలోని కల్లూరు గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నాడు స్థానిక సర్పంచ్ చెన్నూరి రామ్ రెడ్డి ఉప సర్పంచ్ దశరథ్ కలసి లబ్ధిదారులకు కార్డులను పంపిణీ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... ఈ గ్రామంలోని లబ్ధిదారులకు కొత్త కార్డులు అందడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ప్రభుత్వ రేషన్ పథకాల ప్రయోజనాలు అర్హులైన కుటుంబాలకు మరింత సులభంగా అందనున్నాయని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఉప సర్పంచ్ దశరథ్ ఓలె లింగప్ప, వెంకట్ రెడ్డి, రాంపురం రాజారెడ్డి, గ్రామ పాలన అధికారి సాయిలు గ్రామ పంచాయతీ కారోబారి సాయిలు, సాయిసూర్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో అల్పాహార పథకం అమలుకు ఏర్పాట్లు వేగవంతం చేయాలి

కేంద్రీకృత వంటశాల ఏర్పాటుకు ఏడు రోజుల్లోగా గోదాంను ఖాళీ చేయాలి

కామారెడ్డిజిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



**కామారెడ్డి ,అక్టోబర్ 14, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి):** కామారెడ్డి జిల్లాలో గలప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు అల్పాహారం అందించే పథకం అమలుకు అవసరమైన ఏర్పాట్లను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో పథకం అమలు, ఆహార తయారీ, సరఫరా, మౌలిక సదుపాయాల కల్పనపై సమీక్షించారు. ప్రభుత్వ స్థానిక సంస్థల పాఠశాలల్లో ప్రాథమిక పూర్వ విద్య నుంచి పన్నెండో తరగతి వరకు, జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అల్పాహారం అందించే కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఇందులో భాగంగా పాల్వంచ వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాంలో కేంద్రీకృత వంటశాల ఏర్పాటు చేసే అంశంపై అధికారులతో చర్చించారు. పాల్వంచ వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాంలో ప్రస్తుతం నిల్వ ఉన్న ధాన్యాన్ని ఏడు రోజుల్లోగా ఖాళీ చేయించి, కేంద్రీకృత వంటశాల ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారాన్ని సకాలంలో అందించేందుకు అవసరమైన వసతులు, ఆహార తయారీ, సరఫరా ఏర్పాట్లను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. పౌర సరఫరాలు, విద్య, మార్కెటింగ్ తదితర శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి పథకం అమలులో ఎలాంటి జాప్యం లేకుండా చూడాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా మార్కెటింగ్ అధికారి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఈ నెల 15, 16 తేదీల్లో జిల్లావ్యాప్తంగా ప్రత్యేక ఓటరు నమోదు క్యాంపులు

18 ఏళ్లు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలి: జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట । అక్టోబర్ 14 । తెలంగాణ పత్రిక । జిల్లా ప్రతినిధి భట్టు సంతోష్ తోళా నాయక్:** సూర్యాపేట జిల్లాలో అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా ఈ నెల 15, 16 తేదీల్లో జిల్లావ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు నమోదు క్యాంపులు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను చేపడుతున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వెల్లడించారు.

**కొత్త ఓటర్లకు సువర్ణావకాశం**

ఇటీవల విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితాలో పేర్లు లేని వారు, అలాగే 18 సంవత్సరాలు నిండిన యువత ఈ ప్రత్యేక క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. తొలిసారిగా ఓటరుగా నమోదు చేసుకోవాలనుకునే అర్హులైన యువతకు ఇది మంచి అవకాశమని పేర్కొన్నారు.

**ఫారం–6తో దరఖాస్తు చేసుకోవాలి**

కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలనుకునే వారు ఫారం–6 నింపి, నిర్దేశిత వయస్సు మరియు నివాస ధ్రువీకరణ పత్రాలతో పాటు అవసరమైన డిక్లరేషన్ సమర్పించాలని తెలిపారు. ఈ నెల 15, 16 తేదీల్లో ఉదయం నుంచి సంబంధిత బూత్ లెవెల్ అధికారులు (బీఎల్ఓలు), గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు అన్ని పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంటారని వెల్లడించారు.

**క్యాంపుల నిర్వహణకు అధికారులకు ఆదేశాలు**

జిల్లాలోని ఎన్నికల నోడల్ అధికారులు, ఆర్డీఓలు, తహసీల్దార్లు తమ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక క్యాంపులు సజావుగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఓటరు నమోదు కార్యక్రమంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.

**ప్రజాస్వామ్యంలో భాగస్వాములు కావాలి**

సూర్యాపేట జిల్లాలోని అర్హులైన యువత, పౌరులందరూ తమ సమీప పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమని, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును పొందడం ద్వారా ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు.

## తాను మరణిస్తూ నలుగురికి పునర్జన్మ నిచ్చిన వ్యాపారవేత్త



**కామారెడ్డి, అక్టోబర్ 14, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి):** ఓ వ్యాపారవేత్త బ్రెయిన్ డెడ్ కాగా, అవయవ దానంతో నలుగురు రోగులకు పునర్జన్మ లభించింది. కామారెడ్డిలో పట్టణంలోని రాజానగర్ నివాసి పవన్ కుమార్ జాజు (39) వృత్తిరీత్యా వ్యాపారవేత్త. కొన్ని రోజులుగా తలనొప్పితో బాధపడుతున్నాడు. పవన్ కుమార్ జాజుకు అకస్మాత్తుగా బ్రెయిన్ హెమరేజ్ కావడంతో ఈనెల 7న కామారెడ్డిలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి హైదరాబాద్ లోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో మంగళవారం తెల్లవారుజామున బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు ప్రకటించారు. ఇంతటి విషాద సమయంలోనూ పవన్ కుమార్ కుటుంబ సభ్యులు ఆయన అవయవాలను దానం చేయడానికి అంగీకరించారు. దీంతో అతడి రెండు కిడ్నీలు, లివర్, ఊపిరితిత్తులను నలుగురు రోగులకు అమర్చి వారి ప్రాణాలను కాపాడారు. ఈ సందర్భంగా జీవన్ దాన్ తెలంగాణ ఇన్చార్జి ప్రొఫెసర్ భూషణ్ రాజు మాట్లాడుతూ బాధిత కుటుంబ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వారి నిర్ణయం స్ఫూర్తిదాయకమన్నారు. అవయవ దానంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు, అవసరమైన వారికి సేవలు అందించేందుకు జీవన్ దాన్ కృషి చేస్తోందని పేర్కొన్నారు.

# శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి హాజరైన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి

## రూ. 6,80,000/- (ఆరు లక్షల ఎనభైవేలతో)ఆలయ నిర్మాణం,అభివృద్ధికి సహకారం





**కల్వకుర్తి అక్టోబర్ 14 తెలంగాణ పత్రిక:** తలకొండపల్లి మండలం గౌరిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మాణం పూర్తి చేసుకున్న శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయంలో నిర్వహించిన స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి మాజీ శాసనసభ్యులు జైపాల్ యాదవ్ గారితో కలిసి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు & TASK-C.O.O సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి విచ్చేసిన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి గారికి గ్రామస్తులు పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలికారు,ఆలయ నిర్మాణం, అభివృద్ధి కోసం రూ. 6,80,000 సహకారం అందించినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఆయన అందించిన సహకారాన్ని ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ దేవాలయాలు మన సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలకు ప్రతీకలని, భావితరాలకు మన సంప్రదాయాలను అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు, గ్రామీణ ప్రాంతాల్లో ఆలయాల అభివృద్ధికి సహకరించడం ద్వారా భక్తుల విశ్వాసాలకు అండగా నిలవడంతో పాటు సామాజిక ఐక్యతను బలోపేతం చేయవచ్చని తెలిపారు,ఈ సంకల్పంతోనే ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలకు తన వంతు సహకారం అందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కళ్యాణ్ నాయక్, ఉప సర్పంచ్ రమేష్ యాదవ్ లతో పాటు ఆలయ కమిటీ సభ్యులు,స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు,యువకులు,మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవు




**ధర్మసాగర్, అక్టోబర్ 14 (తెలంగాణ పత్రిక):** బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై హనుమకొండ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ధర్మసాగర్ గ్రామపంచాయతీ ఆవరణలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి నేరెళ్ల హైమ పూజిత మాట్లాడుతూ, 18 ఏళ్లలోపు బాలికలకు వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పిల్లలను బాల కార్మికులుగా పనుల్లో పెట్టకుండా, వారి విద్యా హక్కులను కాపాడాలని సూచించారు. బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే 1098 బాలల సహాయవాణి నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

## జి.ఎం. కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



**భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక అక్టోబర్ 14:** "బతుకమ్మ మన తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీక.. మన సంస్కృతి, సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనం." తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని జి.ఎం. కార్యాలయంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను అలంకరించి, సంప్రదాయ దుస్తుల్లో మహిళా ఉద్యోగులు ఆటపాటలతో ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జి.ఎం. సి. హెచ్. వెంకటరమణ మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక అని, ఇలాంటి పండుగలు ఉద్యోగుల మధ్య ఐక్యత, సోదరభావం, ఆత్మీయతను పెంపొందిస్తాయని అన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో ఇటువంటి వేడుకలు కీలకపాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మహిళా ఉద్యోగులు సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటలతో సందడి చేశారు. కార్యాలయ ప్రాంగణం పూల అందాలతో, పండుగ వాతావరణంతో కళకళలాడింది. ఈ కార్యక్రమంలో సేవా అధ్యక్షురాలు గీతారాణి, ఎస్.ఓ. టు జి.ఎం. ఎం. గోవిందరావు, పర్సనల్ మేనేజర్ ఎల్. తిరుపతి, డిప్యూటీ పి ఎం జి. హరీష్ మహిళా ఉద్యోగులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సుదర్శన్ గౌడ్ కుటుంబానికి 6 లక్షల చెక్ అందజేసిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్,ఎమ్మెల్యే సంజయ్

### మృతుడి కుటుంబానికి ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ



**జగిత్యాల పట్టణం (తెలంగాణ పత్రిక) అక్టోబర్ 14:** రష్యా ఉక్రెయిన్ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన జగిత్యాల జిల్లా హస్నాబాద్ గ్రామానికి చెందిన వావిలాల సుదర్శన్ గౌడ్ కుటుంబం చేసిన విజ్ఞప్తిపై సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రత్యేకంగా చొరవ తీసుకుని ముఖ్యమంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లడంతో, సీఎం వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి రూ. 6 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కును మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జగిత్యాల జిల్లా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తో కలిసి బాధిత కుటుంబానికి అందజేశారు. ఉపాధి కోసం సుమారు నాలుగు నెలల క్రితం ఉక్రెయిన్‌కు వెళ్లిన సుదర్శన్ గౌడ్ అక్కడ కొనసాగుతున్న యుద్ధంలో క్షిపణులు, డ్రోన్ దాడుల నేపథ్యంలో ప్రాణాలు కోల్పోవడం పట్ల మంత్రి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సుదర్శన్ గౌడ్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ కష్ట సమయంలో ప్రభుత్వం బాధిత కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఉపాధి నిమిత్తం సౌదీ అరేబియా వెళ్లి అనారోగ్యానికి గురై కాళ్ళు చేతులు పోగొట్టుకున్న అబ్బాడి శ్రీనివాస్ ని పరామర్శించి ప్రభుత్వ పరంగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు గజంగి నందయ్య జిల్లా మండల నాయకులు ఎన్ ఆర్ ఐ సెల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి కార్మిక గర్జనకు జయశంకర్ భూపాలపల్లి నియోజకవర్గం నుండి భారీగా తరలిన బిఆర్ఎస్ పార్టీ దండు



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి :( తెలంగాణ పత్రిక) అక్టోబర్ 14:** నల్లబంగారంగా పేరుగాంచిన సింగరేణి సంపదను కొల్లగొడుతూ, కార్మికుల సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు అధ్యక్షతన గోదావరిఖనిలో నిర్వహిస్తున్న సింగరేణి కార్మిక గర్జన కార్యక్రమానికి జయ శంకర్ భూపాలపల్లి నియోజకవర్గం నుంచి భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి టిబిజీకేఎస్ నాయకులు, బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు,యువతతో కలిసి సుమారు 500 మందితో గోదావరిఖనికి బయలుదేరారు. సింగరేణి కార్మికుల హక్కుల పరిరక్షణ, వారి సమస్యల పరిష్కారం, కార్మికులకు న్యాయం జరిగేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ కార్మిక గర్జన కార్యక్రమానికి భూపాలపల్లి నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లడం పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది.

## ఎండోమెంట్ సెల్ సమన్వయకర్తగా కరుణాకర్ నియామకం



**పాలకుర్తి, అక్టోబర్ 14(తెలంగాణ పత్రిక):** బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఎండోమెంట్ సెల్‌లో పాలకుర్తి నియోజకవర్గ మండల సమన్వయకర్తగా కేర్ల కరుణాకర్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ఎండోమెంట్ సెల్ కన్వీనర్ అన్నవైజుల సూర్యప్రకాశ్, కో-కన్వీనర్ నిరంజన్ దేశాయ్ నియామక పత్రాన్ని అందజేశారు. హిందూ ధర్మ పరిరక్షణ, దేవాలయాల అభివృద్ధి, ధార్మిక కార్యక్రమాల విస్తరణకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జనగామ జిల్లా ఎండోమెంట్ సెల్ అధ్యక్షుడు సౌడా రమేష్, పాలకుర్తి నియోజకవర్గ అధ్యక్షుడు మారం రవికుమార్, ఎండోమెంట్ సెల్ కన్వీనర్ ఎర్ల రాజు పాల్గొన్నారు.

## కుల బహిష్కరణకు దారి తీసిన స్థల వివాదం



**కామారెడ్డి, అక్టోబర్ 14, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి):** స్థల వివాదం కుల బహిష్కరణకు దారి తీసిందంటూ కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలంలో ఓ బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. రామారెడ్డి గ్రామానికి చెందిన దర్నీ పోచయ్య తన ఇంట్లో నివసిస్తున్నాడు. పక్కనే నివసించే రెండు కుటుంబాలతో స్థలం, దారి విషయంలో గొడవ నడుస్తోందని, ముగ్గురికీ ఒకే దారి ఉండగా తన రాకపోకలకు అడ్డుగా గోడ కట్టారని ఆరోపించాడు. ఇంటి వద్ద బాత్రూమ్ కట్టుకోవద్దని కూడా అడ్డుకుంటున్నారని తెలిపాడు. ఈ విషయంపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కుల పెద్దల సమక్షంలో మాట్లాడుకోవాలని సూచించారని, అయితే కుల పెద్దలు ఏకపక్షంగా వ్యవహరించి తనకు రూ. 20 వేలు జరిమానా విధించారని పోచయ్య ఆరోపించాడు. అప్పటి నుంచి తమ కుటుంబాన్ని కులంలో జరిగే పండుగలకు, శుభ, అశుభ కార్యక్రమాలకు పిలవడం లేదని, సామాజిక బహిష్కరణకు గురిచేశారని వాపోయాడు. ఈ నెల 5న తహసీల్దార్, పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినా స్పందన లేదని, తమను బహిష్కరించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నాడు.

## రాత్రి వేళలో మానవత్వాన్ని చాటిన రక్తదాత మయూర్ పటేల్

### 15 రోజులకు ఒకసారి తెల్ల రక్త కణాలను అందజేయవచ్చును

### డెంగ్యూ బాధితురాలికి సకాలంలో ఓ పాజిటివ్ తెల్ల రక్త కణాల అందజేత




**కామారెడ్డి, అక్టోబర్ 14, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతి నిధి):** కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో డెంగ్యూ వ్యాధితో బాధపడుతున్న అర్వపల్లి పూజ (21)కు ఓ పాజిటివ్ తెల్ల రక్త కణాలు అవసరం కావడంతో కామారెడ్డి పట్టణ కేంద్రానికి చెందిన వ్యాపారవేత్త రక్తదాత మయూర్ పటేల్ కు తెలియజేయగానే వెంటనే స్పందించి రాత్రివేళ అయినా సరే సకాలంలో తెల్ల రక్త కణాలను అందజేయడం జరిగిందని ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్,రెడ్ క్రాస్ జిల్లా సమన్వయ సభ్యులు డాక్టర్ బాలు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధితో బాధపడే బాధితులకు సకాలంలో తెల్ల రక్త కణాలను అందజేయాలని, రక్తదాతలు ముందుకు వస్తేనే సకాలంలో అందజేసే అవకాశం ఉంటుందని అన్నారు 100 మంది రక్త దాతలలో 10 నుండి 20 శాతం మందికి మాత్రమే తెల్ల రక్త కణాలను అందజేసే అవకాశం ఉంటుందని దీనికి సుమారు ఒక గంట సమయం పడుతుందని తెలియజేశారు. ఆరోగ్యవంతమైన వ్యక్తులు ప్రతి 15 రోజులకు ఒకసారి తెల్ల రక్త కణాలను ఆపదలో ఉన్నవారికి అందజేయవచ్చునని దీని వలన ఎలాంటి అనారోగ్య సమస్యలు రావని ఈ విషయాన్ని అవగాహన చేసుకుని తెల్ల రక్త కణాలను అందజేయడానికి రక్తదాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రాత్రి వేళలో మానవత్వాన్ని చాటి ఆదర్శంగా నిలిచిన రక్తదాత మయూర్ పటేల్ కు అభినందనలను తెలిపారు.

## మెదక్ జిల్లా కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు స్థల పరిశీలన



**మెదక్ జిల్లాప్రతినిది (తెలంగాణ పత్రిక) 14 అక్టోబర్:** మెదక్ జిల్లాలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేసేందుకు అవసరమైన భవనాలు, స్థలాలను గుర్తించే ప్రక్రియలో భాగంగా అదనపు కలెక్టర్ నగేష్ జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. రాజు విద్యాశాఖ కోఆర్డినేటర్ రాజు బుధవారం మెదక్ పట్టణంలోని పలు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ..మెదక్ పట్టణంలోని ధ్యాన్‌చంద్ సర్కిల్ సమీపంలో ఉన్న ప్రభుత్వ ఆర్ట్స్ డిగ్రీ కళాశాలను అధికారులు సందర్శించి, కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు సంబంధించి అందుబాటులో ఉన్న భవనాలు, స్థలాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు, జిల్లాలో విద్యా అవకాశాలను మరింత విస్తరించేందుకు కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు కీలకంగా నిలుస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. మెదక్ జిల్లాకు కేంద్రీయ విద్యాలయం మంజూరు చేసే నేపథ్యంలో, పాఠశాల ఏర్పాటుకు అనువైన ప్రదేశాలను గుర్తించడం, అందుబాటులో ఉన్న మౌలిక వసతుల పై దృష్టి సారించారు. గుర్తించిన అంశాలు, స్థలాలకు సంబంధించిన వివరాలతో కూడిన నివేదికను జిల్లా కలెక్టర్ కు సమర్పిస్తామన్నారు. కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు అవసరమైన స్థల గుర్తింపు, సంబంధిత వివరాల సేకరణలో భాగంగా ఈ పరిశీలన చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

## అక్టోబర్ 15, 16 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమము

### జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు నమోదు క్యాంపులు

### జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్ జిల్లాప్రతినిది (తెలంగాణ పత్రిక) 14 అక్టోబర్**



భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడంతో పాటు ఓటరు జాబితాలో ఎలాంటి అనర్హులైన ఓటర్లు మిగిలిపోకుండా ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా అక్టోబర్ 15, 16 తేదీల్లో జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు నమోదు క్యాంపులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు లేని అర్హులైన పౌరులు, గతంలో ఓటరు జాబితాలో పేరు నమోదు కాని వారు, తొలిసారిగా ఓటు హక్కు పొందనున్న యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. 18 సంవత్సరాలు నిండిన అర్హులైన యువతతో పాటు ఓటరు జాబితాలో పేరు లేని వారు సంబంధిత పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఫారం-6 ద్వారా తమ పేర్ల నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రత్యేక క్యాంపుల నిర్వహణ సమయంలో సంబంధిత బూత్ స్థాయి అధికారులు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఓటరు నమోదు ప్రక్రియకు సంబంధించి అవసరమైన మార్గదర్శకాలు, సహాయాన్ని వారు అందిస్తారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హత కలిగిన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు కావడం బాధ్యతగా భావించాలని స్పష్టంచేశారు. కాబట్టి జిల్లాలోని అర్హులైన పౌరులందరూ అక్టోబర్ 15, 16 తేదీల్లో నిర్వహించే ప్రత్యేక క్యాంపులను వినియోగించుకొని ఓటరు జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ప్రతిమా సింగ్ విజ్ఞప్తి చేశారు.

## బకాయిలు చెల్లించాలని అసెంబ్లీ ముట్టడికి యత్నం

### విశ్రాంత ఉద్యోగులను అడ్డుకుని, అరెస్టు చేసిన పోలీసులు

**హైదరాబాద్ :** పెన్షన్ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ తెలంగాణ ఆధ్వర్యంలో విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులు సచివాలయం ముట్టడికి యత్నించారు. పోలీసులు అడ్డుకోవడంతో కాసేపు ఉద్రిక్తత నెలకొంది. ఈ సందర్భంగా సంఘం నేతలను పోలీసులు ఎత్తుకెళ్లి వ్యానులో ఎక్కించి సమీప ఠాణాలకు తరలించారు. అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోహెడ చంద్రమౌళి, కొంపెల్లి భిక్షపతి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 2026 మార్చి 21 వరకు సుమారు 25,943 మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ పొందారని, ఇంతవరకు వారికి రావల్సిన బకాయిలు చెల్లించకపోవటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బకాయిలను వడ్డీతో సహా ఏకమొత్తంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కష్టపడి ప్లాట్ కొనుక్కుంటే దర్జాగా కబ్జా చేశారు

జిల్లా ఎస్పీకి మహిళ ఫిర్యాదు



**కామారెడ్డి , అక్టోబర్ 14, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి):** నలభై ఏళ్ల కిందట కొనుగోలు చేసిన ప్లాట్ కబ్జా కావడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. ఈ క్రమంలో బుధవారం ఎస్పీ రాజేష్ చంద్రను కలిసి న్యాయం చేయాలని కోరారు. బాధితురాలు ఆశాభాను 40 ఏళ్ల క్రితం ముప్పారపు వెంకయ్య వద్ద విద్యానగర్లో 200 చదరపు గజాలు తీసుకున్నారు. అయితే ఈ స్థలాన్ని 2008లో రవికిరణ్, ప్రవీణ్ కుమార్ కబ్జా చేసి బోర్డు పాతారని తెలిసి అక్కడికి వెళ్లగా నిజంగానే ప్లాట్ కబ్జా చేశారని బాధితులు తెలిపారు. దీనిపై అప్పట్లో కోర్టుకు వెళ్లగా తమకు 2018లో అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు. కోర్టు తీర్పు ప్రకారం మున్సిపాలిటీలో ఎల్ఆర్ఎస్ కట్టి ఇంటి పర్మిషన్ తీసుకున్నామన్నారు. అయితే మూడు రోజుల క్రితం తమ స్థలంలో రవికిరణ్, ప్రవీణ్ కుమార్ అనే వ్యక్తులు ఫెన్సింగ్ చేస్తున్నారని తెలిసి వెళ్లగా అక్కడ వాళ్ల స్థలం అని బోర్డు పాతి ఉందన్నారు. ఆ బోర్డు తాము తొలగిస్తే తమపై పోలీసులకు ఫిర్యాదు చేశారని, పోలీసులకు జరిగిన విషయం మొత్తం చెప్పి సంబంధిత డాక్యుమెంట్స్ అన్ని చూపించినప్పటికి మూడు రోజులుగా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. దాంతో ఇవాళ ఎస్పీకి కలిసి ఫిర్యాదు చేశామన్నారు. విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరారు.

# పాపన్నపేట మండలంలో ఎస్సీ నిరుద్యోగ యువతకు షాపింగ్ కాంప్లెక్స్ దుకాణాల కేటాయింపు

అర్హులైన ఎస్సీ అభ్యర్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

జిల్లా షెడ్యూల్డు కులాల సేవా సహకార అభివృద్ధి అధికారి విజయ లక్ష్మి



**మెదక్ జిల్లాప్రతినిధి (తెలంగాణ పత్రిక) అక్టోబర్ 14:** మెదక్ జిల్లాలోని పాపన్నపేట మండల పరిధిలో నివసిస్తున్న షెడ్యూల్డు కులాల (ఎస్సీ) నిరుద్యోగ యువతీ యువకులు స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికంగా అభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో, జిల్లా షెడ్యూల్డు కులాల సేవా సహకార అభివృద్ధి సంఘం లిమిటెడ్ (ఎస్సీ కార్పొరేషన్), మెదక్ ఆధ్వర్యంలో ఖాళీగా ఉన్న దుకాణాలను అర్హులైన అభ్యర్థులకు కేటాయించే ందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డు కులాల సేవా సహకార అభివృద్ధి అధికారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాపన్నపేట మండలంలోని మార్కెట్ వద్ద ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లో నాలుగు దుకాణాలు, కొత్తపల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ ఎదురుగా నాలుగు దుకాణాలు కలిపి మొత్తం ఎనిమిది దుకాణాలు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆయా దుకాణాల్లో వివిధ రకాల స్వయం ఉపాధి, వ్యాపార కార్యకలాపాలు నిర్వహించుకోవడానికి ఆసక్తి, అర్హత కలిగిన షెడ్యూల్డు కులాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

**దరఖాస్తుదారులకు ఉండవలసిన అర్హతలు**

1. అభ్యర్థి తప్పనిసరిగా షెడ్యూల్డు కులానికి (ఎస్సీ) చెందినవారై ఉండాలి.
2. పాపన్నపేట మండలంలో శాశ్వత నివాసిగా ఉండాలి.
3. అభ్యర్థి వయస్సు 21 నుంచి 50 సంవత్సరాల మధ్య ఉండాలి.
4. కనీస విద్యార్హత పదో తరగతి ఉత్తీర్ణత అయి ఉండాలి.
5. ఎంపిక చేసుకున్న వ్యాపార రంగంలో తగిన నైపుణ్యం లేదా అనుభవం కలిగి ఉండాలి.
6. కుటుంబ వార్షిక ఆదాయం రూ. 1,50,000 (ఒక లక్షా యాభై వేల రూపాయలు) మించకూడదు.

**దరఖాస్తుకు జతపరచవలసిన ధ్రువీకరణ పత్రాలు**

1. పదో తరగతి మార్కుల మెమోతో పాటు విద్యార్హతలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు.
2. మీ సేవ ద్వారా పొందిన కుల, నివాస, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు.
3. ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులు.
4. రేషన్ కార్డు జిరాక్స్ ప్రతి.
5. రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు.
6. సంబంధిత వ్యాపార రంగంలో నైపుణ్యాన్ని ధ్రువీకరించే పత్రం.

**దరఖాస్తు సమర్పించే విధానం**

అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు రూ. 1,000 దరఖాస్తు రుసుమును "ఇఅర్. ాజూజఇూ ాా., వీవఝుఎ" పేరుతో డిమాండ్ డ్రాఫ్ట్ (ఇఇ) రూపంలో చెల్లించి దరఖాస్తు ఫారాన్ని పొందవచ్చని తెలిపారు. దరఖాస్తు ఫారంలో పూర్తి వివరాలు నమోదు చేసి, అవసరమైన ధ్రువీకరణ పత్రాలను జతపరచి, కలెక్టరేట్ సముదాయంలోని కార్యనిర్వాహక సంచాలకులు, ఎస్సీ కార్పొరేషన్, మెదక్ కార్యాలయంలో సమర్పించాలి. దరఖాస్తుల స్వీకరణకు సంబంధించిన చివరి తేదీ 04-11-2026, నిర్ణీత గడువులోగా దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. ఎస్సీ నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించాలని జిల్లా షెడ్యూల్డు కులాల సేవా సహకార అభివృద్ధి అధికారి విజయ లక్ష్మి కోరారు.

# ఘనంగా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి బత్తిని ఎల్ల గౌడ్ జన్మదిన వేడుకలు



**ధర్మసాగర్, అక్టోబర్ 14 (తెలంగాణ పత్రిక):** హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం నారాయణగిరి గ్రామంలో హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి బత్తిని ఎల్ల గౌడ్ జన్మదిన వేడుకలను మంగళవారం ఆయన స్వగృహంలో స్నేహితులు, కుటుంబ సభ్యుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్నేహితులు, బంధువులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మంచితనానికి మారుపేరుగా, అందరితో ఆప్యాయంగా కలిసిమెలిసి ఉండే ఎల్ల గౌడ్ ప్రజల మన్ననలు పొందుతున్నారని పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా సేవాభావంతో ప్రజలకు అండగా నిలుస్తూ, సమాజ శ్రేయస్సు కోసం మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవిస్తూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని శ్రేయోభిలాషులు కోరుకున్నారు.

# మూడు రోజుల కస్టడీకి లక్ష్మీ భాస్కర్

**హైదరాబాద్ :** ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో నిమ్స్ అదనపు మెడికల్ సూపరింటెండెంట్(సస్పెండెడ్) లక్ష్మీ భాస్కర్‌ను ఏసీబీ అధికారులు బుధవారం మూడు రోజుల కస్టడీకి తీసుకున్నారు. సెప్టెంబరు 22న లక్ష్మీ భాస్కర్‌ను ఏసీబీ అధికారులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం చంచల్‌గూడ జైలులో ఉన్న నిందితుడిని కస్టడీకి తీసుకున్నారు. బినామీ పేర్లపై భారీగా అక్రమాస్తుల్ని గుర్తించిన అధికారులు.. వాటిపై ఆరా తీయనున్నారు.

# 22 కోట్ల 50 పడకల ఆసుపత్రికి స్థల గండం!

● ఏడాదిన్నరగా ముందుకు సాగని నిర్మాణం ● దేవునికుంట స్థలంపై అధికారుల నిర్ణయం కోసం ఎదురుచూపులు
● రూ.22 కోట్ల నిధులు వెనక్కి వెళ్లే ప్రమాదం!

**కామారెడ్డి, అక్టోబర్ 14 ,(తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)**

కామారెడ్డి జిల్లాదోమకొండ మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో మంజూరైన 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం స్థల సమస్యతో ముందుకు సాగడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ. 22 కోట్ల నిధులు మంజూరు చేసి ఏడాదిన్నర గడుస్తున్నా నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడంతో ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఆసుపత్రి నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ఎంపిక చేసి అధికారులకు నివేదిక అందించడంలో జాప్యం జరుగుతుండటంతో ప్రాజెక్టు భవిష్యత్తుపై సందిగ్ధత నెలకొంది. నిర్ణీత గడువులోగా పనులు ప్రారంభం కాకపోతే మంజూరైన నిధులపై ప్రభావం పడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

**నాలుగు ఎకరాలు కావాలి..**
**అందుబాటులో ఉన్నది 1.20 ఎకరాలే!**

50 పడకల ఆసుపత్రి నిర్మాణానికి సుమారు నాలుగు ఎకరాల స్థలం అవసరమని సంబంధిత అధికారులు పేర్కొంటున్నట్లు సమాచారం. అయితే దోమకొండ గ్రామపంచాయతీ పాలకవర్గం స్థానిక దేవునికుంట ప్రాంతంలో సుమారు 1.20 ఎకరాల స్థలాన్ని ప్రతిపాదిస్తూ తీర్మానం చేసి తహసీల్దార్‌కు నివేదిక పంపినట్లు తెలిసింది. అవసరమైన స్థలంతో పోలిస్తే ప్రతిపాదించిన భూమి విస్తీర్ణం తక్కువగా ఉండటంతో నిర్మాణానికి అనుకూలతపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి ఆసుపత్రి భవన నిర్మాణంతో పాటు రోగులకు అవసరమైన వైద్య సదుపాయాలు, వాహనాల పార్కింగ్, ఇతర మౌలిక వసతులు కల్పించాలంటే సరిపడా స్థలం అవసరం. ఈ నేపథ్యంలో దేవునికుంటలో ప్రతిపాదించిన స్థలం ఆసుపత్రి నిర్మాణానికి సరిపోతుందా? సాంకేతికంగా అనుకూలంగా ఉందా? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

**కుంట స్థలంలో నిర్మాణం సాధ్యమేనా?**

గతంలో దేవునికుంట ప్రాంతంలో నీరు నిల్వ ఉండటం, అక్కడి నేల మెత్తగా ఉండటంతో ఆసుపత్రి నిర్మాణానికి ఆ స్థలం అనుకూలంగా ఉండకపోవచ్చని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. అక్కడ భవనం నిర్మిస్తే పునాదుల పటిష్టత, భవిష్యత్తులో భవన భద్రతపై ఎలాంటి ప్రభావం ఉంటుందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మరోవైపు, ఆసుపత్రి నిర్మాణానికి అవసరమైన స్థలం అందుబాటులో లేకపోవడంతో ప్రత్యామ్నాయ భూమిని గుర్తించాల్సిన అవసరం ఉందని స్థానికులు సూచిస్తున్నారు. దేవునికుంట స్థలంలోనే నిర్మాణం చేపట్టాలంటే ముందుగా భూమి స్వభావం, విస్తీర్ణం, యాజమాన్య వివరాలు, నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక అంశాలను సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలి. నిపుణుల నివేదిక ఆధారంగా తుది నిర్ణయం తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**స్థలం కోసం కాంట్రాక్టర్ ఎదురుచూపులు!**

ఆసుపత్రి నిర్మాణానికి సంబంధించిన ప్రక్రియ ముందుకు సాగుతున్నప్పటికీ, స్థల ఎంపికలో జాప్యం కారణంగా పనులు ప్రారంభం కావడం లేదని తెలుస్తోంది. నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ఖరారు చేసి అప్పగిస్తే పనులు ప్రారంభించే అవకాశం ఉంటుంది. కానీ ఏడాదిన్నరగా స్థల సమస్య పరిష్కారం కాకపోవడంతో ప్రాజెక్టు అమలులో జాప్యం కొనసాగుతోంది. రూ. 22 కోట్లతో నిర్మించాల్సిన ఆసుపత్రికి నిధులు మంజూరైనప్పటికీ, స్థల సమస్య కారణంగా నిర్మాణం ప్రారంభం కాకపోవడం ప్రజలకు నిరాశ కలిగిస్తోంది. నిర్ణీత గడువులోగా నిర్మాణ పనులు ప్రారంభం కాకపోతే నిధుల వినియోగంపై ప్రభావం పడుతుందా? నిధులు వెనక్కి వెళ్లే పరిస్థితి ఉందా? అనే విషయాలపై ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

**చిన్న రోగాలకూ కామారెడ్డికే వెళ్లాల్సిన పరిస్థితి!**

ప్రస్తుతం దోమకొండలోని 30 పడకల ఆసుపత్రి ద్వారా ప్రజలకు వైద్య సేవలు అందుతున్నాయి. అయితే కొన్ని సందర్భాల్లో మెరుగైన వైద్యం అవసరమైన రోగులను కామారెడ్డి ఆసుపత్రికి పంపిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. అత్యవసర వైద్యం అవసరమైనప్పుడు దూరప్రాంతాలకు వెళ్లాల్సి రావడంతో పేద కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమకొండలో 50 పడకల ఆసుపత్రి అందుబాటులోకి వస్తే మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందే అవకాశం ఉంటుంది. ప్రయాణ ఖర్చులు తగ్గడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో సకాలంలో చికిత్స పొందేందుకు వీలవుతుంది. ముఖ్యంగా పేదలు, గర్భిణులు, వృద్ధులు, చిన్నపిల్లలకు ఈ ఆసుపత్రి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ప్రజలు పేర్కొంటున్నారు.

**ప్రత్యామ్నాయ స్థలాన్ని గుర్తించాలి**

దేవునికుంటలో ప్రతిపాదించిన స్థలం ఆసుపత్రి నిర్మాణానికి సరిపోకపోతే అధికారులు ప్రత్యామ్నాయ ప్రభుత్వ భూమిని గుర్తించాలని స్థానికులు కోరుతున్నారు. ఒకే చోట అవసరమైన విస్తీర్ణంలో భూమిని ఎంపిక చేసి, అన్ని శాఖల అనుమతులు పొందిన అనంతరం నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని సూచిస్తున్నారు. జిల్లా కలెక్టర్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, రెవెన్యూ శాఖ అధికారులు సమన్వయంతో వ్యవహరించి స్థల సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. అవసరమైన స్థలాన్ని ఎంపిక చేసి ప్రభుత్వానికి నివేదిక అందిస్తే నిర్మాణ పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రజారోగ్యానికి ఎంతో కీలకమైన 50 పడకల ఆసుపత్రి నిర్మాణం మరోసారి జాప్యానికి గురికాకుండా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉంది. మంజూరైన నిధులు వృథా కాకుండా, ఆసుపత్రి దోమకొండలోనే నిర్మితమయ్యేలా చర్యలు చేపట్టి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని స్థానికులు కోరుతున్నారు.

**రెవిన్యూ వాళ్లను నివేదిక అడిగాను ఇరిగేషన్ తరపున ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వలేదు**

**ఇరిగేషన్ డిఈ వివరణ**

దోమకొండ 50 పడగల ఆసుపత్రి విషయంలో స్థలం నిర్ణయం కోసం ఎమ్మార్వో నివేదిక అడిగాము ఎమ్మార్వో నివేదిక ఇచ్చాక ఇరిగేషన్ ఇరిగేషన్ చేసి కలెక్టర్కు నివేదికలు పంపుతాం ఆస్పత్రి నిర్మాణానికి ఎలాంటి డినోటిఫికేషన్ దేవునికుంట స్థలంలో ఇవ్వలేదు ఇట్ ఇస్ అండర్ ప్రాసెస్ ఇరిగేషన్ తరపున ఎలాంటి డి నోటిఫికేషన్ ఆసుపత్రి నిర్మాణం కోసం నోటిఫికేషన్ ఇవ్వలేదు ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు అనుమతి ఉంటుందా లేదా తెలియదు పూర్తిస్థాయి నివేదికలు ఇంకా రాలేదు సిద్ధమవుతున్నాయి నివేదికలు జిల్లా కలెక్టర్ కి శాఖ తరపున పంపిస్తాం అన్నారు.

# బాలికపై లైంగిక దాడి.. నిందితుడికి ఏడేళ్ల జైలు శిక్ష

రూ.20 వేల జరిమానా విధించిన ఫాస్ట్‌ట్రాక్ పోక్సో కోర్టు

నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీస్ అధికారులను అభినందించిన

మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్



**మెదక్ జిల్లా ప్రతినిధి (తెలంగాణ పత్రిక) 14 అక్టోబర్:** బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి ఏడేళ్ల జైలు శిక్షతో పాటు రూ. 20 వేల జరిమానా విధిస్తూ ఫాస్ట్‌ట్రాక్ పోక్సో కోర్టు తీర్పునిచ్చినట్లు మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ తెలిపారు. కేసు వివరాలు వెల్లడిస్తూ..... ఇక్కిరి శ్రీశైలం (25) ఆటో నడుపుతూ, ప్లంబర్‌గా జీవనం సాగించేవాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మెల్లూరు నుంచి తూప్రాన్‌కు ఆటో నడుపుతున్న సమయంలో కళాశాలకు వెళ్లేందుకు వేచి ఉన్న 17 ఏళ్ల బాలికను ఆటోలో ఎక్కించుకోవడంతో ఆమెతో పరిచయం ఏర్పడింది. అనంతరం ఇద్దరూ ఫోన్ నంబర్లు మార్చుకున్నారు. కొంతకాలం తర్వాత బాలికను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని చెప్పగా ఆమె నిరాకరించింది. అయినప్పటికీ, బాలికను బలవంతంగా తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడాలని నిందితుడు పథకం వేశాడు. 16.04.2021న బాలిక కుటుంబ సభ్యులు పొలం పనులకు వెళ్లిన సమయంలో ఆమె ఇంటి వద్దకు వెళ్లి బైక్ ఎక్కాలని బలవంతం చేశాడు. బాలిక నిరాకరించడంతో కత్తితో బెదిరించి, బాసర, ఆదిలాబాద్ తదితర ప్రాంతాలకు తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం బాలిక తండ్రికి ఫోన్ చేసి తూప్రాన్‌లో ఉన్నట్లు సమాచారం ఇచ్చాడు. దీంతో తండ్రి బాలికను ఇంటికి తీసుకెళ్లాడు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు 27.04.2021న ఎల్దుర్తి ఎస్ఐ మహేందర్ కేసు నమోదు చేశారు. అప్పటి తూప్రాన్ డీఎస్పీ కిరణ్ కుమార్ దర్యాప్తు నిర్వహించి అవసరమైన సాక్ష్యాధారాలను సేకరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్య కోర్టులో బలమైన వాదనలు వినిపించారు. దీంతో ఫాస్ట్‌ట్రాక్ పోక్సో కోర్టు న్యాయమూర్తి ఆర్.ఎం. సుభవాలి నిందితుడికి ఏడేళ్ల జైలు శిక్షతో పాటు రూ. 20 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ఈ కేసులో ఎస్ఐ కరుణాకర్ రెడ్డి, కోర్టు లైజనింగ్ అధికారులు ఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ కృష్ణగౌడ్, సీడీఓ ప్రవీణ్ సహకరించారు. నిందితుడికి శిక్ష పడేలా సమన్వయంతో పనిచేసిన అధికారులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# అక్టోబర్ 15, 16 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు

అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్




**కామారెడ్డి, అక్టోబర్ 14 ,(తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి):** కామారెడ్డి జిల్లాలో అక్టోబర్ 15, 16 తేదీల్లో అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. బుధవారం ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం-2026 అమలుపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి నోటీసుల జారీ, విచారణల పురోగతిని సమీక్షించి, రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ముసాయిదా ఓటర్ల జాబితాలో పేరు లేని అర్హులైన పౌరులు ఈ ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకుని ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. కొత్తగా ఓటు హక్కు పొందేందుకు అర్హత సాధించిన వారు నిర్ణీత నమూనా-6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఓటర్ల జాబితాలో పేర్ల నమోదు, సవరణలకు సంబంధించి అందిన అభ్యర్థనలు, అభ్యంతరాలను నిబంధనల ప్రకారం పరిశీలించి, అర్హులైన ప్రతి ఓటరుకు జాబితాలో చోటు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియలో అర్హులైన పౌరులందరికీ ఓటు హక్కు కల్పించేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. విక్టర్, ఎన్నికల అధికారి రాజేశ్వర్, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# బతుకమ్మ సంబరాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించాలి

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలి

జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



**కామారెడ్డి, అక్టోబర్ 14, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి):** కామారెడ్డి జిల్లాలో జిల్లా యువజన, క్రీడల శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొబ్బరికాయ కొట్టి బతుకమ్మ సంబరాలను ప్రారంభించిన అనంతరం, మహిళలతో కలిసి బతుకమ్మ ఆటలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకంగా నిలుస్తుందని తెలిపారు. ప్రకృతిని ఆరాధిస్తూ, వివిధ రకాల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి జరుపుకునే ఈ పండుగ మహిళల ఐక్యతకు, తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల విశిష్టతను భావితరాలకు అందించేలా బతుకమ్మ వేడుకలను ఆనందోత్సాహాలతో, సంప్రదాయబద్ధంగా నిర్వహించాలని సూచించారు. ఇటువంటి వేడుకలు ప్రజల్లో ఐక్యతను, సాంస్కృతిక చైతన్యాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, శిక్షణలో కలెక్టర్ రవితేజ, జిల్లా పంచాయతీ అధికారి మురళి, జిల్లా మద్య నిషేధ శాఖ అధికారి ముకుంద రెడ్డి, శ్రీధర్ రెడ్డి, దేవేందర్, జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి రంగ వెంకటేశ్వర గౌడ్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి దామోదర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రానైట్ సీనరేజి ఇకపై టన్నుకు లెక్కింపు

**హైదరాబాద్ :** నల్ల గ్రానైట్, రంగు గ్రానైట్‌లపై సీనరేజి ఫీజులను పూర్తిగా టన్నుకు లెక్కకట్టి వసూలు చేయాలని రాష్ట్ర గనులు, భూగర్భ వనరుల శాఖ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు బుధవారం ప్రభుత్వ కార్యదర్శి రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. నల్ల గ్రానైట్‌ను విదేశాలకు ఎగుమతి చేసుకోవాలంటే టన్నుకు రూ. 1,633, దేశీయంగా అయితే రూ. 1,252 సీనరేజి ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది. రంగు గ్రానైట్ విదేశాలకు అయితే టన్నుకు రూ. 1,354, దేశీయంగా అయితే రూ. 1,176 చెల్లించాలి. ఇప్పటివరకు ఈ రెండు గ్రానైట్లను టన్ను, క్యూబిక్ మీటర్ల చొప్పున లెక్కకట్టి సీనరేజి ఫీజును వసూలు చేసేవారు. ఇక నుంచి క్యూబిక్ మీటర్ పద్ధతికి స్వస్తి పలికి, టన్నుకు మాత్రమే లెక్క కట్టనున్నారు. ఈ కొత్త ఉత్తర్వులు ఈ ఏడాది నవంబరు 1 నుంచి అమలులోకి రానున్నాయి. ఇందుకు కావాల్సిన సాఫ్ట్‌వేర్‌ను అప్పటిలోగా అభివృద్ధి చేయనున్నారు.

# 'రంగనాయకసాగర్'పై మాజీ ఈఎన్సీ, ఎస్ఈలకు 'విజిలెన్స్' పిలుపు

**హైదరాబాద్:** కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన రంగనాయకసాగర్‌పై దర్యాప్తు చేపట్టిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్.. పదవీ విరమణ చేసిన ఇద్దరు సీనియర్ ఇంజినీర్లను విచారణకు పిలిచింది. రంగనాయకసాగర్‌పై వచ్చిన ఫిర్యాదుపై గత ఆరు నెలలుగా విచారణ జరుగుతోంది. ఇందులోభాగంగా ఇంజినీర్ ఇన్ చీఫ్ (ఈఎన్సీ)గా, సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా పనిచేసి పదవీ విరమణ చేసిన హరిరాం, ఆనంద్‌లను ఈ నెల 15న విచారణకు పిలిచారు. ఈ మేరకు 'విజిలెన్స్' ఎస్పీ.. ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్‌కు లేఖ రాశారు.

# డిజిటల్ సంతకం వైద్యుల నైతిక బాధ్యతను తగ్గించదు

**హైదరాబాద్ :** వైద్యులు డిజిటల్, ఎలక్ట్రానిక్ విధానంలో చేసే సంతకాలపై జాతీయ వైద్య కమిషన్ బుధవారం ఆదేశాలు జారీ చేసింది. ల్యాబ్ నివేదికలు, రేడియాలజీ నివేదికలు, డిశ్చార్జి సమ్మరీలను రిమోట్ పద్ధతి (మరోచోట ఉండి డిజిటల్ సంతకం చేయడం) ద్వారా ఇచ్చే సందర్భాల్లో డిజిటల్ సంతకాలు ఉపయోగించడంలో ఎలాంటి నిషేధం లేదని ఎన్ఎంసీ స్పష్టం చేసింది. డిజిటల్ సంతకం అనేది ధ్రువీకరణ మార్గం మాత్రమేనని, ఇది ఆర్ఎంపీల నైతిక, చట్టపరమైన బాధ్యతలను ఏ మాత్రం తగ్గించదని స్పష్టం చేసింది.

# సింగరేణి ప్రధాన కార్యాలయము నందు వైభవముగా బతుకమ్మ సంబురాలు







**భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక అక్టోబర్ 14:** సింగరేణి కాలరీస్ కార్పొరేట్ ఏరియా ఆధ్వర్యం లో బతుకమ్మ పండుగను పురస్కరించుకొని బుధవారము నాడు సింగరేణి ప్రధాన కార్యాలయం నందు కార్పొరేట్ ఏరియా పరిధి లోని అన్ని డిపార్ట్మెంట్ లలో పని చేసే మహిళా ఉద్యోగులు బతుకమ్మ సంబురాలలో బతుకమ్మ ఆటాపాటలో పాల్గొన్నారు. జిఎం(పర్సనల్) వెల్ఫేర్, సిఎస్ఆర్ & సెక్యూరిటీ కే.అజయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిలుగా మాలతి సూర్యనారాయణ, కే.విజయ లక్ష్మి వెంకటేశ్వర్లు, ఎం.పద్మ తిరుమల రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా ఉద్యోగులందరికి బతుకమ్మ పండుగ చేసుకునే సింగరేణి వ్యాప్తముగా గల మహిళా ఉద్యోగినులకు ఉద్యోగుల కుటుంబ సభ్యులకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలుపుతూ ఇంత మంది మహిళలు ఒక్క చోట ఈ బతుకమ్మ పండుగ లో పాల్గొనటం చాలా సంతోషం అని, తెలంగాణ ఆడపడుచులు అపురూపంగా జరుపుకునే గొప్ప వేడుక బతుకమ్మ అని, మన సంస్కృతికి ఇది దర్పణంగా నిలుస్తుందని, ప్రకృతి తో మమేకం అయ్యే పండుగ బతుకమ్మ పండుగ అని, తొమ్మిది రోజుల పాటు సాగే ఈ వేడుకల్లో ఐదో రోజు అయిన బుధవారం అట్లబతుకమ్మ ను నిర్వహించుకుంటున్నామని తెలిపారు. అనంతరం మహిళా ఉద్యోగులు అందరూ బతుకమ్మ ఆటాపాటలో పాల్గొన్నారు. తదుపరి ఈ బతుకమ్మ సంబురాలలో పాల్గొన్న మహిళలు తెచ్చిన బతుకమ్మలలో న్యాయ నిర్ణేతలు ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి ప్రథమ, ద్వితీయ, తృతీయ పాల్గొన్న అందరికీ ముఖ్య అతిధుల చేతుల మీదుగా ప్రోత్యాహక బహుమతులు ప్రదానం చేశారు. జిఎం(పర్సనల్) వెల్ఫేర్, సిఎస్ఆర్ & సెక్యూరిటీ కే.అజయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమములో మాలతి సూర్యనారాయణ, కే.విజయ లక్ష్మి వెంకటేశ్వర్లు, ఎం.పద్మ తిరుమల రావు, ఏఐటి యూసి బ్రాంచ్ సెక్రటరీ ఎస్.వి.రమణ మూర్తి, ఐఎన్టియూసి కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.పితాంబర రావు, సిఎంఓఏఐ జాయింట్ సెక్రెటరీ కే.కమలాకర రావు, జిఎం(పర్సనల్) ఐఆర్ & పిఎం జి.వి.కిరణ్ కుమార్, జిఎం(పర్సనల్) ఈఈ& ఆర్సి ఏజేపీఎం మురళీధర రావు, జి.నాగ బిందు కిరణ్ కుమార్, బి.జయా మురళీధర రావు, డిజిఎం(పర్సనల్) బి.శివ కేశవ రావు, సేవా కో-ఆర్డినేటర్ బి.పుష్పలత, అధికారులు, ఉద్యోగులు, సెక్యూరిటీ సిబ్బంది, కాంట్రాక్టు ఉద్యోగులు పాల్గొన్నారు.

## శ్రీ లలితాత్రిపురసుందరి దేవి అలంకారం

లెక్చరర్ ఉమాశేషారావు వైద్య



**కామారెడ్డి, అక్టోబర్ 14,(తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి):** త్రిపురు సుందరి లేదా మహా త్రిపుర సుందరి షోడసి ,లలిత మరియు రాజరాజేశ్వరి రూపా లలో ఒక మహా విధ్యలలో ఒక స్వరూపం. సాక్ష్యాత్ ఆదిపరా శక్తి. ముల్లోకాలకి సుందరి కా వున త్రిపుర సుందరిఅంటారు. పదహారేళ్ళ వయస్సు కల పద హా రు వివిధ కోరికలు కలది కావున షోడసి అనిపిలుస్తారు. త్రిపుర అనగా ముల్లోకములు. సుందరి అనగా అందమైనది. కావున త్రిపుర సుందరి అంటే ముల్లోకములని పాలించే సుం దరి అని అర్థం. అయితే త్రిపుర అనే పదానికి అర్థాలు అనేకం. ఈ దేవతకి ఉన్న మూడు వివి ధ రూపాల వల్ల కూడా ఆ పేరు వచ్చినదనిసిద్ధాంతముకలదు. భాస్కరాచార్యులు రచించిన త్రిపుర ఉపనిషత్తులో ఈ దేవ త మూడు రూపాలలోఉంటుంది. భౌతికం,సూక్ష్మ సున్నితం మూ ల మంత్రాలలో వివరించ బడినది. జపంతో పూజించబడుతుంది. పర మహోన్నతం అంతర్యాగం యంత్ర-మంత్ర ప్రయోగాలతో పూజించబడుతుంది. కదంబవృక్షములు వనముందు నివసించునదీ , ముని సముదాయమను కదం బవృక్షములనువికసిపంచేయు మేఘమాలయైనది , పర్వతముల కంటే ఎత్తైన నితంబు కలదీ , దేవతాస్త్రీలచే సేవింపబడునదీ,తామరలవంటి కన్నులు కలదీ , తొలకరిమ బ్బు వలే నల్లనైనదీ , మూడు కన్నులు కల పరమేశ్వరుని ఇల్లాలు అగు త్రిపుర సుందరి. పురాత్రయంలో రెండో శక్తి లలితా అమ్మవారు. దేవి ఉపసకులకు ఈమె ముఖ్య దేవత. త్రిగుణాతీతమైన కామేవ్వరీ స్వరూపము అమ్మ పంచదశాక్షరి మహా మంత్రా నికి అధిష్టాన దేవతగా పూ జిస్తారు లలితా మహా త్రిపుర సుందరి దేవిని. సకల లోకా తీతమైన కోమలత్వం కలిగిన మాతృమూర్తి అమ్మవారు. చెరుక గడ , విల్లు , పాశాం కు సాలను ధరించిన రూపంలో , కుడివైపున సరస్వతి దేవి , ఎడమవైపున లక్ష్మీ దేవి , సేవ లు చేస్తు ఉండగా , లలితా దేవి భక్తులనుఅనుగ్రహిస్తుంది. దారిద్రయ దుఖాలను తొల గిం చి , సకల ఐష్వర్య అభిష్టాల ను అమ్మవారు సీద్ధింప చేస్తుంది. ఈమే శ్రీ విద్యా స్వరూపిణి. సృష్టి, స్తితి, సమ్హార స్వరూపిణి! కుంకుమ తో నిత్య పూజ చేసె సువాసీనులకు ఈ తల్లీ మాంగళ్య సౌభాగ్యాన్ని ప్రసాదిస్తుంది. శ్రీచక్ర ఆరధన. కుంకుమ అ-ర్చన , లలితా అష్టోత్తరముతో అమ్మని పూజించటం ద్వారా అమ్మ ప్రీతి చెందుతుంది. మాంగళ్య బలాన్ని కోరుతుసువాసీనులకి పూజ చెయ్యాలి. ఇఛ్చాశక్తి జ్ఞాన శక్తి జ్యేష్ఠాదేవి , విష్ణువు యొక్క దేవేరిక్రియా శక్తి రౌద్రి , శివుడు యొక్క దేవేరి ఇవన్నీ సాక్ష్యాత్ అంబికా దేవి యొక్క రూపాంతరాలేలలిత అనగా ఆటలు ఆడునది అని అర్థము. సృష్టి , స్థితి మరియు లయలు దేవి యొక్క ఆటలు. అప్పుడు శ్రీ మహా విష్ణువు అతడికి హయగ్రీవ రూపములో ప్రత్యక్షమై ఎమి కొరిక అని అడగగా , మహర్షి ఆయ్నకు నమస్కరించి "పామరులైన ఈ మానవులు అందరికి మోక్షాన్ని పొందతానికి సులభమైన మార్గము ఎదైన ఉంటే , దానిని తెలియ చెయ్యవల్సిందిగా, లోక కల్యాణార్థం విష్ణువు మూర్తిని ప్రార్థనచేసాడు. దానికి హయగ్రీవుడు మానవులకు భుక్తిని , ముక్తిని , దేవతలకు శక్తిని అనుగ్రహించే తల్లి , లలి తా పరాశక్తి మాత్రమేఅని చె ప్పి ఆ లలితాచరిత్రనుఅగస్త్యుడికి వివరముగ తెలియచేసాడు. అమ్మవారు భండాసురుడు అనే లోక పీడికుడను , పరమకీ రతకుదను వధించే ఘట్టంలో దేవతలు అందరు అమ్మని ప్రార్థన చెయ్యగా , వారు చేసిన యాగం నుండి చిదగ్ని సంభుతిగాఅమ్మఆవిర్భవించింది భండాసురుదిని వధిం చటకోసమే , సమస్త లోకా ల ను , దేవజాతులను , ప్రకృ తి ని ,ప్రాణకొటిని,వస్తుజాలాన్ని , మరల సృష్టించటం , సమ్ర క్షించుకోవడం కోసమే అమ్మ ఆవిర్భవించింది. ఆ విధముగా ఉద్భవించిన లలితాదేవి శ రీరము , ఉదయిస్తున్న వెయ్యి సూర్యుల కాంతివలేప్రకాసించింది. అమ్మవారు సృష్టిలోని సౌందర్యమంతటికి అవధి! అమ్మకి మించిన సౌందర్యము లేదు. భండాసురుదిని వధించే కార్యం లో , అద్భుతమైన ఆస్చర్యకరమైన యుద్ధం చేసిన లలితకు "కరాంగూళి నఖోత్పన్న నారయణ దశాకృ తి " అనే నామం ఏర్పడింది.

## ఆదర్శ పుత్రుడు నేడే ఏ.పి.జె. అబ్దులకలాం జయంతి

లెక్చరర్ ఉమాశేషారావు



**కామారెడ్డి, అక్టోబర్ 14,(తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)**

ఆయన అడుగు జాడల్లో యువత కొనసాగలి, ఆయన ప్రతి అడుగు ఆలోచ న భారత దేశాన్ని 2020 వర కు అన్ని రంగాలలోఅభివృద్ధినిఆకాంక్షించారు. మరియుప్రయత్నించారు. అది నిజం అయిందా అంటే కొంత సందేహంతప్పదు. అవుల్ పకీర్ జైనులొద్దిన్ అబ్దు ల్ కలామ్. ఆయన ఒక పడవ నడిపే తండ్రి, తల్లి సాధారణ పేద ఉమ్మడి కుటుంబం లో పుట్టి తండ్రి కి సహాయంగా పేపర్ బాయ్ గా పనిచేసిన కష్ట జీవి. తల్లి తను చిన్న కొడుకు చదు వు కోవడం తో కొంచం ఎక్కువ అన్నం పెట్టేది. మొదట్లో తిరు చిరా పల్లి లో ఎం. ఎస్సి ఫిజిక్స్ పూర్తి చేసిన ఆయనకు సంతృ ప్తి లేదు. మద్రాస్ యూనివర్సి టీ లో ఏరో నాటికల్ స్పేస్ఇంజనీ ర్ పూర్తి చేసినారు. ఇస్రో లో శాస్త్ర వేత్తగా చేరి అనేక పరిశో ధనలకు ఆద్యుడు గా మరినా రు. పి.ఎస్.ల్.వి, ఎస్.ఎల్.వి 3 లాంటి స్వదేశీ పరిజ్ఞానంతో క్షిపణులతయారీలోకీలకపాత్రవహించారు. 1998 లో పోక్రన్ అణు పరీక్షల నిర్వహణలో బాగస్తుడు అయ్యి అణ్వాయు ధలు కల్గిన దేశాల స్థానంలో నిల్పినరు. ది హిస్టరీ ఛానెల్ , జియో ఛానెల్ వారు నిర్వహిం చిన దానిలో 2 వ స్థానంలో ఉంది. ఆయన ముస్లిం గా ఖురాన్ ఎంత చదివేవారో భగవత్ గీత అంతే చదివే వారు. పరమతసాహనం తోపాటు మానవత్వం మెండు గల వాడు 11 వ రాష్ట్రపతిగా 90 శాతం పైగా మెజారిటీ తో ఎన్నికయ్యారు పూర్తి స్థాయిలో కర్తవ్యానిర్వ హన తో పనిచేసి వ్యక్తి భారత దేశం లో ఏ ఒక్క వ్యక్తి వ్యతిరేకించని వ్యక్తిత్వం అతనిది. ముస్లిం పద్ధతి ప్రకా రం వివాహం చేసుకోక పోవ డంతప్పుకానీజీవితాంతంబ్రహ్మచారిగాఉన్నారు. ఆయన శకాహారి. ఒక లక్ష మంది విద్యార్థులతోసంభాషించాలని లక్ష్యం తో పనిచేసినడు బోధన వృత్తి అంటే ఎంతో ఇష్టం రాష్ట్ర పతి తర్వాత ఎన్నో విశ్వవి ద్యాలయల్లలోవివిధఅంశాలపై మాట్లాడినాడు. 40 విశ్వవిద్యా లయల నుండి 7 గౌరవ డాక్టరేట్స్,పద్మభూషణ్,పద్మవిభూషణ్ తో పాటు భారత రత్న కూడా అందుకున్నారు. ఇవన్నీ ఒకే ఎత్తు కేవలంఒకడ్రెస్ ,లాప్ టాప్ ,గ్రంథాలుతప్పఏమీఉంచుకోలేదు. ఎన్నో అద్భు తమై న పుస్తకాలు రాసినారు 2015 జులై 27 నాడు షిల్లాంగ్ లో ఐ.ఐ.ఎం లో విద్యార్థులను ఉద్దేశించి ప్రసం గిస్తూ కుప్ప కూలినడు. కలలుకనండి,వాటినిచేరడానికిప్రయత్నించండి. ఆయన లాంటి ఒక వ్యక్తిత్వం ఉన్నభారతదేశంచేసుకున్నపుణ్యఫలం. ఆయనఆశయాలు సాధనకు నిబద్ధతతో కూ డిన యువత తో సాధ్యం. అప్పుడే అతనికి నిజమైన జయంతి మరియు నివాళి. ఆయన భారతదేశాన్నిఏస్థాయిలోఉహించారో ఆ స్థాయి లో నిలిపే బాధ్య త నిస్సందేహంగా యువతదే.

## ఇందిరమ్మ ఇళ్లకు డబ్బుల వసూలుపై అధికారుల విచారణ



**కామారెడ్డి, అక్టోబర్ 14, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి):** కామారెడ్డి మండలం క్యాసంపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల వద్ద డబ్బులు వసూలు చేసిన వ్యవహారంపై అధికారులు విచారణ చేపట్టారు. ఓ నాయకుడు లబ్ధిదారుల వద్ద డబ్బులు వసూలు చేస్తున్నట్లు గ్రామస్తులు హౌసింగ్ కార్పొరేషన్ టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కార్పొరేషన్ అధికారులు జిల్లా కలెక్టర్ కు విచారణ జరపాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా పంచాయతీ, మండల అధికారులు బుధవారం క్యాసంపల్లి గ్రామ పంచాయతీలో విచారణ చేపట్టారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు.

## పత్తి @రూ.9,300



**ఖమ్మం :** ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం క్వింటా పత్తి రికార్డు స్థాయిలో రూ. 9,300 ధర పలికింది. సీజన్ మొదలైనప్పటి నుంచి ఇదే ఎక్కువ ధర అని ఏఎంసీ కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం క్వింటాకు కనీస మద్దతు ధర రూ. 8,667గా ప్రకటించింది. ఈ నెల 1 నుంచి 13వ తేదీ వరకు ఏడు రోజులపాటు మార్కెట్ సాగగా.. మొత్తం 40,158 బస్తాల పత్తి వచ్చింది. బుధవారం మొత్తం 7,712 బస్తాలు రాగా.. గరిష్ఠ ధర రూ. 9,300 పలకగా.. ఎక్కువ బస్తాలను రూ. 8,800(నమూనా ధర)కు వ్యాపారులు కొనుగోలు చేశారు.

## గోండు రాజుల వైభవం.. పర్యాటకులు పరవశం



**ఉట్నూరు (ఫాస్ట్ న్యూస్):** ఆదిలాబాద్ జిల్లాలోని ఏజెన్సీ కేంద్రమైన ఉట్నూరులో నెలవైన ప్రాచీన గోండు రాజుల కోటలను ఐటీడీఏ, గిరిజన సంస్కృతి, పరిశోధన సంస్థల ఆధ్వర్యంలో పునరుద్ధరించారు. ఆదివాసీ గోండు తెగకి చెందిన రాజులు క్రీ. శ. 13వ శతాబ్దంలో ఈ ప్రాంతాన్ని పరిపాలించారనడానికి ఈ కోటలు ఆనవాళ్లని చరిత్రకారులు చెబుతుంటారు. దాదాపు 5 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించిన ఈ రుజువులు ఎత్తయిన గోడలతో అలనాటి పాలకుల వైభవానికి చిహ్నంగా నిలుస్తున్నాయి. విలువైన పురాతన సంపద, చెక్కుచెదరకుండా ఉన్న ప్రాచీన కట్టడాలకు మెరుగులు దిద్ది, కోనేరును శుభ్రం చేసి మళ్లీ జీవం పోయడంతో చూపరులను ఎంతో ఆకట్టుకుంటున్నాయి. ప్రస్తుతం దసరా సెలవులు కావడంతో ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా పక్కనున్న మహారాష్ట్ర నుంచి సైతం విద్యార్థులు, పర్యాటకులు పెద్దసంఖ్యలో సందర్శిస్తున్నారు.

## పాఠశాలల బలోపేతానికి గెజిటెడ్ హెచ్‌ఎంలు పోరాడాలి

టీఎస్‌యూటీఎఫ్

**హైదరాబాద్ :** రాష్ట్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల బలోపేతానికి గెజిటెడ్ హెచ్‌ఎంలు సమష్టిగా కృషి చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి పిలుపునిచ్చారు. పాఠశాలల నిర్వహణలో హెచ్‌ఎంలు ఎదుర్కొంటున్న సమస్యలపై బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యశాలకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. అన్ని జిల్లాలకు డీఈఓలు, డివిజన్లకు డిప్యూటీ డీఈఓ, మండలాలకు ఎంఈఓలను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో కనీస బోధనేతర సిబ్బంది లేకపోవడంతో ప్రధానోపాధ్యాయులపై అదనపు భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి పాఠశాలకు కంప్యూటర్ ఆపరేటర్‌ను నియమించాలని కోరారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలను కార్యశాల ఆమోదించింది. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.వెంకట్, రాష్ట్ర కార్యదర్శులు రవికుమార్, రంజిత్ కుమార్, వెంకటప్ప, శారద తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పర్సంటైల్ తగ్గించారన్న ప్రచారం అవాస్తవం

స్పష్టం చేసిన 'ఎంసీసీ'

**హైదరాబాద్ :** నీట్ యూజీ 2026 కౌన్సెలింగ్‌లో పర్సంటైల్ తగ్గించారంటూ సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్న నోటీసు అవాస్తవమని మెడికల్ కౌన్సిలింగ్ కమిటీ (ఎంసీసీ) బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. సంబంధిత అధికారిక యంత్రాంగం పర్సంటైల్ తగ్గించేందుకుఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, ఆ నోటీసు పూర్తిగా నకిలీదని తెలిపింది. ఎంసీసీకి అధికారిక వెబ్‌సైట్ ఒకటే ఉందని, ఇతర సైట్లు లేవని స్పష్టం చేసింది.

## రికార్డు అసిస్టెంట్ నుంచి డీటీ వరకు పదోన్నతులివ్వాలి

టీజీఆర్ఎస్ఏ

**హైదరాబాద్ :** రెవెన్యూశాఖలో పెండింగ్‌లో ఉన్న రికార్డు అసిస్టెంట్ నుంచి డిప్యూటీ తహసీల్దారు వరకు అన్ని కేడర్లలో పదోన్నతుల కల్పించాలని తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (టీజీఆర్ఎస్ఏ) రాష్ట్ర అధ్యక్షుడు బాణాల రాంరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. హైదరాబాద్‌లోని రెవెన్యూ భవన్‌లో బుధవారం నిర్వహించిన అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న రాంరెడ్డితో పాటు, అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు, డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షుడు లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. "రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లకు ఎఫ్‌టీఏ, ప్రతి మండలానికి ప్రొటోకాల్ బడ్జెట్ మంజూరు చేయాలి. తహసీల్దారు కార్యాలయాల్లో మహిళా ఉద్యోగులకు మౌలిక వసతులు కల్పించాలి. వార్డ్ ఆఫీసర్ నుంచి జీపీవోగా చేరిన వారికి పురపాలక శాఖలో ప్రొబెషన్ డిక్లేర్ చేసేలా చర్యలు తీసుకోవాలి' అని కోరారు. సమావేశంలో టీజీటీఏ ప్రధాన కార్యదర్శి రమేశ్ పాక పాల్గొన్నారు.

## ఉస్మానియా' సమస్యల్ని పరిష్కరించాలి

సీఎం రేవంత్‌రెడ్డికి జాన్‌వెస్లీ లేఖ

**హైదరాబాద్ :** ఉస్మానియా జనరల్ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యల్ని తక్షణమే పరిష్కరించాలని, సమ్మె చేస్తున్న జూనియర్ డాక్టర్లను విధుల్లోకి తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం లేఖ రాశారు. ఆసుపత్రిలో మందులు, వైద్య పరికరాల కొరత, సిబ్బంది సమస్యలు, పారిశుద్ధ్య లోపాల్ని పరిష్కరించాలని కోరారు. ఆరోగ్యశ్రీ బకాయిలను విడుదల చేసి నిలిచిపోయిన శస్త్రచికిత్సలు, వివిధ విభాగాల సేవల్ని పునరుద్ధరించాలని లేఖలో పేర్కొన్నారు. జూనియర్ డాక్టర్ల బకాయి ఉపకార వేతనాల్ని విడుదల చేసి, వారి స్టైపెండ్ పెంచాలని డిమాండ్ చేశారు.

## రాహుల్ సెక్యూరిటీ డీకేను తోసేశారంటూ భాజపా దుష్ప్రచారం

**హైదరాబాద్ :** కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను..కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ భద్రతా సిబ్బంది తోసేసిందంటూ భాజపా దుష్ప్రచారం చేస్తోందని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 'రాహుల్ భద్రతే.. ఆయన సెక్యూరిటీకి ముఖ్యం. ఆయన చేపట్టిన జనహిత యాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తుండటంతో ఓర్వలేకే భాజపా తప్పుడు ప్రచారం చేస్తోంది. కర్ణాటక భాజపా, ఆ పార్టీ సోషల్ మీడియా చౌకబారు రాజకీయాలు మానుకోవాలి' అని హితవు పలికారు.

## జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా ప్రసూనాంబ బాధ్యతల స్వీకరణ



**జగిత్యాల, అక్టోబర్ 14 (తెలంగాణ పత్రిక):** జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గా ఎన్. ప్రసూనాంబ బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)లో బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆమెను అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా నియమించారు. గతంలో ఆమె తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) కార్యాలయంలో డిప్యుటేషన్‌పై విధులు నిర్వహించారు. అక్కడి నుంచి బదిలీ పై జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్‌గా నియమితులై నేడు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి కే.వై. ప్రసాద్ కలెక్టరేట్ ఏవో కిషన్ కలెక్టరేట్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

## సినీ హీరో సుమన్‌కి ఘన సన్మానం

తెలంగాణ రాష్ట్ర గొర్ల మేకల పెంపకం అధ్యక్షులు డాక్టర్ కొమ్ము అశోక్ యాదవ్




**భీమారం, అక్టోబర్ 14, తెలంగాణ పత్రిక:** రామోజీ ఫిలిం సిటీ లో కరాటే బ్లాక్ బెల్ట్ స్టంట్ మాస్టర్ సినీ రియల్ స్టార్ హీరో సుమన్ బుధవారం రోజున కలిసి ఘనంగా సన్మానించిన రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తి దారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొమ్ము అశోక్ యాదవ్ యాదవ్. ఈ సందర్భంగా అశోక్ యాదవ్ మాట్లాడుతూ.... బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అన్నా అంటే నేనున్నా అంటూ ఆపదలో ఆదుకునే ఆపద్బాంధవుడు నిరు పేదల పెన్నిధి హీరో సుమన్ అని సినిమా వెండితెరపై తన అద్భుతమైన నటనతో కళ్ళు చెదిరే మార్షల్ ఆర్ట్స్ ఫైట్స్ తో అప్పట్లో ఒక ఊపు ఊపిన భక్తి రస చిత్రాల్లో అన్నమయ్య రామదాసు వెంకటేశ్వర స్వామి శ్రీరాముడు లా దేవుడి రూపంలో ప్రేక్షకుల హృదయాల్లో దేవుని రూపానికి ప్రతిరూపంగా శాశ్వత స్థానాన్ని సంపాదించిన గొప్ప వ్యక్తి అని యాక్షన్ నుండి ఆధ్యాత్మికత వరకు ప్రతి పాత్ర కు జీవం పోసిన వెండితెర రారాజు ని కలవడం అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. అనంతరం హీరో సుమన్ మాట్లాడుతూ... సామాజిక సేవలో ఇంటర్నేషనల్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్ అవార్డు అందుకోవడం సామాన్య విషయం కాదు అని డాక్టర్ కొమ్ము అశోక్ యాదవ్ ని అభినందిస్తూ ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలు మరిన్ని చేయాలని మనస్ఫూర్తిగా మా దివ్య ఆశీస్సులు ఎల్లప్పుడూ మీతో ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ వెంకట రావు శివ కొండల్ డాక్టర్ ఎం.కె రాజేష్ పాల్గొన్నారు.

## పీఆర్ ఇంజనీరింగ్ కార్యాలయంలో బతుకమ్మ వేడుకలు



**హైదరాబాద్ :** ఎర్రమంజిల్‌లోని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ కార్యాలయంలో బుధవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా పాల్గొని మహిళా ఇంజనీరింగ్ సిబ్బందితో కలిసి బతుకమ్మ ఆడారు. మంత్రి సీతక్క తమతో కలిసి బతుకమ్మ ఆడటంతో మహిళా ఇంజనీర్లు, సిబ్బంది ఆనందం వ్యక్తం చేశారు. సంప్రదాయ దుస్తులు, రంగురంగుల పూల బతుకమ్మలతో కార్యాలయ ప్రాంగణం సందడిగా మారింది. ఉద్యోగ బాధ్యతల మధ్య పండుగ వేడుకల్లో మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

**మెరుగైన పనితీరు కనబరచాలి:** అధికారులు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ మెరుగైన పనితీరుతో శాఖకు మంచి పేరు తేవాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క ఆకాంక్షించారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. జిల్లా సీఈవోలు, డిప్యూటీ సీఈవోల అసోసియేషన్ నూతన కార్యవర్గం ప్రజాభవన్‌లో బుధవారం మంత్రి సీతక్కను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా మంత్రి సీతక్కను అసోసియేషన్ ప్రతినిధులు శాలువాతో సత్కరించి తమ కృతజ్ఞతలు తెలపగా మంత్రి సీతక్క నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ముఖ్యంగా ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వాతావరణ పరిస్థితులు, వాటి వల్ల తలెత్తే సవాళ్లను ఎదుర్కొనేందుకు అధికారులు ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని మంత్రి సూచించారు. పరిస్థితులకు అనుగుణంగా అవసరమైన చర్యలు చేపడుతూ, క్షేత్రస్థాయిలో సమన్వయంతో వ్యవహరించాలన్నారు. సీఈవోలు, డిప్యూటీ సీఈవోలు, డీఆర్‌డీవోలు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అప్రమత్తంగా ఉండాలని, విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ప్రజల అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలులో అధికారులు చొరవ చూపాలని, ప్రజలకు ప్రయోజనం చేకూర్చేలా కష్టపడి పనిచేయాలని మంత్రి సీతక్క ఆకాంక్షించారు. సమర్థవంతమైన పనితీరు, అంకితభావం, సమన్వయంతోనే శాఖ లక్ష్యాలను సాధించగలమన్నారు. శాఖ అభివృద్ధికి, ప్రభుత్వ కార్యక్రమాల విజయవంతమైన అమలుకు తమ వంతు కృషి చేస్తామని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. మంత్రి సీతక్కను కలిసిన వారిలో టీజీవో అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావుతోపాటు అసోసియేషన్ అధ్యక్షుడు ప్రేమ్‌కరణ్ రెడ్డి, జనరల్ సెక్రటరీ శ్రీనివాస్, అసోసియేట్ ప్రెసిడెంట్ నర్సింహ, ట్రెజరర్ నవీన్, వైస్ ప్రెసిడెంట్లు ప్రవీణ్, సబిత, ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంకయ్య తదితర కార్యవర్గ సభ్యులు ఉన్నారు.

# ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలి





### మంత్రి అడ్లూరి లక్ష్మణ్

**జగిత్యాల పట్టణం (తెలంగాణ పత్రిక) అక్టోబర్ 14:** ఎల్‌నినో ప్రభావం, వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకొని రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సూచించారు. జగిత్యాల జిల్లాలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కిసాన్ మేళా 2026లో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులు వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల సూచనల మేరకు శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టాలని, నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని తెలిపారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరించి పెట్టుబడి ఖర్చులు తగ్గించుకోవాలని సూచించారు. కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ పంటలు ఎండిపోకుండా అవసరమైన విద్యుత్ సరఫరా అందించేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కిసాన్ మేళాలో వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానంపై ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉత్తమ రైతులు, ఉత్తమ వ్యవసాయ అధికారులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మధుసూదన్, జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్, వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## 'తుంగభద్ర'కు రాష్ట్ర వాటా జలాలు విడుదల



**హొసపేటె :** తెలంగాణ వాటాలోని 3.09 టీఎంసీల జలాల్లో తుంగభద్ర నదికి నీటిని విడుదల చేస్తున్నామని డ్యాం ఇంజినీర్లు ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 15 రోజులకు తమ వాటాలో 2.981 టీఎంసీలను విడుదల చేయాలని తెలంగాణ ముఖ్య ఇంజినీర్ ఓ. వి. రమేశ్ బాబు తుంగభద్ర మండలికి ఇండెంట్ ఇవ్వడంతో వాటా జలాలను విడుదల చేస్తున్నామని ఇంజినీర్లు తెలిపారు. మొదటి 5 రోజులు 2,500 క్యూసెక్కులు, తరువాత ఐదు రోజులు 2,300, మిగిలిన ఐదు రోజు రోజులు 2,100 క్యూసెక్కుల చొప్పున విడుదల చేయాలని ఇండెంట్‌లో కోరారని పేర్కొన్నారు.

## పాలమూరుకే నీళ్లా.. నల్లగొండకు వద్దా?

అధికారులపై గుత్తా ఫైర్



**నల్లగొండ:** పాలమూరు-నల్లగొండ జిల్లాల సాగునీటి అంశంపై తెలంగాణ రాజకీయాల్లో మరోసారి చర్చ మొదలైంది. నీటి కేటాయింపుల విషయంలో కొందరు అధికారులు పాలకులపై ఒత్తిడి తెస్తున్నారని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. పాలమూరుకే నీళ్లన్నీ కావాలని, నల్లగొండకు నీళ్లు ఇవ్వకూడదని భావించడం సరికాదని స్పష్టం చేశారు. నల్లగొండలో మీడియాతో చిట్‌చాట్ సందర్భంగా గుత్తా మాట్లాడుతూ.. డిండి ప్రాజెక్టుకు నీళ్లు కేటాయించొద్దని అనడం ఏమిటని ప్రశ్నించారు. ఏదుల వద్ద తొమ్మిది మోటార్లను ప్రారంభించాలని సూచించారు. నల్లగొండకు నీళ్లు ఎలా ఇస్తారని ముఖ్యమంత్రిపై అధికారులు ఒత్తిడి తీసుకురావడం సరికాదన్నారు. అధికారులు చెప్పిన మాటలు విని ముఖ్యమంత్రి లేదా ఇతర పాలకులు నిర్ణయాలు తీసుకోవడం సరికాదని అభిప్రాయపడ్డారు. పాలకులు, అధికారులు పాలమూరుకే నీళ్లు రావాలని, నల్లగొండకు రావొద్దని భావించే సంకుచిత మనస్తత్వాన్ని వీడాలని హితవు పలికారు. నల్లగొండ జిల్లాలో ఫ్లోరోసిస్ కారణంగా కాళ్లు, చేతులు పనిచేయని పరిస్థితికి చేరుకున్న బాధితులు ఉన్నారని గుత్తా గుర్తుచేశారు. వలస కూలీల గురించి మాట్లాడుతున్నవారు.. జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న ఫ్లోరోసిస్ సమస్యను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం జిల్లాలో ఏడు లక్షల ఎకరాలకు మాత్రమే సాగునీరు అందుతోందని తెలిపారు. పాలమూరులో 25 టీఎంసీల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్లు ప్రారంభమైనప్పటికీ.. వాటికి నీటిని ఎక్కడి నుంచి తీసుకొస్తారనే దానిపై స్పష్టమైన ప్రణాళిక లేదని గుత్తా వ్యాఖ్యానించారు. ఏఎంఆర్పీ ద్వారా హైదరాబాద్‌లోని కోటి మందికి తాగునీరు అందించడం లేదా? అని ప్రశ్నించారు. మరోవైపు, విద్యుత్ కొనుగోలు చేయాలన్నా ప్రస్తుతం ఎక్కడా దొరికే పరిస్థితి లేదని గుత్తా అన్నారు. రబీ సీజన్‌లో ఆరుతడి పంటలు మాత్రమే సాగు చేయాలని సూచించారు. నీటి కేటాయింపుల విషయంలో తెలంగాణ ఉద్యమ లక్ష్యాలను గుర్తుచేసుకోవాలని పేర్కొంటూ, కోదండరామ్ ఈ అంశంపై సమగ్ర దృష్టితో మాట్లాడాలని అన్నారు. నీటి పంపిణీ విషయంలో అన్ని ప్రాంతాల అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలని గుత్తా సుఖేందర్‌రెడ్డి వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది.

## టోక్యో, సింగపూర్‌తో పోటీ పడతాం: సీఎం రేవంత్ రెడ్డి

హైటెక్స్‌లో సమాఖ్య 2026 గ్లోబల్ బిజినెస్ మీట్ ప్రారంభం

అంతర్జాతీయ ప్రతినిధుల హాజరు



**హైదరాబాద్ :** ప్రపంచ వాణిజ్య రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా యువత తమ నైపుణ్యాలను మెరుగుపరుచు కోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచిం చారు. కొత్త వాణిజ్య చట్టాలు, అంతర్జాతీయ వ్యాపార విధానాలపై అవగాహన పెంచుకో వడం నేటి తరానికి ఎంతో అవసరమని స్పష్టం చేశారు. హైటెక్స్ వేదికగా నిర్వహిస్తున్న"సమాఖ్య 2026 గ్లోబల్ బిజినెస్ మీట్"ను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అమెరికా, బ్రిటన్, యూఏఈ, యూరోపియన్ యూనియన్‌కు చెందిన ప్రతినిధులు హాజర య్యారు. ప్రపంచ వ్యాపార రంగంలో వస్తున్న పరిణామాలు, పెట్టుబడుల అవకాశాలు, యువ తకు అందుబాటులో ఉన్న కొత్త మార్గాలపై ఈ సదస్సు ప్రాధాన్యం సంతరించుకుంది.

**ప్రపంచంతో పోటీపడే సత్తా భారత యువత సొంతం**

భారత యువత ప్రతిభ అంతర్జాతీయ స్థాయిలో మరింతగా వెలుగులోకి రావాలని రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. అంతరిక్ష రంగంలో రాకెట్ల ప్రయోగాల నుంచి ఆధునిక సాంకేతిక ఆవిష్కరణల వరకు యువత తమ సామర్థ్యాన్ని చాటుకుంటోందని పేర్కొన్నారు. ఎలాన్ మస్క్ వంటి ప్రపంచస్థాయి పారిశ్రామికవేత్తలతో పోటీపడే స్థాయిలో భారత యువత ఎదుగుతోందని తెలిపారు. ఉన్నత లక్ష్యాలను సాధించడంతో పాటు సమాజానికి ఉపయోగపడేలా తమ ప్రతిభను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

**2047 లక్ష్య సాధనలో యువత కీలకం**

స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తయ్యే 2047 నాటికి భారత్ ప్రపంచంలో అగ్రస్థానంలో నిలవాలన్న లక్ష్యాన్ని ప్రధాని నరేంద్ర మోదీ నిర్దేశించారని సీఎం గుర్తుచేశారు. ఈ లక్ష్యాన్ని సాధించడంలో యువత నైపుణ్యాలు, పారిశ్రామిక అభివృద్ధి, సాంకేతిక ఆవిష్కరణలు కీలకమని పేర్కొన్నారు.

**దేశ ఆర్థిక ప్రగతిలో తెలంగాణకు ప్రత్యేక స్థానం**

తెలంగాణ తన జనాభా వాటాకు మించి దేశ జీడీపీలో భాగస్వామ్యం అందిస్తోందని రేవంత్ రెడ్డి తెలిపారు. పెట్టుబడులు, పరిశ్రమలు, సాంకేతిక రంగాల్లో రాష్ట్రం సాధిస్తున్న పురోగతి ఆర్థికాభివృద్ధికి దోహదపడుతోందన్నారు. ప్రపంచ వ్యాపార సంస్థలకు తెలంగాణను ఆకర్షణీయ గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని వివరించారు.

## కొండగట్టు అంజన్నను దర్శించుకున్న అదనపు కలెక్టర్ ప్రసూనాంభ



**మల్యాల, అక్టోబర్ 14 (తెలంగాణ పత్రిక):** జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ, ప్రసూనాంభ బుధవారం కుటుంబ సమేతంగా కొండగట్టులోని శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఆమెకు సాదర స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా అదనపు కలెక్టర్ ప్రసూనాంభకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మల్యాల కొడిమ్యాల తహసిల్దార్లు శ్రీనివాస్ నరేశ్ ఆర్ఐ తిరుపతి ఆలయ ఏఈఓ హరిహరనాథ్ ప్రధాన అర్చకులు మారుతి ప్రసాద్ స్థానాచార్యులు కపీందర్ ఆలయ పరిశీలకులు అశోక్ అర్చకులు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## నిరసనల పేరిట అరాచకానికి యత్నం

ప్రజాస్వామ్య హక్కులను కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు దుర్వినియోగం చేస్తున్నాయి

ఒక్కరోజే రూ.40 వేల కోట్ల విదేశీ పెట్టుబడులు వెనక్కి వెళ్లిపోయాయి

పండుగల సమయంలో ఢిల్లీ మార్కెట్లు స్తంభించిపోయాయి

సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో రైతుల ఇబ్బందులు పట్టించుకోవడం లేదు

మీడియాతో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



**న్యూ ఢిల్లీ :** కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు గత వారం రోజులుగా ఢిల్లీలో నిరసనల పేరిట డ్రామాలాడుతూ దేశంలో అరాచకం సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాయని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి విమర్శించారు. రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామ్య హక్కులను రాహుల్ గాంధీ, కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు దుర్వినియోగం చేస్తున్నాయని, దేశ ప్రతిష్టను మంటగలుపుతున్నాయని మండిపడ్డారు. బుధవారం ఢిల్లీలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో ప్రజల మద్దతు కోల్పోయి ఓడిపోతున్న కాంగ్రెస్ పార్టీ... తమ ఓటమికి ఎన్నికల కమిషన్‌ను, సుప్రీంకోర్టును బాధ్యులను చేస్తోందని కిషన్‌రెడ్డి అన్నారు. గతంలో లోక్‌సభ స్పీకర్, ఆ తర్వాత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ రాద్ధాంతం చేశారని, ఇప్పుడు తమకు అనుకూలంగా తీర్పులు రాలేదని ఏకంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) కూడా గద్దె దిగాలని బెదిరింపులకు దిగుతున్నారని విమర్శించారు. వేలాది మందితో సుప్రీంకోర్టుకు ర్యాలీగా వెళ్లి సీజేఐ పై ఒత్తిడి తీసుకురావడం దేశ చరిత్రలోనే మునుపెన్నడూ జరగలేదన్నారు.

**రాహుల్ అసత్య ప్రచారం చేస్తున్నారు..**

'ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియపై రాహుల్‌గాంధీ ఉద్దేశపూర్వకంగా అసత్య ప్రచారం చేస్తున్నారు. సర్‌సర్వేలో దేశవ్యాప్తంగా 2.8 కోట్ల మంది మరణించినట్లు తేలింది. చనిపోయిన వారి ఓట్లను తొలగించకపోతే బోగస్ ఓటింగ్ జరగదా? మరో 6.3 కోట్ల మంది ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు. కోటి మందికి రెండు చోట్ల ఓట్లు ఉన్నట్లు గుర్తించారు. అసలు ఆచూకీ లేని వ్యక్తుల ఓట్లు 3 కోట్ల వరకూ ఉన్నాయి. సికింద్రాబాద్ లోక్‌సభ పరిధిలోనే రెండుచోట్ల పేర్లున్న 9 లక్షల డూప్లికేట్ ఓట్లను తొలగించారు. 'ఒక వ్యక్తికి ఒకే ఓటు'విధానం రాజ్యాంగబద్ధం కాదా? ప్రతి పోలింగ్ బూత్‌కు కాంగ్రెస్ పార్టీకి బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) ఉన్నారు. తప్పులుంటే క్షేత్రస్థాయిలో ఆధారాలతో ఎందుకు సరిదిద్దడం లేదు. కేరళం, తమిళనాడులలో గెలిచినప్పుడు ఎస్ఐఆర్ ఎంతో మేలు చేసిందని కాంగ్రెస్ నేత రమేశ్ చెన్నితాలే స్వయంగా చెప్పారు. మరి ఇప్పుడెందుకు వ్యతిరేకిస్తున్నారు. ఇటీవల బ్యాలెట్ పేపర్లతో జరిగిన గుజరాత్, మహారాష్ట్ర, రాజస్తాన్, త్రిపుర రాష్ట్రాల్లోని స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ఘోరంగా ఓడిపోయింది..'అని కిషన్‌రెడ్డి చెప్పారు.

**పెట్టుబడులకు గండి**

'విపక్షాల బాధ్యతారాహిత్యం వల్ల ఒక్క రోజే రూ. 40 వేల కోట్ల విదేశీ పెట్టుబడులు వెనక్కి వెళ్లిపోయాయి. దసరా, దీపావళి వంటి పండుగల సమయంలో కాంగ్రెస్ చేపట్టిన నిరసనలతో ఢిల్లీ మార్కెట్లు స్తంభించిపోయాయి. చిరు వ్యా పారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రాహుల్‌గాంధీ బారికేడ్లు ఎక్కి డ్యాన్సులు చేస్తూ అసభ్యకరంగా ప్రవర్తిస్తు న్నారు. ఓ గర్భిణీ జర్నలిస్టును, మహిళా పోలీసు అధికారులను దురుసుగా నెట్టివేయడం వారి దిగజారుడుతనానికి నిదర్శనం.

**రేవంత్ ఎగిరెగిరి పడుతున్నారు**

రాహుల్‌గాంధీ గజం ఎత్తు ఎగిరితే.. సీఎం రేవంత్‌రెడ్డి తాను రెండు గజాల ఎత్తు ఎగురుతానంటూ ఎగిరెగిరి పడుతున్నారు. తెలంగాణలో బీజేపీ ధర్నాలకు పిలుపునిస్తే కనీస అనుమతి ఇవ్వకుండా ముందస్తు అరెస్టులు చేయించే రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఢిల్లీకి వచ్చి ప్రజాస్వామ్యం ఖూనీ అయిందంటూ మాట్లాడటం హాస్యాస్పదం. వర్షాల్లేక రైతులు, కరెంట్ కోతలతో పరిశ్రమలు, ప్రజలు ఇబ్బంది పడుతుంటే, వాటిని పట్టించుకోకుండా వారానికోసారి ఢిల్లీకొచ్చి రాహుల్‌ను పొగడ్తలతో ముంచెత్తి వెళ్తున్నారు..'అని కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు.

## 'పశుసంపద పెంచేలా ప్రత్యేక విధానం అమలు చేయాలి'

**హైదరాబాద్ :** పశుసంపద పెంపుదలకు ప్రత్యేక విధానం అమలు చేయాలని రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ ప్రభుత్వాన్ని కోరింది. పాలకొరతను అధిగమించేందుకు గ్రామీణస్థాయిలో కృత్రిమ గర్భధారణ సేవలను ప్రారంభించాలని అభ్యర్థించింది. బుధవారం సంస్థ చైర్మన్ చరణ్‌కౌశిక్ అధ్యక్షతన పాలకమండలి సమావేశం జరిగింది. పశుసంవర్ధకశాఖ అదనపు సంచాలకుడు సుబ్బారాయుడు, పాడిపరిశ్రమాభివృద్ధి సమాఖ్య ఎండీ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. రంగారెడ్డి జిల్లా కంసానపల్లిలోని ఫ్రోజెన్ సెమెన్ బుల్ స్టేషన్ త్వరలోనే అందుబాటులోకి తెచ్చి, పూర్తిస్థాయి ఉత్పత్తిని ప్రారంభించాలని తీర్మానించారు.

### జనగణనలో కులగణనకు ప్రధాని చొరవ చూపాలి: జాజుల

**హైదరాబాద్ :** దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న జనగణనలో తప్పనిసరిగా ఓబీసీ కులగణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయాధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన హైదరాబాద్‌లోని తమ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, "కేంద్ర ప్రభుత్వం నాలుగు రాష్ట్రాలకు నియమించిన కొత్త గవర్నర్లలో ఇద్దరు దళిత నేతలు, ఇద్దరు బీసీలకు అందులోనూ ఒక మహిళకు అవకాశం కల్పించడం అభినందనీయం. ఓబీసీ కాలం చేర్చి బీసీ కులాల లెక్కలు తీసేందుకు చొరవ చూపాలి" అని జాజుల విజ్ఞప్తి చేశారు.

Editor, Printer, Publisher and owned by B. VENKATESHAM, printed at RAMANI WEB OFFSET PRINTERS, H. NO. 8-82/11/1, Auto Nagar, village Bommakal, Mdl and District: Karimnagar - 500001. Telangana State, Published at H. NO. 9-10/7A Krishna Nagar, Bommakal Village Mdl and District Karimnagar 505001, Telangana State, Editor : B. VENKATESHAM Cell : 8341110143